ఆదివారం
గతి నెరిస్తున్న అధ్యాపకులు
ఇతర రాష్ట్రాల్లు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 144 పేజీలు: 8+16 వెల: 6.50

అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు
టిఎంసిలో పెరిగిన ఆధిపత్య పోరు
5


మంగళవారం రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన ప్రధాని

## కేంద్ర కేబినెట్ విస్తరణకు సిద్ధం!

### రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని మోడీ భేటీ

### ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు విస్తరణలో ప్రాధాన్యం!

**న్యూఢిల్లీ,జూన్ 23:** రాష్ట్రపతిభవన్‌లో అట్టహాసంగా జరిగిన పద్మ పురస్కారాలప్రధానం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రధాని నరేంద్రమోడీభేటీ కావడం రాజకీయ ప్రాధాన్యతనున సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రచారం జోరుగా సాగుతున్నవేళ ప్రధానిమోడీ భేటీకి ప్రాధాన్యం పెరిగింది. వీరి భేటీకి సంబంధించి చిత్రాలను రాష్ట్రపతి కార్యాలయం ఎక్స్‌వేదికగా విడుదలచేసింది. కేరళ బిజెపి నేత జార్జి కురియన్ కేంద్ర సహాయ మంత్రిపదవికి రాజీనామాచేసారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం కూడా తెలిపారు. ఈ పరిణామంతో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న ప్రచారం జోరందుకుంది. ఇటీవల పలువురు >>2

# 'మెట్రో'కు రైట్‌రైట్


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయిన సిఎం రేవంత్. చిత్రంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్

### ఫేజ్-1 వేల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్ నియామకం
### నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
### సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారి, రాష్ట్ర ఎంఎయుడి స్పెషల్ సెక్రటరీ
### కేంద్ర మంత్రి ఖట్టర్‌తో సిఎం రేవంత్ చర్చలలో నిర్ణయం, పాల్గొన్న కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్23:** హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం,విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం రాత్రి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్బంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, రుణ సంస్థ ఎంపిక, మెట్రో ఫేజ్-2 విస్తరణ.. నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్‌బిఐసిఏపిఎస్‌ని ఎంపిక చేశారు. మెట్రో ఫేజ్-1వాల్యుయేషన్... ఫేజ్-2విస్తరణ...ఇతర అంశాలపై ఎస్‌బిఐసిఏపిఎస్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (ఎంఏ అండ్ యుడి) శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో >>2


పద్మశ్రీ అందుకుంటున్న సినీ నటులు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్



మంగళవారం న్యూఢిల్లీలో మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారాన్ని అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

## వికసిత 'పద్మా'లు

### మమ్ముట్టికి పద్మభూషణ్, మురళీ మోహన్ రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ప్రదానం

### రెండో విడత పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**పద్మవిభూషణ్:** పి.నారాయణ, జస్టిస్ కెటి థామస్
**పద్మభూషణ్:** నోరి దాత్తాత్రేయుడు, డా. విజయ్ అమృత్‌రాజ్, అల్కాయాగ్నిక్ మొ..
**పద్మశ్రీ:** మాధవన్, రోహిత్ శర్మ, వెంపటి శశిశేఖర్ మొ..

**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశంలో పద్మ అవార్డుల రెండో విడత ప్రధానం అత్యంత ఘనంగా జరిగింది. రాష్ట్రపతిభవన్‌లోనిదర్బారీ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో మళయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంమాజీ న్యాయమూర్తి జెస్టిస్ కెటి థామస్‌లు పద్మ >>2

## పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

### 5 రోజులు భారీ వర్ష సూచన

### రాష్ట్రంలో పూర్తిగా విస్తరించిన రుతుపవనాలు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుండి తెలంగాణ మీదుగా ఒక బలమైన ద్రోణి నడుస్తోంది. దీనికి తోడు రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కూడా తోడైంది. రాయ



లసీమ, తమిళనాడు మీదుగా తెలంగాణ నుంచి మన్నార్ గల్ఫ్ వరకు ఒక ద్రోణి కొనసాగుతోది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు తెలంగాణలో విస్తరి స్తున్నాయని వాతావరణ కేంద్ద్రం వెల్లడించింది. ఈ రెండింటి కాంబినేషన్‌వల్ల బంగాళాఖాతం నుంచి తేమ గాలులు రాష్ట్రంలోకి వస్తున్నాయి. వీటి ఫలితంగా తెలంగాణలో నైరుతి రుతుపావనాలు చురుగ్గా కదులుతున్నాయి.దీంతో తెలంగాణ అంతటా మంగళవారం నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, రాబోయే ఐదు రోజుల రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మరి కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు, పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, >>2


ఎసిబికి చిక్కిన మల్లారెడ్డి

## ఎసిబి వలలో మరో భారీ 'తిమింగలం'

### నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వద్ద రూ. 3 కోట్ల అక్రమాస్తులు

### అల్వాల్, మరిన్ని చోట్ల ఎసిబి సోదాలు

**అల్వాల్, జూన్ 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ అధికారుల అవినీతికి అంతు లేకుండా పోతోంది. ఎక్సైజ్ సూపరిండెంట్ ఆదాయానికి మించి ఆస్తులు పోగేసిన >>2


# ధాన్యం కొనుగోళ్లు పెంచండి


మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల నాగేశ్వరరావు

### సిఎంఆర్ గడువునూ పొడిగించాలని కేంద్రానికి వినతి

### ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలసి లేఖ అందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 23:** తెలంగాణ రైతుల ప్రయోజనాల పరిరక్షించడానికి ప్రస్తుత రబీ దిగుబడిలో 80.09లక్షల మె.ట ధాన్యం నుంచి వెలువడే 54.50 లక్షల మె.ట బియ్యం కేంద్రమే సేకరణ చేయాలనీ లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.రాష్ట్రంలో రబీ 2025-26 సీజన్‌లో రికార్డు స్థాయిలో జరిగిన వరి కొనుగోళ్ల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన సేకరణ లక్ష్యాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని, అలాగే కస్టమ్ మిల్లింగ్‌రైస్ సరఫరా గడువులను పొడిగించాలని కోరుతూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార,ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు.సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలసి మంగళవారం ఉదయం కొత్త ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని కలసి లేఖను అందజేశారు.అనంతరం కొత్త ఢిల్లీ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధరకు ఒక్కగింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. రబీవరి ఎక్కువగా ఉప్పుడు బియ్యం తయారీకి అనుకూలంగా ఉండటంతో బాయిల్డ్ రైస్ రూపంలో సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కూడా కోరారు. భవిష్యత్తులో ఖరీఫ్ 2026- 27 సీజన్‌కు >>2



## కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజీనామా

### రాష్ట్రపతి ముర్ము ఆమోదం

### ముగిసిన రాజ్యసభ పదవీకాలం

**న్యూఢిల్లీ, జూన్ 23:** రాజ్యసభ సభ్యత్వ కాలం ముగియడంతో, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ మంత్రిమండలికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపి ఆయనను తిరిగి నామినేట్ చేయలేదు. దీంతో ఆయన తన పదవిని వదులుకోవాల్సి వచ్చింది. కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు రాష్ట్రపతి భవన్ మంగళవారం తెలిపింది. కురియన్ మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖలో కూడా కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రధాన మంత్రి >>2



### మాజీ సర్పంచ్ ఆత్మహత్య

గ్రామాభివృద్ధి బిల్లులు రాకపోవడమే కారణం?

కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్‌ల రాస్తారోకో 3

## మా నేలలోనే చస్తాం..

### ఫారెస్ట్ అధికారులపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే

### కుమురంభీం జిల్లాలో పోడు పోరు తీవ్రం

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 23, ప్రభాతవార్త:** మా భూములు మాకే కావాలి... మేము చనిపోయినా సరే మా భూమిలోనే చస్తాం అంటూ పోడు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోడు భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట పోడు రైతులు >>2


మంగళవారం ఆసిఫాబాద్‌లో రైతులకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



# కొత్త సిఎస్‌గా సంజయ్ జాజు?

### లైన్ క్లియర్ అయినట్లేనా?

### కేంద్ర సర్వీసుల నుంచి తెలంగాణకు రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్23:** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర సీఎస్‌గా సేవలందిస్తున్న కె. రామకృష్ణా రావు పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సీఎస్ ఎంపికపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని మన్నించిన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి మాతృ రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర పరిపాలనపై సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన్ను.. సీఎస్ స్థానంలో నియమించేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే సోమవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంజయ్ జాజు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో తాజా పరిణామాలు, పరిపాలనాపరమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. కాగా, సిఎస్ పోస్టుకు 1992 బ్యాచ్‌కు చెందిన మరో ఇద్దరు సీనియర్ అధికారులు జయేశ్‌రంజన్, వికాస్‌రాజు కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం సిఎస్‌గా ఉన్న రామకృష్ణారావు ఈనెల 30న రిటైర్ కానున్నారు. ఇప్పటికే 10 నెలల పాటు ఎక్స్‌టెన్షన్‌లో(రెండు దఫాలు) ఉన్నారు. మూడో దఫా ఆయన పదవీకాలాన్ని రెండు నెలల పాటు పొడిగింప చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రయత్నాలు చేశారని ప్రచారం. కేంద్రం అంగీకరించనందునే సిఎస్ స్థానంలో స్పెషల్ సిఎస్‌లుగా ఉన్న సంజయ్‌జాజు,జయేశ్‌రంజన్,వికాస్ రాజు పేర్లను సిఎం పరిశీలించారని తెలుస్తోంది. రాష్ట్రానికి చెందిన కేడర్ అయిన సంజయ్ జాజు దాదాపు 15 ఏళ్లుగా రాష్ట్ర పాలనకు దూరంగా ఉన్నారు. కేంద్ర సర్వీసులోనే ఎక్కువ కాలం సేవలు అందించారు. అయినప్పటికీ సంజయ్ జాజుకే సిఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపారని తెలుస్తోంది. కాగా, సిఎం రేవంత్ మూడు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశారు.



## సర్టిఫికెట్ల కోసం బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లా?

### కాలేజీ యాజమాన్యాల వింత ధోరణి

### ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు లబోదిబో

### హైకోర్టులో నేడు కేసు విచారణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 23:** తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్, వృత్తి విద్య కోర్సులు పూర్తయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీల నుంచి పొందాలంటే బ్లాంక్ చెక్ అయినా ఇవ్వాలి, లేదంటే ప్రామిసరీ నోటైనా ఇస్తేగానీ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదు. తమ కోర్సు పూర్తియిన తరువాత విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలన్నా, ఇక్కడే ఇతర ఉన్నత విద్యలో చేరాలన్నా, క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగం సంపాదించిన వారు ఆయా కంపెనీలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను ఇవ్వాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో ఈ ఏడాది ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ప్రైవేటు కాలేజీలు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను ఇవ్వకుండా తమకు ఫీజులను చెల్లించాలని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కోరుతున్నాయి. వారు ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదని వస్తే మీరే తీసుకుంటారు కదా? అని మాట్లాడితే.. అందుకు కాలేజీ యాజమాన్యాలు గత మూడేళ్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫీజులను చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులను యాజమాన్యాలు కోరుతున్నాయి. ఫీజులు చెల్లించిన వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇస్తున్న యాజమాన్యం.. ఫీజులు చెల్లించని వారి నుంచి బ్లాంక్ చెక్‌లను తీసుకోవడం, లేదంటే ఇన్ని నెలల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోతే తామే ఫీజులను చెల్లిస్తామని ప్రామీసరీ నోట్ రాసిస్తే ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీ యాజమాన్యాలు ఇస్తున్నాయి. గత మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల నేపథ్యంలో కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు రీయింబర్స్‌మెంట్ అంశంలో హైకోర్టును ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఏడాది 2026-27 విద్యాసంవత్సరం నుంచి విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేసి.. తరువాత ప్రభుత్వం ఫీజు >>2



లక్నోలో మంగళవారం అగ్నిప్రమాద బాధితులను ఆసుపత్రిలో పరామర్శిస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

>> గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో జూన్ 24 నుంచి 26 మధ్య వర్షాల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. ఈ నెల 24న వరంగల్, మహబూబాబాద్, హన్మ కొండ, ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం కూడా ఈ జిల్లాల్లో భారీ వర్షాలు పడనున్నాయని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావడం, చెట్లు కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజులు వానల పీక్ స్టేజ్‌లో ఉంటాయని వెల్లడించింది. రాష్ట్రంలోని నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో వానలు దంచికొడతాయి.

**అత్యధికంగా పెద్దపల్లిలో 71 మిల్లీ మీటర్ల వర్షపాతం**

రుతుపవనాలు, ద్రోణి, ఉపరితల ఆవర్తం ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా పెద్దపల్లి జిల్లాలో 71.2 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. అలాగే హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని రంగారెడ్డి, సంగారెడ్డి, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, కామారెడ్డి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్థంభించింది. వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం మండలంలోని దొడ్ల మల్యాల వద్ద గల మట్టి రోడ్డు తూములతో సహా కొట్టుకొని పోయింది. దీంతో మండల కేంద్రంతో పలు గ్రామాలకు సంబంధం తెగిపోయింది. రూ.60 లక్షలతో చేపట్టిన వీటి పనులు ఒక్క వర్షానికే గంగ పాలు అయ్యింది. అలాగే మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక పోచమ్మ దేవాలయం నీట మునిగింది.

# మరో భారీ తిమింగలం'

>> నేపథ్యంలో ఎసిబి వలలో చిక్కారు. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కొమ్మూరి మల్లారెడ్డికి చెందిన అల్వాల్‌లోని ఇంటితో సహా ఏక కాలంలో పది చోట్ల ఎసిబి అధికారులు దాడులు చేశారు. 3 కోట్లు పైగా అక్రమాస్తులు గుర్తించగా వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రెండింతలు ఉండే అవకాశం ఉంది. మంగళవారం తెల్లవారు జాము నుంచి నిజామాబాద్ కార్యాలయంతో పాటుగా అల్వాల్‌లోని ఆయన నివాసం బందు మిత్రులకు చెందిన ఇళ్ళపై ఎసిబి దాడులు నిర్వహించింది. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట్ ప్రాంతాలులో మల్లారెడ్డి కూడబెట్టిన అక్రమాస్తులు బయట పడ్డాయి. సోదాలులో 4 నివాస ఇండ్లు, 8 ఓపెన్ ప్లాట్లు, 10.23 ఎకరాలు వ్యవసాయ భూమి, ఒక కమర్షియల్ బ్లాక్‌కు చెందిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అల్వాల్‌లోని ఇంటిలో 3.31 లక్షలు నగదు, 50లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, మూడు బ్యాంక్ లాకర్లు గుర్తించారు.

ఒక విటారా కారు, టివిఎస్ స్కూటీని అధికారులు సీజ్ చేశారు. ఇదిలా ఉండగా మల్లారెడ్డి కుటుంబం అల్వాల్‌లో నివాసం ఉంటోంది. ఇక్కడ మూడంస్తుల భవనం ఆయనకు ఉంది. ఎసిబి సోదాలు సందర్భంగా ఇంటిలో ఆయన భార్య ఉన్నారు. నిజామాబాద్‌లో మల్లారెడ్డిని అదుపులోకి విచారణ అనంతరం ఆయనను అల్వాల్‌లోని ఇంటికి తీసుకుని వచ్చారు.

ఇంట్లో లభించిన పత్రాలుతో విచారణ జరిపారు. బ్యాంక్ లాకర్లు తెరిస్తే మరిన్ని వివరాలు బయట పడే అవకాశం ఉందని నిజామాబాద్ జిల్లా ఎసిబి అధికారి నరేష్ తెలిపారు. సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందన్నారు. మల్లారెడ్డిని బుధవారం న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామని తెలిపారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణకు సిద్ధం!

>> కేంద్ర మంత్రులకు వారి వారి రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించడం దీనికి మరింత బలం చేకూరింది. కేంద్ర రోడ్డురవాణా సహాయమంత్రి హర్ష్ మల్హోత్రాను ఢిల్లీబిజెపి అధ్యక్షుడుగా పార్టీ అధ్యక్షుడు నితిన్‌నబిన్ నియమించారు.

త్వరలో ఎన్నికలకు వస్తున్న రాష్ట్రాలకు మంత్రివర్గంలోప్రాధాన్యం ఇస్తారన్న అంచనాలూన్నాయి. అదేక్రమంలో ఇతర పార్టీలనుంచి బిజెపిలోకి, ఎన్డీయేలోకి వచ్చినవారిని మరికొందరిని కేబినెట్‌లోకి తీసుకుంటారని చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పద్మ పురస్కారాల తర్వాతనే మోడీ రాష్ట్రపతితో భేటీ కావడం కేబినెట్ విస్తరణ అంశాలు తెరపైకి వచ్చాయి.

# వచ్చే 'నీట్' ఆన్‌లైన్

## స్పష్టం చేసిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 23:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) (యూజీ) ప్రవేశ పరీక్షను వచ్చే సంవత్సరం 2027 నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. నీట్ పరీక్ష నిర్వహణలో. పేపర్ లీకేజీలు, అక్రమాలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా 2027 నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) మోడ్‌లో నిర్వహిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు.

నీట్ పరీక్ష నిర్వహణలో రాధా కమిటీ సిఫార్సులను అమలు చేయాలని నిర్ణయించారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాధా కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లుగా మంత్రి ధర్మేద్ర ప్రధాన్ వెల్లడించారు. పరీక్షల భద్రతను పటిష్ఠం చేసేందుకు రాధా కమిటీ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానాన్ని సిఫార్సు చేసిందని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి నీట్‌ను పూర్తిగా సిబిటి విధానంలోనే నిర్వహించడానికి తాము సన్నద్ధమవుతున్నాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు కూడా ఇకపై ఈ ఆన్‌లైన్ విధానానికి అనుగుణంగానే తమ ప్రిపరేషన్‌ను కొనసాగించాలని కేంద్ర మంత్రి సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# జార్జ్ కురియన్ రాజీనామా

>> నరేంద్ర మోడీ సలహా మేరకు, కేంద్ర మంత్రిమండలి నుండి కురియన్ రాజీనామాను భారత రాష్ట్రపతి తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆమోదించారని అధికారిక ప్రకటన పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంలో క్రైస్తవ వర్గానికి చెందిన ఏకైక మంత్రి బహుశా కురియన్ మాత్రమే. జూన్ 21వ తేదీన ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టు, కురియన్‌ల పదవీకాలం ముగుస్తు న్నప్పటికీ, జూన్ 18న జరిగిన రాజ్యసభ ఎన్నికలకు వారిని తిరిగి నామినేట్ చేయలేదు. 65 ఏళ్ల కురియన్ 1980లో బిజెపి ఆవిర్భావం నుండే పార్టీలో సభ్యుడిగా ఉన్నారు.

ఆయన బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, భారతీయ జనతా యువ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడిగా, బిజెపి కేరళ విభాగం ఉపాధ్యక్షుడిగా వివిధ పదవులను చేపట్టారు. భారత సుప్రీంకోర్టులో న్యాయవాదిగా కూడా ప్రాక్టీస్ చేశారు.

ఆయన జూన్ 9, 2024న కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందు, కురియన్ జాతీయ మైనారిటీల కమిషన్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

# నేలలోనే చస్తాం

>> ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా కేంద్రానికి చేరుకొని రైతులకు సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొని రైతులతో కలిసి మేము రైతులం, దేశానికే అన్నం పెట్టే రైతులం, మా భూములను లాక్కోవడం కంటే మమ్మల్ని అందరిని ఇక్కడే చెట్లకి ఉరి తీయండి అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోడు భూముల సమస్యను గుర్తించి లక్షలాది ఎకరాలకు పట్టాలు ఇచ్చారని, కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారని, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలతో రైతుకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన, ఆదివాసీ రైతులకు అన్యాయం జరగనివ్వనని రైతులకు భరోసా కల్పించారు. సర్వే పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని, విత్తనాలు వేసుకునే సీజన్‌లో ఆటంకాలు కలిగించవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాడుతానని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వందలాది మంది పోడు రైతులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

24-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
దశమి సా.6.15
చిత్త మ.2.01
వర్జ్యం : రా.8.12-రా.9.58
దు. ఉ.11.43-మ.12.35
శుభసమయం:ఉ.7.00-8.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మోసకారి మాటలు చెప్పే వారి నుండి దూరంగా ఉండండి.

**వృషభం:** ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు. తద్వారా లాభపడతారు. ఉద్యోగాలపరంగా రాణిస్తారు. వస్త్రలాభం.

**మిథునం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. సహోదర, సహోదరీ వర్గం వారికి విశేషంగా సహాయ సహకారాలు అందిస్తారు.

**సింహం:** ఆస్తుల విలువ అనూహ్యంగా పెరుగుతుంది. ఉద్యోగంలో నూతన బాధ్యతలు స్వీకరిస్తారు. వాహన సౌఖ్యం.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. పనుల నిదానంగా పూర్తిచేస్తారు. గృహనిర్మాణ యత్నాలు.

**తుల :** వ్యతిరేక వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. విదేశాలలోని బంధువులకు సాయం అందిస్తారు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. విద్యార్థులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. పెద్దల సలహాలతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** వృత్తిలో వత్తిడి ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. వాహనాల కొనుగోలు.

**కుంభం:** వివాదాస్పదమైన అంశాలతో తలదూర్చకండి. "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నారు.

**మీనం :** తియ్యని మాట తీరు ఎంతటి కార్యాన్నయినా సులువు చేస్తుందని గ్రహిస్తారు. సహూద్యోగులతో సామరస్యంగా మెలగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వికసిత 'పద్మా'లు

>> విభూషణ్‌లు అందుకోగా సినీరంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తోపాటుప్రఖ్యాతవైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు డా.విజయ్ అమృత్‌రాజ్, డా.ఎస్కేఎం మేలినాథన్, శిబుసోరెన్(మరణానంతరం), నేపథ్య గాయని అల్కాయాజ్ఞిక్, వెల్లపల్లి నటేషన్ పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి సినీ నటులు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. వీరితోపాటు తమిళనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్‌శర్మ ఇతర పలు రంగాలప్రముఖులకు పద్మ పురస్కారాలు వరించాయి. మొత్తం 131 మందిని పద్మపురస్కారాలకు ఎంపికచేయగా తొలివిడతలో 66 మందికి ఎంపికచేస్తే మిగిలినవారికి మంగళవారం ప్రధానంచేసారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్; కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పియూష్‌గోయల్, ధర్మేంద్రప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డులు పొందినవారిలో నూరుద్దీన్ అహ్మద్, తిరువారూర్ భక్తవత్సలం, డా.కృష్ణమూర్తి బాల సుబ్రహ్మణ్యన్, బ్రిజ్‌లాల్‌భట్, తరుణ్ భట్టాచార్య, జ్యోతిష్ దేబ్‌నాథ్, డా.జోగేష్ దేవురీ, భిక్యాల లడక్యా ధిండా, డా.అర్మిందా ఫెర్నాండెజ్, డాక్టర్ చంద్రమౌళి గడ్డమనుగు, డాక్టర్ ప్రేమ్‌లాల్ గౌతమ్, డా.రాజాస్తపతి కలియప్ప గౌండర్, డా.పద్మ గుర్మెట్, అశోక్‌కుమార్ హల్దార్, డాక్టర్ సురేష్ హంగావాడి, శ్రీచరణ్ హెంబ్రమ్, డా.శుభా వెంకటేశ ఐయ్యంగార్, టిటి జగన్నాథన్ (మరణానంతరం), సంత్ నిరంజన్‌దాస్‌జీ, ప్రొఫెసర్ వీఝినాథన్ కామకోటి, ప్రొఫెసర్ మంగలా కపూర్, డాక్టర్ అశోక్ ఖాడే, డి. లియుడ్‌మీలా ఖోఖోల్వా, డా.ప్రభాకర్ బసాప్రభుకోరే, శ్రీమతి పోఖిలా లేఖథేపీ, మామిడి రామారెడ్డి (మరణానంతరం), ఆర్‌విఎస్ మణి, శ్రీమంతి కళామండలం విమలా మీనన్, వ్లాదిమీర్ మెస్తివిరిష్‌విలి (మరణానంతరం), మోహన్‌నాగర్, డా.పుణ్యమూర్తి నటేషన్, శర్‌కుమార్‌పాత్ర, గురుసంగ్యసంగ్ పాంగెనేర్, సవితా పూనియా, కవీంద్ర పురకాయస్థ (మరణానంతరం), హగవాన్‌దాస్ రైక్‌వార్(మరణానంతరం), ప్రొఫెసర్ కె.రామస్వామి, శ్రీమతి రంజని, శ్రీమతి గాయత్రి, డా.అనిల్‌కుమార్ ర్తోగి, ప్రొఫెసర్ మహేంద్రనాథ్‌రాయ్, సతీష్‌షా (మరణానంతరం), ప్రొఫెసర్ ప్రతీక్ శర్మ, రోహిత్ గురునాథ్‌శర్మ, సర్దార్ ఇందర్‌జీత్ సింగ్ సిద్ధు, రఘుపత్‌సింగ్ (మరణానంతరం), ఖేమ్‌రాజ్ సుంద్రియాల్, డా.భుద్రి తాతి, డా.కుమారస్వామి తంగరాజ్, రబిలాల్ తుడు(మరణారంతరం) నరేష్ చంద్రదేవ్‌వర్మ, వెంపటి శశిశేఖర్, చిరంజీలాల్‌యాదవ్‌లు రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు.



మంగళవారం న్యూఢిల్లీలో నోరీ దత్తాత్రేయుడుకు పద్మభూషణ్ పురస్కారాన్ని అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

# సర్టిఫికెట్ల కోసం బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లా?

>> రీయింబర్స్‌మెంట్ విడుదల చేసినప్పుడు విద్యార్థులు చెల్లించిన ఫీజులను తిరిగి చెల్లించాలని హైకోర్టు సూచించింది. ఇందుకు ప్రభుత్వం తరపున విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని కోరితే అందుకు హైకోర్టు అంగీకరించలేదు. దీంతో విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరం నుంచి నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వారి అకౌంట్‌లోనే జమ చేస్తామని చెబుతూ ఉత్తర్వులిచ్చింది. అయితే వాటిలో ఎప్పటిలోగా రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తారో చెప్పకపోవడంతో హైకోర్టు తీర్పుపై స్టేట్ కో కొనసాగుతుందని ప్రకటించింది. దీంతో ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నంబర్ 7ను రద్దు చేస్తూ జీవో నంబర్ 8ను జారీ చేసింది. దీంతోపాటు విద్యార్థులకు ఈ ఏడాది 2026-27 విద్యా సంవత్సరం నుంచి నాలుగు విడతల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రిలీజ్ చేస్తామని సెంట్రల్ షేర్‌తోపాటు స్టేట్ షేర్‌ను కూడా రిలీజ్ చేస్తామని ఇలా ఏడాదిలో నాలుగు విడతలుగా రిలీజ్ చేస్తామని అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పేర్కొంటూ జీవో ఎంఎస్ నంబర్ 9ను జారీ చేసింది. నేడు(బుధవారం) హైకోర్టులో ఇదే అంశంపై విచారణ జరగనుంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 9పై హైకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వనుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు అటు కాలేజీ యాజమాన్యాలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రంలో గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు రూ. 10వేల కోట్ల వరకు ఉన్నాయి. వాటిలో రూ. 400 కోట్లను కొద్ది నెలల క్రితం మంజూరు చేసింది. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోతే కాలేజీలను నడిపించబోమని, విద్యార్థులకు పరీక్షలను సైతం నిర్వహించబోమని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు బంద్‌ను నిర్వహిస్తే ప్రభుత్వం కొంత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసింది. ఇపుడు తిరిగి కొత్త విద్యా సంవత్సరం 2026-27 అకడమిక్ ఇయర్ ఈ నెల 1 నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు కాలేజీలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలంటే మెలిక పెడుతున్నాయి.

## ప్రపంచాన్నే అధిగమించే స్థాయికి

# ఉత్తరకొరియా అణ్వాయుధ వ్యవస్థ

**ప్యాంగ్యాంగ్, జూన్ 23:** అణ్వాయుధాల విషయంలో ఉత్తర కొరియా మరోసారి దూకుడు ప్రదర్శించింది. దేశ అణ్వాస్త్ర సామర్థ్యాన్ని మరింతగా పెంచి ప్రపంచాన్నే అధిగమించే స్థాయికి తీసుకెళ్లాలని ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ పిలుపునిచ్చారు. కొరియా వర్కర్స్ పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ ప్రపంచాన్ని కలవరానికి గురిచేస్తున్నాయి. దక్షిణ కొరియాను తమ ప్రధాన శత్రుదేశంగా ఉత్తర కొరియా మరోసారి అభివర్ణించింది. అమెరికాదక్షిణ కొరియా సైనిక సహకారాన్ని తీవ్రంగా విమర్శించింది. ఇటీవల జరిగిన న్యూక్లియర్ కన్సల్టేటివ్ గ్రూప్ (ఎన్‌సీజీ) సమావేశం తమపై అణు యుద్ధ ప్రణాళికలకే వేదికగా మారిందని ఆరోపించింది. దక్షిణ సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేయాలని, కొత్త నౌకాదళ స్థావరాలు నిర్మించాలని కిమ్ సూచించారు. 10 వేల టన్నుల సామర్థం గల వ్యూహాత్మక క్షిపణి క్రూజర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది. సరిహద్దు ప్రాంతాల్లో కొత్త ఆయుధ వ్యవస్థల మోహరింపుపైనా దృష్టి పెట్టింది. ఇదే సమయంలో పార్టీ అగ్ర నాయకత్వంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొందరు కీలక నేతలకు పదోన్నతులు లభించగా, మరికొందరిని పదవుల నుంచి తప్పించారు.




రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో న్యూఢిల్లీలో విడియోకాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

# 'మెట్రో'కు రైట్‌రైట్

>> ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి.

40 నిమిషాల పాటు సంయుక్త సమావేశం:-మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్ (రైల్వే శాఖ), జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్రరాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు.

కన్సల్టెంట్‌గా ఎస్‌బిఐసిఏపిఎస్ ఎంపిక.. విధివిధానాలు ఇవే:-మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను ఎస్‌బిఐసిఏపిఎస్(ఎస్‌బిఐ క్యాపిటల్ మార్కెట్స్) కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది.

ఫేజ్1 వాల్యూయేషన్:-ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ (వాల్యూయేషన్) రుణ సేకరణపై ఎస్‌బిఐసిఏపిఎస్ రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది.

ఫేజ్2 నివేదిక:- ఫేజ్2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ప్రభుత్వాల నిర్ణయం:- ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. ప్రక్రియను వేగవంతం చేసేందుకు సమన్వయ కమిటీ:-

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఏ అండ్ యుడి) ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్‌లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# కొనుగోళ్లు పెంచండి

>> సంబంధించి కేంద్రం నిర్ణయించే సేకరణ లక్ష్యాలు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే ఉత్పత్తి, కొనుగోలు అంచనాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి సూచించారు. ఖరీఫ్, రబీ కలిపి 2025-26 మార్కెటింగ్ సీజన్‌లో తెలంగాణలో 152 లక్షల మె.ట కుపైగా వరి సేకరణ జరిగి చారిత్రాత్మక రికార్డు నమోదైందనీ చెప్పారు. అయితే రాష్ట్రం పంపిన ఉత్పత్తి అంచనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వరి సేకరణ లక్ష్యాలను తక్కువగా నిర్ధారించడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని చెప్పారు. రబీ ప్రస్తుత సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలు సమర్పించినప్పటికీ, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (51.47 లక్షల మె.ట ధాన్యం) మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని వివరించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర లక్ష్యాలను మించి కొనుగోళ్లు నిర్వహించిందన్నారు. గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి తెలంగాణ ప్రభుత్వం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు ఎంఎస్‌పి భారం పడిందని ఉత్తమ్ వెల్లడించారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేసి వారి ఆదాయాన్ని కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు.

సిఎంఆర్ సరఫరా అంశంపై కూడా మంత్రి కేంద్ర దృష్టికి కీలక విషయాలను తీసుకెళ్లారు. రబీ 2024-25కు సంబంధించి ఇంకా 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, ఖరీఫ్ 2025-26కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. నిల్వ స్థలాల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై ఒత్తిడి వంటి కారణాల వల్ల గడువులు పొడిగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రబీ 2024-25 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025-26 గడువును 120 రోజులు పొడిగించాలని కేంద్రాన్ని కోరాననీ తెలిపారు. అలాగే రబీ "రైతు ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని, రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర లభించేలా అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటాం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# టీచర్ల సర్దుబాటుపై కలెక్టర్లకు పూర్తి అధికారం

## పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్23:** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపు, మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. జిల్లాల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి, పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా అవసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టే పూర్తి అధికారాలను ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న వర్క్ అడ్జస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) కింద అవసరమైన పాఠశాలలకు డెప్యూటేషన్‌పై పంపిన ఉపాధ్యాయులను ప్రస్తుతానికి రిలీవ్ చేయవద్దని జిల్లా విద్యాశాఖాధికారులకు (డిఈఓ) విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సదరు డెప్యూటేషన్ పాఠశాలలో ఆయా సబ్జెక్ట్ టీచర్ల అవసరం ఉన్నంత కాలం వారు ప్రస్తుత పాఠశాలల్లోనే కొనసాగేలా చూడాలని మండల విద్యాధికారులు(ఎంఈఓ), ప్రధానోపాధ్యాయులను(హెచ్ఎం) ఆదేశించింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పదవీ విరమణ(రిటైర్మెంట్), దీర్ఘకాలిక సెలవులు లేదా ఇతర కారణాల వల్ల ఖాళీలు ఏర్పడితే, విద్యార్థుల చదువులకు నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. జిల్లాల్లో పాఠశాలలు సజావుగా నడవడానికి వీలుగా, జిల్లా కలెక్టర్ ఆమోదంతో మిగులు ఉపాధ్యాయులను అవసరమైన చోట్లకు డెప్యూటేషన్‌పై పంపేందుకు డీఈఓలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ సర్దుబాటు ప్రక్రియ మొత్తాన్ని ఈనెల 20 నాటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ సంఖ్యను ప్రాతిపదికగా తీసుకుని జీఓ నెంబర్ 25 మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల వారీగా, సబ్జెక్టుల వారీగా విశ్లేషించి పూర్తి చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులో పేర్కొంది.

# అంగన్‌వాడీల్లో 15,982 ఉద్యోగాలు

## నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్23:** అంగన్‌వాడీల్లో 15,982 పోస్టుల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే పెద్దపల్లి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నోటిఫికేషన్లు వచ్చాయి.

త్వరలో మిగిలిన జిల్లాల్లోనూ రానున్నాయి. మల్టీజోన్1 పరిధిలో 1853 టీచర్, 7737 హెల్పర్లు, మల్టీజోన్2 పరిధిలో 1247 టీచర్, 5145 హెల్పర్ పోస్టులు ఉన్నాయి. ఇంటర్ పూర్తి చేసిన స్థానికులకు కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా ఎంపిక కమిటీ(డిఎస్‌సి) ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది.

# మాజీ సర్పంచ్ ఆత్మహత్య

## గ్రామాభివృద్ధి బిల్లులు రాకపోవడమే కారణం?

### కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్‌ల రాస్తారోకో

**హుస్నాబాద్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త:** హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ మాజీసర్పంచ్ పిట్టల సంపత్ మంగళవారం వ్యవసాయ బావివద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సంపత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నారని ఆయన కుటుంబసభ్యులు, బంధువులు పేర్కొంటు న్నారు. ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, సంపత్ ఆత్మహత్యకు గ్రామాభివృద్ధి పనులకు చేసిన ఖర్చుల బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణమని పలువురు మాజీ సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధి కోసం తనకు సంబంధించిన మామిడి తోటను విక్రయించి వచ్చిన డబ్బుతో అభివృద్ధి పనులు చేపట్టారని, అయితే ఆ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సంపత్ కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు హుస్నాబాద్– కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో కొంతసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీ సులు ఆందోళన కారులతో చర్చించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలను పోలీసులు విచారణ ద్వారా తెలు సుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాజీ సర్పంచ్ సంపత్ మృతితో మహమ్మ దాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, ప్రజాప్రతి నిధులు ఆయన మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సర్పంచ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం అందించి, పెండింగ్ బిల్లుల అంశంపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు, మాజీ ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# రేవంత్ అడిగారు.. నేను ఏర్పాటు చేశా

## ఎక్స్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్రమంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశ మయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కల వడంపై కిషన్‌రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో, 23న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను' అని ఎక్స్‌లో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# టిజి-20 క్రికెట్ లీగ్‌తో క్రెడాయ్ భాగస్వామ్యం

## రాష్ట్ర మొదటి ఫ్రాంచైజీ ఆధారిత టి-20 క్రికెట్ లీగ్ ద్వారా క్రీడాభివృద్ధి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్, తొలి టీజీ20 క్రికెట్ లీగ్‌కు ప్లాటినం స్పాన్సర్‌గా వ్యవహరిస్తోన్నట్లు వెల్లడించింది. తెలంగాణ యొక్క మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత టీ20 క్రికెట్ టోర్నమెంట్‌గా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) చేపట్టిన ఈ చారిత్రాత్మక కార్యక్రమం, రాష్ట్ర క్రీడా రంగంలో ఒక గొప్ప మార్పును సూచిస్తుంది, తెలంగాణ యొక్క మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత టీ20 లీగ్ ప్రారంభానికి నాంది పలికింది. ప్లాటినం స్పాన్సర్‌గా, క్రెడాయ్ హైదరాబాద్ తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి మద్దతు ఇవ్వడంతో పాటుగా యువ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదికను సైతం అందిస్తోంది. ఈ భాగస్వామ్యం క్రీడాభివృద్ధి పట్ల క్రెడాయ్ యొక్క దీర్ఘకాలిక నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ ప్రీమియం భాగస్వామ్యం ద్వారా, యువత సాధికారత, సమాజ నిర్మాణం, సమగ్ర ప్రాంతీయ అభివృద్ధి అనే తన దీర్ఘకాలిక కార్పొరేట్ సామాజిక బాధ్యత పిల్లర్లను క్రెడాయ్ హైదరాబాద్ పునరుద్ఘాటిస్తుంది. ఈ ముందుచూపు కలిగిన కార్యక్రమానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు, క్రెడాయ్ హైదరాబాద్ హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తోంది. ఎనిమిది నగర ఫ్రాంచైజీలు, 32 మ్యాచ్‌లతో పాటు జిల్లా స్థాయి ప్రతిభను చేర్చాలనే బలమైన లక్ష్యంతో సాగుతున్న టీజీ20 లీగ్, తెలంగాణలో ఒక పటిష్టమైన క్రికెట్ పర్యావరణ వ్యవస్థను సృష్టించే దిశగా వేసిన ఒక సాహసోపేతమైన మరియు అర్థవంతమైన ముందడుగు.

లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలలో భాగంగా, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీ ఎన్. జైదీప్ రెడ్డి సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ప్రదానం చేసే గౌరవాన్ని అందుకున్నారు. దీని ద్వారా, క్రెడాయ్ హైదరాబాద్ కేవలం ఇళ్లు, మౌలిక సదుపాయాలను నిర్మించడానికే కాకుండా, సమాజాలను నిర్మించడానికి, వాటిని ఏకం చేసే స్ఫూర్తిని పెంపొందించడానికి కూడా కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా, క్రెడాయ్ హైదరాబాద్ ప్రతి మ్యాచ్ సూపర్ స్ట్రైకర్‌కు, టోర్నమెంట్ సూపర్ స్ట్రైకర్‌కు పురస్కారాలను ప్రదానం చేస్తుంది.

ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎన్. జైదీప్ రెడ్డి మాట్లాడుతూ...భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ క్రీడా వేదికలలో ఒకదాని ద్వారా ప్రాంతీయ క్రీడా ప్రతిభకు మద్దతు ఇవ్వడానికి , యువ ప్రేక్షకులతో తన సంబంధాన్ని బలోపేతం చేసుకోవడానికి క్రెడాయ్ హైదరాబాద్ నిబద్ధతను ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. తెలంగాణకు మొట్టమొదటి అధికారిక టీ20 క్రికెట్ లీగ్‌ను అందించి, యువ ప్రతిభావంతులకు తమ ప్రతిభను కనబరుచుకునే ఒక వేదికను సృష్టించిన ఈ చారిత్రాత్మక కార్యక్రమానికిగానూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌ను మేము అభినందిస్తున్నామని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర




## ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

## పాఠశాలల రాష్ట్ర బంద్ విజయవంతం

## ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్రచేస్తూ, ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల విచ్చలవిడి ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కమిటీ మంగళవారం చేపట్టిన పాఠశాలల బంద్ విజయ వంతం అయిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు తెలిపారు. ఈ సందర్భం గా మాచెర్ల రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పేద పిల్లలకు విద్యను దూరం చేయడం కోసమే 23000 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నాడనీ దుయ్య బట్టారు. ఆదివాసీ గూడెంలలో, గిరిజన తండాల్లో, దళిత వాడల్లోని పిల్లలు చదువుకోవడం ఇష్టంలేదా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో లక్షల కొద్ది ఫీజులు వసూలు చేస్తున్న ఆయా యాజమాన్యాలపై చర్య లు తీసుకోవడం లేదని, ఫీజుల నియంత్రణ చట్టం హామీని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల భూములను కాజేసేందుకే రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ బడులను మూస్తున్నాడా? అనే అనుమానం కలుగుతుంద న్నారు. విద్యాసంవత్సరం మొదలై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం పిల్లలకు యూనిఫామ్స్, పుస్తకాలు అందలేదంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుత ుందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలికవసతులు కరువయ్యాయని, ఆడపిల్లకు సరిపడా బాత్రూంలు కూడా లేని పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం ఉచితంగా సీట్లు అందించే విద్యాహక్కు చట్టం అటకెక్కిందన్నారు. ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీచేయక క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపించిందన్నారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ఎందుకు అన్ని పాఠశాలల్లో అమలు చేయడం లేదో విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తాము నిర్వహించిన "బంద్" లో తల్లిదండ్రులు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారని, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయన్నారు. గవర్నమెంట్ పాఠశాలల్లో విద్యార్థులు బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న సందర్భంలో కొంతమంది పోలీసులు విచక్షణ మరిచి ప్రవర్తించారని మండిపడ్డారు. అందరి మద్దతుతో రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ విజయవంతమయిందని రాంబాబు తెలిపారు.

# రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో బండారు దత్తాత్రేయ భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మంగళవారం లోక్‌భవన్‌లో పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ కేంద్రమంత్రి, హర్యానా మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు చెందిన సెంట్రల్ అకాడమీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యా యులు లోక్‌భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా వారితో ప్రత్యేకంగా ముచ్చటించారు. విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించు కోవాలని గవర్నర్ విద్యార్థులకు సూచించారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.పృథ్వీశ్వర్‌రెడ్డి గవర్నర్‌ను కలిశారు. రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్‌శుక్లా నివాళులర్పించారు. జాతి ఐక్యత, సమగ్రత కోసం డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం చిరస్మరణీ యమనీ గవర్నర్ అన్నారు. 'ఒకే దేశం–ఒకే రాజ్యాంగం' భావనను బలోపేతం చేసిన మహనీయుడని గవర్నర్ పేర్కొన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: MAU61-USI0HB/4/2026-HB/2nd call, Dt: 22-06-2026
**E PROCUREMENT TENDER NOTICE (SECOND CALL)**
Name of Work: "APCRDA-H&B Maintenance-Operation and Maintenance of Street Lighting in VIP Routes of Amaravati Capital Region and Seed Access Road for one year" Estimate Amount: Rs. 1,03,50,000/-. The bid can be downloaded on AP e-procurement portal from 24.06.2026 to 09.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 09.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 09.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Rayapudi

తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘ కార్యాలయం, హాలియా, జిల్లా నల్లగొండ**
ఇన్విటేషన్ ఆఫ్ కొటేషన్ నోటీసు
లేఖ సం.యం.ఇ/ /పు. సం.హా/2026, తేది: 23.06.2026
పురపాలక సంఘం, హాలియా-హాలియా మునిసిపాలిటీలో ట్రీ పార్కుల ప్లాంటేషన్ మరియు మార్గంలో ప్లాంటేషన్ యొక్క గుంతలు మరియు ట్రీగార్డ్‌ల కర్రల యొక్క సరఫరా పంపిణీ మరియు ఇంటి అవరణ, మార్గంలో మొక్కలు నాటుటకు మొక్కల యొక్క సరఫరా మరియు పంపిణీ, హాలియా మునిసిపాలిటీలో 15వ FC గ్రాంట్/PPG/మునిసిపల్ సాధారణ నిధులు 2026-27 క్రింద నీటి సరఫరా మెటీరియల్స్ సరఫరా మరియు పంపిణీ మరియు వివిధ కార్యకలాపాల కోసం మానవ శక్తి, ట్రాక్టర్, డోజర్, JCB యొక్క నియామకం. అంచనా ఖర్చు వేయడానికి ప్రముఖ తయారీదారులు/అధీకృత డీలర్లు/ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానిస్తూ పిలవడం జరుగుతుంది. ఈ క్రింద చూపిన పనులకు కొటేషన్‌లు కోరబడుచున్నవి. 1) అవెన్యూ మొక్కలు (7-12 అడుగులు), 2) ఇంటి అవరణ మొక్కలు (2-7 అడుగులు), 3) ట్రీ గార్డ్స్, 4) ఆసరా కర్రలు (5-14 అడుగులు), 5) నీటి సరఫరా మెటీరియల్స్ (పవర్ బోర్ మెటీరియల్స్, హ్యాండ్ బోర్ మెటీరియల్స్,) మొదలైనవి.. 6) JCB, డోజర్, ట్రాక్టర్, మ్యాన్ పవర్ మొదలైన వాటి నియామకం. పైన చూపబడిన పనులకు పురపాలక సంఘం హాలియా ప్రారంభ రేట్లు 3 లో అనగా తేదీ: 25.06.2026 నుండి 29.06.2026 వరకు పురపాలక సంఘ కార్యాలయం నందు సీల్డు కవర్‌లో ఇవ్వగలరు. మునిసిపల్ కమిషనర్ మరియు మునిసిపల్ ఇంజినీర్ గార్ల ఫోన్ నంబర్లు- 9676519557, 8790236022 సం/- మునిసిపల్ కమిషనర్, పురపాలక సంఘం, హాలియా
DIPR.No.4783-PP/CL/Advt/1/2026-27, తేది: 23.06.2026

# క్యూర్ ఏరియాలో లక్ష ఫ్లాట్ల నిర్మాణం

## ఎల్ఐజి హౌసింగ్ స్కీం.. పేరు ఖరారుపై పోటీ

## 28 వరకు సోషల్ మీడియాలో నిర్వహణ

## ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి రూ.లక్ష బహుమతి

## హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు (ఎల్ఐజి) క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ఫ్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణతో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు. హౌసింగ్ డిపార్ట్ మెంట్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ఐజి ప్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు

# పిల్లల సంరక్షణలో 'తల్లి' హోదా ఒక్కటే సరిపోదు

## ఆ తల్లి వద్ద బిడ్డ భవిష్యత్తు సురక్షితం కాదు

## పుణే ఫ్యామిలీ కోర్టు సంచలన తీర్పు

**పుణె, జూన్ 23:** ఒక మహిళ తన వివాహ ప్రమాణాలను పాటించాలని, భర్తను శారీరకంగా, మానసికంగా చూసుకోవాలని, ఆయన క్షేమం కోసం ప్రార్థించాలని ఆశిస్తారు. ఒకవేళ ఆమె భర్త పట్ల ఈ 'పవిత్రమైన' బాధ్య తలను నిర్వర్తించకపోతే, అటువంటి తల్లి వద్ద వారి బిడ్డ భవిష్యత్తు 'సురక్షి తం కాదు' అని పుణె కుటుంబ న్యాయస్థానం సంచలన తీర్పు నిచ్చింది. మైనర్ బాలుడి సంరక్షణ హక్కును (కస్టడీకి) తండ్రికి అప్పగిస్తూ ఇన్‌ఛార్జ్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జి గణేష్ ఘులే ఉత్తర్వులు జారీ చేశారు. భర్త విషయంలో బాధ్యతలు విస్మరించిన భార్య తన పిల్లల సంరక్షణకు అనర్హురాలంటూ కోర్టు అభిప్రాయ పడింది. ఈ సందర్భంగా తల్లి వద్ద ఉంటే పిల్లాడి భవిష్యత్తు సురక్షితం కాదని స్పష్టం చేసింది. ఈ మేరకు తల్లికి షాక్ ఇస్తూ చిన్నారి కస్టడీని తండ్రికి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా పిల్లల సంరక్షణ విషయంలో కేవలం 'తల్లి' అనే హోదా ఒక్కటే సరిపోదని న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. భర్త, అత్తమామల పట్ల క్రూరంగా ప్రవర్తించే వివాహితకు పిల్లలను కస్టడీ ఇవ్వలేమని పేర్కొంది. వైవాహిక బాధ్యతలను, కుటుంబ విధులను పూర్తిగా విస్మరించిన మహిళ.. బాధ్యతారహిత ప్రవర్తన బాలుడి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయ పడింది. చట్టం ప్రకారం పిల్లల సర్వతోముఖాభివృద్ధే అత్యంత ముఖ్యమైన విషయమని చెప్పు కొచ్చింది. నిరంతరం గొడవలు పెట్టుకునే వాతావరణంలో చిన్నారులు సురక్షితంగా పెరగలేరని తెలిపింది. ఈ మేరకు అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత బాలుడి సంరక్షణ బాధ్యతను తండ్రికి అప్పగించింది. తల్లికి కస్టడీ నిరాక రిస్తూ కేవలం నిర్ణీత సమయాల్లో మాత్రమే కుమారుడిని చూసుకు నేందుకు అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా పిల్లలను భాగస్వామిపై పగ తీర్చుకోవడానికి ఆయుధాలుగా వాడుకోలేరంటూ పుణె న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

# ఇ-సెట్ మొదటి విడతలో 8,829 సీట్ల కేటాయింపు

## 27లోగా ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఈ సెట్–2026 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడతలో 8829 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మొత్తం సీట్లలో 59 శాతం సీట్లను మొదటి విడతలో కేటాయించగా.. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 27లోగా ఫీజు చెల్లించి కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెట్–2026లో 17,768 మంది అర్హత సాధించగా, వారిలో 11,576 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 11,172 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. మొతనతం 3,56,192 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో ఈ సెట్‌లో 14,890 సీట్లు అందుబాటులో ఉండగా అందులో 8829 సీట్లను మొదటి విడతలో కేటాయించారు. మొత్తం సీట్లలో 59 శాతం సీట్లను కేటాయించారు. మొదటి విడతలో ఈడబ్ల్యూఎస్ కోటాలో 460 సీట్లను కేటాయించారు. మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఫీజు చెల్లించి 27లోగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని.. ఫైనల్ ఫేజ్ నాటికి జులై 10 నుంచి 13 వరకు ఆయా కాలేజీల్లో నేరుగా చేరాలని కమిషనర్ ప్రకటనలో తెలిపారు.



ఎసిబికి చిక్కిన ఎస్ఐ వి.నరసింహులు

# లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన ఎస్ఐ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూన్ 23, ప్రభాతవార్త:** స్టేషన్ బెయిల్ మంజూరు చేయటానికి ఒక ఎస్ఐ లంచం అడిగి, తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సోదరుల మధ్య గొడవ కారణంగా ఠాకూర్ అనే వ్యక్తిపై గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఠాకూర్‌కు స్టేషన్ బెయిల్ మంజూరుచేసి, భవిష్య త్తులో వేధింపులు చేయకుండా ఉండేందుకు లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని ఎస్ఐ నర్సిం హులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఠాకూర్ ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు కవాడిగూడ వద్ద ఠాకూర్ నుంచి 50వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఉండగా ఎస్ఐని ఏసీబీ అధికారులు పట్టుకు న్నారు. నిందితుడు నర్సింహులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో మరియు అతని నివాసంలో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ రేంజ్ 1 ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్ తెలిపారు.

# రైతు డిస్కమ్ ఏర్పాటుపై ఇఆర్సీకి 32 అభ్యంతరాలు, సూచనలు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటుపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ) నిర్వహించిన బహిరంగ విచారణ ముగిసింది. ఈ విచారణలో 32 అభ్యంతరాలు, సూచనలు అందాయి. వీటిలో 12 ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన అభిప్రాయాలు కూడా ఉన్నాయి. బహిరంగ విచారణ ముగియడంతో రైతు విద్యుత్ పంపిణీ సంస్థ లైసెన్స్ ప్రక్రియ తుదిత దశకు చేరుకున్నట్లయింది. రైతు డిస్కమ్ ఏర్పాటు సంబంధించి వచ్చిన అన్ని అభ్యంతరాలు, సూచనలను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. ఈ పరిశీలన అనంతరం ఈ ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ లైసెన్స్‌పై త్వరలోనే తుది ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా మెరుగైన, సమర్థవంతమైన విద్యుత్ సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ మూడో ఉచిత డిస్కమ్‌కు లైసెన్స్ మంజూరు కోసం ఈ ఏడాది మార్చి 19న తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి దరఖాస్తు చేసింది. దరఖాస్తును పరిశీలించిన విద్యుత్ నియంత్రణ కమిషన్ రైతు డిస్కమ్ ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఆహ్వానిస్తూ బహిరంగ ప్రకటన జారీ చేసింది. అనంతరం మే 29 న బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ ఉచిత విద్యుత్ డిస్కమ్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, ఇతర ప్రభుత్వ, మున్సిపల్ నీటి సరఫరా అవసరాలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకు రావాలని ప్రతిపాదించారు. దీంతో సాగునీరు, తాగునీటి సరఫరా రంగాలకు అవసరమైన విద్యుత్ సేవ లను ఒకే సంస్థ ద్వారా అందించే అవకాశం ఏర్పడనుంది. రాష్ట్రంలోని ఉత్తర దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్‌ల) లైసెన్సుల్లో మార్పులకు సంబంధించి కూడా కమిషన్ ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది. అభ్యంతరాలు, సూచనలు సమర్పించేందుకు ఈ నెల 22 వరకు ఇచ్చిన గడువు ముగిసింది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల లైసెన్సుల్లో సవరణలకు సంబంధించిన పిటిషన్లపై 4 అభ్యంతరాలు నమోదయినట్లు సమాచారం.

తెలంగాణ ప్రభుత్వం
**ఫారం-VII**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వారి కార్యాలయము (భూసేకరణ) జోగులాంబ గద్వాల జిల్లా
రూఢీ ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)
జిల్లా కలెక్టరు జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్స్ నెం. G/380/2025 తేది: 03.07.2025
ప్రత్యేక ఉపకలెక్టరు, (భూసేకరణ) జె.యల్.ఎ.పి లేఖ నెం. A2/56/2020 తేది : 10.06.2026
జిల్లా రాజ పత్రం నెం. 10/2026 తేది: 12.06.2026
ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలము, చింతరేవుల గ్రామము విస్తీర్ణము ఎ.4.90 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా Package No. 99(B) D4/3R/1R Minor Canal నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.
కావున జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలము, చింతరేవుల గ్రామము విస్తీర్ణము ఎ.4.90 సెం.లు గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

| క్ర. సం | సర్వే నెం. | భూమి విధం (పట్టా/ప్రభుత్వ ఇనాం మొ.) | భూమి రకం (మెట్ట/తరి మొ.) | భూసేకరణ చేయు విస్తీర్ణము ఎ.సెం.లు | పేరు/చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | చెట్లు రకం/సంఖ్య, కట్టడం రకం/విస్తీర్ణము చ.గజాలలో |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | | 6 | 7 |
| 1 | 481 | పట్టా | మెట్ట | 0.60 | 1. ముత్త జమ్మన్న తండ్రి: నవరన్న<br>2. ముత్త జగన్నాథం తండ్రి: అంజనేయులు<br>3. ముత్త మాణిక్యమ్మ భర్త: లేట్ ముత్తుఅంజనేయులు<br>4. ఖమ్మపాడు గోవర్ధన్ తండ్రి: బోయ బుచ్చన్న<br>5. ముత్త అమరేష్ తండ్రి: నవరన్న<br>6. ముత్త రంగన్న తండ్రి: ముత్త నవరన్న<br>7. జక్కుల రేణుకాదేవి భర్త : జక్కుల రాములు<br>8. ముత్త లక్ష్మన్న తండ్రి: ముత్త నవరన్న<br>9. ఖమంపాడు మహేశ్వరి భర్త: ఖమ్మంపాడు గోవిందు<br>10. ఖమంపాడు మహానంద తండ్రి: బుచ్చన్న<br>11. ఖమంపాడు గోవిందు తండ్రి: బుచ్చన్న<br>12. ఖమంపాడు చిన్నయ్య తండ్రి: ఖమ్మంపాడు బుచ్చన్న<br>13.రొబ్బలి అంజనేయులు తండ్రి: భీమన్న<br>14. కొత్మలి రంగన్న తండ్రి: కూర్మన్న<br>15. కొత్మలి గోపాల్ తండ్రి: కూర్మన్న<br>16. బి.సునీత భర్త : రాఘవేంద్ర<br>అనుభవదారులు<br>1. ముత్తా మాణిక్యమ్మ భర్త : ముత్తా అంజనేయులు<br>2. జక్కుల రేణుకాదేవి భర్త : జక్కుల రాములు | (27) ఈత చెట్లు |
| 2 | 497 | పట్టా | మెట్ట | 0.025 | 1.ఉపాధేవి ఆలియాస్ దానాయి భర్త :డి.శ్రీనివాసులు<br>2.దాసరి ప్రకాష్ తండ్రి: దాసరి లక్ష్మన్న<br>3.కటికె శివాజీ తండ్రి: లేట్ కటిక రాముడు<br>4.లక్ష్మన్న తండ్రి: నవరన్న<br>5. లక్ష్మన్న తండ్రి: నవరన్న<br>6.జి.కిషోర్ తండ్రి: జి.నవరన్న<br>7.లక్ష్మన్న తండ్రి: నవరన్న<br>8.దండువీరన్న తండ్రి:కూర్మన్న<br>9.దాసరిలక్ష్మన్న తండ్రి: తిమ్మన్న<br>10.గోపాల్ తండ్రి: బుడ్డన్న<br>11.దండువీరన్న తండ్రి:కూర్మన్న<br>12.దండుగోపాల్ తండ్రి: కూర్మన్న<br>13. దాసరి లక్ష్మీదేవి భర్త : వెంకట్రాములు<br>14.దండు వెంకట్రాములు తండ్రి: దండు దుబ్బన్న<br>15.దండు బక్కి తండ్రి: దండు దుబ్బన్న<br>16.దాసరి ఈరమ్మ భర్త : దాసరి సింగన్న<br>17.రామన్న తండ్రి: శీలన్న<br>18. బోయ రామాంజనేయులు తండ్రి: శీలన్న<br>19. దాసరి సుజాత భర్త : దాసరి ప్రకాష్ | లేవు |
| 3 | 498 | పట్టా | మెట్ట | 1.925 | 1. దండు వెంకమ్మ భర్త : లేట్ దండు లక్ష్మన్న<br>2.దండురాముడు తండ్రి:తిప్పన్న<br>3.దండు లక్ష్మన్న తండ్రి:తిప్పన్న<br>4.వెంకటన్న తండ్రి:తిప్పన్న<br>5.దండు కూర్మన్న తండ్రి: తిప్పన్న<br>6. దండు అంజనేయులు తండ్రి: లక్ష్మన్న<br>7. వెంకటన్న తండ్రి: తిప్పన్న<br>8. వెంకటేశ్వరమ్మ భర్త : కూర్మన్న<br>9. ఎస్.మనోజ్ తండ్రి: ఎస్.చిన్న యాదయ్య<br>10. లక్ష్మన్న తండ్రి: నవరన్న<br>11.డి.అంజనేయులు తండ్రి: కూర్మన్న<br>12.దండు గోపాల్ తండ్రి:కూర్మన్న<br>13. కురుమన్న తండ్రి: లక్ష్మన్న<br>14. దండు వెంకట్రాములు తండ్రి: దండు దుబ్బన్న<br>15.దండు పెద్ద వెంకట్రాములు తండ్రి: దండు పెద్దనవరన్న<br>16.దండురాములు తండ్రి:లక్ష్మన్న<br>17.తిమ్మన్న తండ్రి: లక్ష్మన్న<br>18.దాసరిఈరమ్మ భర్త :దాసరిసింగన్న<br>19.బోయమునెమ్మ భర్త: హనుమంతు<br>20.దండువీరన్న తండ్రికూర్మన్న<br>అనుభవదారులు<br>1. వెంకటన్న తండ్రి: తిప్పన్న<br>2.దండురాముడు తండ్రి: తిప్పన్న<br>3.దండు లక్ష్మన్న తండ్రి: తిప్పన్న<br>4.దండు అంజనేయులు తండ్రిలక్ష్మన్న<br>5.దండు రాముడు తండ్రిలక్ష్మయ్య<br>6.దండుకూర్మన్న తండ్రి: దండుతిప్పన్న<br>7. సావిత్రి భర్త: అంజనేయులు<br>8.బోయహనుమంతు తండ్రిగోవిందు | (5) ఈత చెట్లు (12) వేప చెట్లు |
| 4 | 499 | పట్టా | మెట్ట | 0.70 | 1.బోయహనుమంతు తండ్రిగోవిందు<br>2.చిన్ననవరన్న తండ్రి: కూర్మన్న<br>3.సావిత్రి భర్త: జి.అంజనేయులు<br>4.మహేశ్వరమ్మ భర్తదివంగత లక్ష్మన్న<br>5. భవాని ముద్దమ్మ భర్తలక్ష్మన్న<br>6.బోయహనుమంతు తండ్రిగోవిందు<br>7. లక్ష్మన్న తండ్రి: గోవిందు<br>8.దండుకూర్మన్న తండ్రినవరన్న<br>అనుభవదారులు<br>1.భవాని ముద్దమ్మ భర్త: లక్ష్మన్న<br>2.బోయహనుమంతు తండ్రిగోవిందు | లేవు |
| 5 | 500 | పట్టా | మెట్ట | 0.90 | 1.గల్లా ఆశోక్ తండ్రిముద్దిరెడ్డి<br>2.ముత్త జగన్నాథం భర్త: అంజనేయులు<br>3. పార్వతమ్మ భర్త: జనార్ధన్<br>4.గల్లాశేఖర్ తండ్రి: ముద్దిరెడ్డి<br>5.గాయత్రి భర్త: రఘు<br>6.గౌనిశివంగి తండ్రి: భీమన్న<br>7. ముత్తఅమరేష్ తండ్రినవరన్న<br>8.గల్లాలక్ష్మమ్మ భర్తముద్ది రెడ్డి<br>9.ముత్తజమ్మంతుడుతండ్రినవరన్న<br>10.జి.హరీష్ తండ్రి: వెంకటరెడ్డి<br>11.సరస్వతి భర్త: వెంకటయ్య<br>12.పాలమర్రిరూప్సీ లక్ష్మి భర్త: పి.సుధాకర్<br>అనుభవదారులు<br>1.పార్వతమ్మ భర్తజనార్ధన్<br>2.పాలమర్రి రూప్సీలక్ష్మి భర్త: పాలమర్రి సుధాకర్<br>3.ముత్తా జగన్నాథం తండ్రి: అంజనేయులు<br>4.ముత్తాఅమరేష్ తండ్రినవరన్న | (40)ఈత చెట్లు, (4) వేప చెట్లు, (2) కొబ్బరి చెట్లు |
| 6 | 546 | పట్టా | మెట్ట | 0.35 | 1.భవాని ముద్దమ్మ భర్త: లక్ష్మన్న<br>2.బోయహనుమంతు తండ్రిగోవిందు<br>3.బి.ఆశిని భర్త: బి.మహేష్<br>4.కావలిచంద్రన్న తండ్రి:పెద్దలక్ష్మన్న<br>5.బోయ కేశన్న తండ్రివిష్ణు<br>6.పి.నర్సయ్య తండ్రిలక్ష్మన్న<br>7. దండు కూర్మన్న తండ్రిడి.నవరన్న<br>8.దండులక్ష్మన్న తండ్రి: లేట్ లక్ష్మన్న<br>9.చిన్న నవరన్న తండ్రికూర్మన్న<br>10.భీమన్న తండ్రి: దండు కూర్మన్న<br>11. అంజనేయులు తండ్రి : నర్సింహులు<br>12.కె.విజయ తండ్రి: వెంకటయ్య<br>13.కె.లక్ష్మి భర్త :కావలినర్సింహులు<br>అనుభవదారులు<br>1.అంజనేయులు తండ్రినర్సింహులు<br>2.కె.విజయ భర్తవెంకటయ్య | లేవు |
| 7 | 547 | పట్టా | మెట్ట | 0.40 | 1.దాసరి అంజనేయులు తండ్రి: దాసరి తిమ్మన్న<br>2. నాగన్నబాయి లక్ష్మన్న తండ్రి : తిప్పన్న<br>3. చెవిటిమ్మల మునెన్న తండ్రి: సి.చిన్న హనుమంతు<br>4.దాసరి లక్ష్మన్న తండ్రి: దాసరి తిమ్మన్న<br>5.ఎ.వేణు తండ్రి: ఎ.సురేష్<br>6.ఎ.శ్రీదేవి భర్త: ఎ.సురేష్<br>అనుభవదారులు<br>1. నాగన్నబాయి లక్ష్మన్న తండ్రి: తిప్పన్న<br>2.ఎ.శ్రీదేవి భర్త:ఎ.సురేష్<br>3.దాసరి అంజనేయులు తండ్రి: దాసరి తిమ్మన్న | లేవు |
| | మొత్తం విస్తీర్ణము | | | 4.90 | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలింపకొను నిమిత్తము అందుబాటులో ఉండును.
సం/-.స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల — సం/- అదనపు కలెక్టరు, జోగులాంబ గద్వాల జిల్లా — సం/-. కలెక్టర్, జోగులాంబ గద్వాల జిల్లా
DIPR RO.NO: 349/LA/PP/Advt/Pub/2026-27


వార్త

కోపాన్ని జయించలేనివాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే వాక్కు ఉండదు.

- ఇ.గిబ్బన్

# ప్రమాద నివారణకు దారిలేదా?

కాదు కాదని ఎంత బుకాయించినా, ఇలాంటివి ఇకపై తగ్గిద్దాంలే అంటూ ఎన్ని మాయమాటలు చెప్పినా ఇరుకిరుకు నివాసాల్లో భవంతుల్లో ఆకాశ హర్మ్యాల్లో సైతం ఊహించని అగ్నిప్రమాదాలను ఆపలేం. కళ్లెదుట మాడి మసైపోతున్న మానవ శరీరాలను చూసి నోరెళ్ల బెట్టడమే మనకు మిగిలింది. మానవ తప్పిదాన్ని కూడా కప్పెట్టే అధికార నైజం, సిబ్బంది నిర్లక్ష్యం ఇవన్నీ వెరసి దేశం ఎక్కడికెళ్తుందో తెలియని అయోమయ పరిస్థితి. నిన్న జరిగిన అగ్నిప్రమాదం, అందులోంచి బయటపడిన విగత జీవులు, అగ్నికి ఆహుతైన క్షణాలు గమనిస్తే ఎవరికైనా కళ్లు చెమరుస్తాయి. నాన్నా! నన్ను కాపాడమంటూ కోచింగ్ విద్యార్థులు పొగచూరిన గదుల్లో చిక్కుకుపోయి కన్నవారికి సెల్‌ఫోన్‌లలో చేసిన కన్నీటి వేడికొళ్లే వారి చివరి సంభాషణలు. కళ్లు కన్నీరు కారుస్తాయి. అయినా అధికారంగణం స్పందించదు. మరో ప్రమాదం జరుగకుండా ఆపగలిగిన పరిస్థితి కనపడదు. ఇలాంటి జాబితాలో తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూలో జరిగిన సంఘటనే తార్కాణం. లఖ్‌నవూలో మరో కోచింగ్ సెంటర్‌లో 15 మంది సజీవ దహనమైపోయారు. కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్ ఉన్న భవంతిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. లఖ్‌నవూలోని ఆలీగంజ్ ప్రాంతంలోని ఓ మూడంతస్తుల భవనంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఆ భవనం అంతా కాలిపోయి మసి బొగ్గులా ప్రత్యక్షమైంది. భవనంపైన యానిమేషన్ కోచింగ్ క్లాసులు జరుగుతుండగా కింది అంతస్తు నుంచి మంటలు పైకెగిసాయి. ప్రమాదం జరిగిన ఆ సమయంలో 30 మంది విద్యార్థులున్నారు. వారిలో కొందరు చుట్టూ పొగలు వ్యాపిస్తున్నా మంటలు ముఖం మీదపడగా హాహాకారాలు చేస్తూ వారిలో కొందరు తమ ప్రాణాలు కాపాడేందుకు కిందికి దూకేసారు. అలా దూకలేనివారు మాత్రం కాలి బూడిదయ్యారు. ఈ సంఘటనపై చెప్తూ ఉపముఖ్య మంత్రి బ్రిజేష్ పాఠక్ సైతం కన్నీళ్ల పర్యంతమయ్యారు. ఉషామెహతా మార్గ్‌లోని కమర్షియల్ ఏరియాలో ఉన్న ప్రమాద స్థలిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో పెంపుడు జంతువుల దుకాణం, పై అంతస్తుల్లో కోచింగ్, గేమింగ్ సెంటర్‌లున్నాయి. నిరంతరం విద్యార్థులు తమ కోచింగ్‌పై అక్కడే ఉంటుంటారు. మంటలు భారీగా వ్యాపించాయి. విద్యార్థులకు తప్పించుకునే దారి దొరకలేదు. దాదాపు పద్దెనిమిది మంది పై అంతస్తు నుంచి దుమికారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒకే భవనంలో చిన్న అగ్ని ప్రమాదంగా జరిగినా అగ్నిమాపక సిబ్బంది తీరిగా అరగంట దాటాక ప్రమాదస్థలి చేరుకోవడంలో బాధితు లకు సహాయ సహకారాలేమీ అందలేదు. తక్షణమే వచ్చి ఉంటే పై అంతస్తులో చిక్కిపోయిన వారిలో మరి కొందరినైనా బయటకు తెచ్చే పరిస్థితి ఉండేది. 19 ఫైర్ ఇంజిన్‌లు, ఒక భారీ హైడ్రాలిక్ ప్లాట్‌ఫారం మంటలను ఆర్పేందుకు అక్కడికి చేరుకున్నాయంటే ఇదెంత భారీ అగ్నిప్రమాదమో చెప్పుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకా ణంలోని పక్షిజాతి జంతువులన్నీ అగ్నికిఆహుతయ్యాయి. ఎప్పటికప్పుడు ఇలాంటి అగ్ని ప్రమాదాల కొత్తేమీ కాదని సరిపెట్టుకోవడం విచిత్రం. ఒక దుస్సంఘటన మరో దుస్సంఘటనకు మార్గదర్శకం కాకూడదు. జరిగినలోపాల బేరీజుతో వాటిని సరిదిద్దుకోవాలి తప్పితే ఇక మనం చేయగలిగేదేమీ లేదని సరిపెట్టుకోవడం మంచిదికాదు. ప్రభుత్వ శాఖలు అగ్నిమాపక సంస్థలు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. నిరంతర పర్యవేక్షణ ఉంటే ఇలాంటి అగ్ని ప్రమాదాల స్థాయి తగ్గించగలుగుతారు. ప్రాణనష్టాలు జరుగుతున్న సందర్భాలన్నీ దిగ్భ్రాంతి కలిగించేవే. పలువురిలో చర్చ నీయాంశంగా కూడా ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యాలపై నిఘా లేకుంటే మళ్లీ మళ్లీ ఇటువంటి ఘోర ప్రమాదాలు జరగవని గ్యారంటీ ఇవ్వలేం. సంఘటనలు జరిగాక సమీక్షించుకుని కఠిన చర్యలు తీసుకుంటే అటువంటి ప్రమాదాలు మరోసారి జరగవు. కోచింగ్ సెంటర్లకు వచ్చిన విద్యార్థులు ప్రమాదాల బారిన పడి మృతిచెందడం ఇదే మొదటి సారి కాదు. ఢిల్లీలో ఇలాంటి సంఘటనే జరిగింది. లక్నో ఘటన పూర్తి నిర్లక్ష్యానికి సమూల సాక్ష్యం. కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులతో నిండిపోయి ఉంటాయి. వాటికి అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ అలారంలు, స్ప్రింక్లర్ వ్యవస్థలు, భద్రతా శిక్షణ వంటి అంశాలపై ఏ ప్రభుత్వ సంస్థా వాటి అమలుకు ప్రయత్నించదు. భద్రతా చర్యలు ఏవైనా ఉన్నా అవి కాగితాలపైనే ఉంటాయి. వాళ్లు తీసుకోగలిగిన జాగ్రత్తల విషయమై నిర్దిష్టంగా వారే అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వమే జరిగిన ప్రమాదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం మంచిది. వాణిజ్య సంస్థలు భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటామో విశదీకరించాలి. ఆయా సంస్థల అడుగులకు మడుగులొత్తుతూ జరిగిననేరాల నుంచి వారిని తప్పించేందుకు సహకరించకూడదు. ఇలాంటి సందర్భాల్లో ప్రాణనష్టానికి బాధ్యత ఎవరు వహించాలో స్పష్టంగా నిర్ణయించగలిగితే తప్పుడు విధానాలు అవలంబించే సమయంలో అడ్డుకోవచ్చు. మానవ నిర్లక్ష్యంలో జరిగిన విపత్తులలో ఘోరవిపత్తులకు కారకులైన వారిని ఎట్టి పరిస్థితులలోనూ వదలరాదు. అనుమతిలేని అక్రమ నిర్మాణాలకు అవకాశమీయరాదు. అప్పుడే అగ్నిప్రమాదాలను నివారించగలం. విద్యాసంస్థలు, కోచింగ్ సంస్థల్లోని అంతస్తులో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ అందుబాటులో ఉండాలి. ప్రాణభద్రతను కాగితాల మీద కాకుండా కార్యరూపంలో అమలు చేయడం అవసరం.



పదేళ్ల పుస్తక పఠనం కంటే, విజ్ఞుడితో గడియ ముచ్చట్లు మేలు.

టి. ఫుల్లర్



పొగిడే వాడి పట్ల జాగ్రత్తగా ఉండు. లేనిచో ఖాళీ కంచంతో నీ కడుపు నింపగలడు.

ఆస్కార్ వైల్డ్

## ప్రజావాక్కు

### పరిమితులకు లోబడి సాంకేతికత

పదహారేళ్లలోపు వయసున్న పిల్లలకు సామాజిక మాధ్యమాలవాడకాన్ని పూర్తిగానిషేధించాల్సిన ఆవశ్యకత ప్రస్తుతంఎంతైనా ఉంది. ఆధునిక కాలంలో సాంకేతికత విస్తరించడం వల్ల చిన్న వయసులోనే పిల్లలు డిజిటల్ ప్రపంచానికి బానిసలుగా మారుతున్నారు. దీనివల్ల వారి మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, శారీరక శ్రమ తగ్గిపోతోంది. సామాజిక మాధ్యమాలలో వచ్చే అపరిమితమైనసమాచారం, హానికరమైన కంటెంట్, సైబర్ వేధింపులు పిల్లల సున్నితమైన మనస్సులపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. వారు తమ అమూల్యమైన బాల్యాన్ని, చదువును విస్మరించి తెరలకే పరిమితమవుతున్నారు. ఈ తీవ్రమైన సమస్యను గుర్తించిన కొన్ని దేశాలుఇప్పటికే దీనిపై కఠినమైన నిర్ణయాలు తీసుకున్నాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలు పదహారేళ్ల లోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా చట్టపరమైన నిషేధాన్ని విధించాయి. ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి ఇతర దేశాలు కూడా తక్కువ వయసున్న మైనర్ల కోసం ఇలాంటి వయోపరిమితి నిబంధనలను, తెర సమయ నియంత్రణలను అమలు చేస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రకృతి వైద్యం

కొన్ని వేల ఏళ్లక్రితం మనిషి జీవనంలో ప్రకృతి విస్తృతంగా ఉండేది. దానిమీదే దినం గడిపే వారు. కాయకష్టం వల్ల శరీరాలు ధారుఢ్యం, పూర్తి రోగనిరోధక శక్తి ఉండేది. ఆకులు, గింజల వైద్యం వారికి శరణ్యం. అది అప్పటి పరిస్థితి. గానీ ఇప్పుడు వైద్యశాస్త్రం విస్తృతంగా పెరిగి రోగ నిర్ధారణతో వైద్యం ఫలితం ఇస్తుంది. కొందరి దేహస్థితి కొన్ని పదార్థాలకు వికృతంగా కనిపిస్తుంది. అందుకు శరీర లక్షణాలు చూడకుండా అల్లోపతి వైద్యం చేయరాదు. అలానే పాత ఆకుల రసం అందరికీ పనిచేయదు.

- బొల్లోజు మేఘాథం, విశాఖపట్నం

### పంటలు పండితేనే రైతు సుభిక్షం

అన్నదాతను కరుణించని వాన మృగశిర ముగిసి ఆరుద్ర ఆరంభమైన ఇంక కరుణించని వాన దేవుడు. ఆందోళనలో అన్నదాతలు సరిగా పడని వర్షం ఇంకెప్పుడు వర్షం పడేది ఇంకెప్పుడు పెద్దగా అయ్యేది అని ఎదురుచూస్తున్న రైతన్నలు వానలు సరిగ్గా కురిసి పంటలు పండితేనే రైతన్న సుభిక్షంగా ఉంటాడు. లేదంటే అంధకారమే.

-మోటె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### విశ్వాసం కోల్పోతున్న బ్యాంకులు

ఆంధ్రప్రదేశ్‌లోని 'ఏలూరు' జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో గుర్తింపు పొందిన జాతీయ బ్యాంకులో బంగారం తనఖా పెట్టి మోసపోయిన బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఈ నెలలో ఖాతాదారులకు చెందిన బంగారు ఆభరణాలు భారీగా మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. బంగారం మాయమైన ఘటనతో ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేద ప్రజలు ఎంతో కష్ట నష్టాలను ఓర్చుకొని రూపాయి రూపాయి కూడ పెట్టుకుని బంగారం కొనుగోలు చేసి బ్యాంకులో అయితే భద్రంగా ఉంటాయి, వడ్డీ తక్కువ ఉంటుందని బ్యాంకులను ఆశ్రయిస్తే బ్యాంకులే ఈ విధంగా మోసం చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ఈ సంఘటన వెలుగులోకి రావడంతో తాము తాకట్టు పెట్టిన బంగారం భద్రంగా ఉందాలేదా అనే భయాందోళనలతో జాతీయబ్యాంకులపై విశ్వాసం కోల్పోతున్నారు. బ్యాంకు సిబ్బంది సహకారంతోనే ఈ మోసం జరిగిందా?. వెంటనే ఈ విషయంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### వివాహాలు ఇలా చేయండి !

ఈ రోజు పిల్లలకు వివాహాలు చెయ్యాలంటే లక్షలు లక్షలు కట్నం, లక్షలు పెట్టి కళ్యాణమండపాలు, బ్యాండు మేళాలు, ఒక్కోభోజనంమూడొందలూ, నాలుగొందల ఖర్చున, ముహూర్తాలు, నలుగురైదుగురు పంతుళ్లు, ఈరకంగా ఒక్కో వివాహానికి 30నుంచి 40లక్షల ఖర్చు. వీటికోసం ఆస్తులు అమ్ముకోవటం, ఒకళ్ళని చూసి ఒకళ్ళు ఇలా ఆడంబరాల వివాహాలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులే కుండా రిజిస్టర్ కార్యాలయానికి వెళ్ళిస్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954 కింద అప్లికేషన్ తీసుకొని, వధూవరుల రెండురెండు ఫోటోలు, నేటివిటీ సర్టిఫికెట్లు ఇచ్చి, ఇద్దరు పెద్దమనుషుల సంతకాలతో పూర్తి చేసి ఇచ్చినట్లయితే 30రోజుల తరువాత సర్టిఫికెట్ ఇస్తారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి. అన్ని వయస్సులవారిఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలావరకు తగ్గిపోయాయి. వారాంతం పండుగలు పబ్బాలు జాతర్లలో కలుస్తూ కలిసి వుంటే కలదు సుఖం అంటూ ఉల్లాసంగా గడుపుతుండడం శుభసూచకం.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

# ప్రత్యామ్నాయ జల మార్గం అవసరం!

*అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాట నిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్యకాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే!*



రావులపాటి సీతారాంరావు

పూర్తి స్వదేశీ సాంకేతికతతోరూపుదిద్దుకున్న మూడు భారీయుద్ధ నౌకలను నౌకాదళంలకి చేర్చిన ఘట్టాన్ని మన దేశ ప్రధాని నరేంద్రమోడీ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో (కలకత్తాలో) ఆవిష్కరించటంతో దేశీయ రక్షణ సామర్థ్యానికి ముందడుగు వేసినట్లయింది! ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకరంగంతో పాటు సముద్ర జలాల విషయంలో స్వంతంగా కొన్ని ప్రణాళికలు రచించి, ఆచరించాల్సిన అవసరం నిన్నా, మొన్న జరిగిన యుద్ధంతో సముద్రం మీద ఆధిపత్యం ఎంత అవసరమో మనకూ, ప్రపంచ దేశాలకూ చెప్పకనే చెప్పినట్లయింది! వాణిజ్యం, ఆర్థికంగా బలోపేతం కావటం లాంటివి రాజకీయ ఆధిపత్యాన్ని కలిగిస్తాయని ఇంతకు మునుపు నమ్మేవారు. కానీ మొన్నటి హార్ముజ్ జలసంధి ఎవరి ఆధీనంలో వుండాల్నో, అటు అమెరికా, ఇటు ఇరాన్ పోటీపడటమే కాకుండా పెక్కు దేశాలకు ఆయిల్ దిగుమతి, అదీ ఆయిల్, క్రూడ్ ఉత్పత్తులతో సహా నౌకలు సముద్రయానంతో జలాలమీద అవసరమున్న దేశాలకు తరలించినప్పుడే ఆర్థికంగా ప్రజలను, దేశాలను సంతోషభరితులను చేయొచ్చు అని భావిస్తున్నారు. చమురు తరలింపుతో బిలియన్లకొద్దీ డాలర్లు సంపాదించటం జరుగుతున్నది! అయితే నౌకా యానంలో తరలించే ఈ చమురు ఉత్పత్తుల వ్యవహారంలో చాలా 'రిస్క్'లు వున్నాయి! పైరసీతో బాటు, భౌగోళిక రాజకీయ ఇబ్బందులు గూడా క్షణక్షణం సరుకు కోరుకున్న వారికి చేరేసరికి ఎదురవుతునేవుంటాయి! ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సంఘర్షణ పడినప్పుడు 'నీటి దోవలను' నియంత్రించి, ఆధిపత్యం చెలాయించటం, ఆర్థిక ఆంక్షలు పెట్టటం హార్ముజ్ జలసంధి విషయంలో అందరికీ అవగతం అయింది! చాలా క్లిష్టమైన బలహీనతలు ఈ ఆంక్షల ద్వారా వెలికివస్తాయని ఇరాన్ చెప్పినట్లయింది! యుద్ధాలు సంభవించటానికి ప్రత్యేక కారణంగా నీటిదారులను (వాటర్ వేస్)ను గూడా చేర్చాల్సిన ఆవశ్యకత ఏర్పడింది! అందుకనే ఇరాన్, జలసంధిని మూసివేసామని, అమెరికా, బ్లాకేడ్ విధించామని ఆధిపత్యం నిరూపించుకోటానికి తపన పడుతూ యుద్ధ జ్వాలలను సమిసిపోనివ్వటం లేదు! ఎనర్జీ ఇంధనం ఆయిల్ ఎగుమతులు 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' మూసివేయటం వల్ల, చాలా యిబ్బందులు అనేక దేశాల ప్రజలు, ప్రభుత్వాలూ ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది! ఆర్థిక అస్తవ్యస్త వ్యవహారాల వల్ల యు.యస్ ఇరకాటపు స్థితిని తమ దేశంలో గూడా ఎదుర్కొంటున్నది. ఇజ్రాయిల్ ఒత్తిడితో యుద్ధం మొదట్లో అమెరికా కొన్ని చిన్నపాటి విజయాలు సాధించిన అనుభవంతో, ఇరాన్‌ను అదుపుచేసి పోయిన వైభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని కలలు కన్నది! కానీ తమ అధినాయకుడిని కోల్పోయిన ఇరాన్ ప్రజలు దేశంలోని కుమ్ములాటలు మరిచిపోయి ఒక్కతాటి మీద నిలిచి, ఇరాన్ ప్రభుత్వానికి కష్టసమయంలో వత్తాసు పలకటంతో యు.యస్.ఏ గుక్కతిప్పుకో లేకపోయింది. ట్రంప్ దాంబిక బెదిరింపులు ఎందుకూ పనికి రాలేదు. దేశంలో అధ్యక్షుని విలువ మసకబార సాగింది. అలాంటి పరిస్థితులలోనే సంధి సంప్రదింపులు మొదలయ్యాయి. ఆటంకాలు తొలిగిపోలేదు. ఇజ్రాయిల్ కొరకరాని కొయ్యగానే వుంది. లెబనాన్ ఈ శాంతి అగ్రిమెంటులో



భాగంగానట్లు ప్రవర్తిస్తూ ఇజ్రాయిల్ ఎదురు దాడులకు దిగుతున్నది! ఈపరిస్థితులలో శాంతి ఒప్పందం నిలుస్తుందో నిలవదో ఎవరూ చెప్పలేకుండా వున్నారు! ఇరాన్ ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ (స్ట్రెయిట్ అథారిటీ అన్న దానిని ఏర్పరిచి, యుద్ధ సమయంలో ఈ అథారిటీయే హార్ముజ్ జలసంధి వ్యవహారాలను హాండిల్ చేస్తుందని చెప్పటంతో, ఎల్.పి.జి, క్రూడ్ ఆయిల్ దిగుమతుల సమస్యను అధిగమించటానికి 'వాటర్ వేస్' కొత్త రూట్స్ హార్ముజ్ జలసంధి ద్వారా కాకుండా మరో మార్గాల ద్వారా దిగుమతులు చేసుకొనే విషయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించటానికి, యునైటెడ్ అరబ్ ఎమిరేటస్ 'జీరో డిపెండన్సీ' సూత్రాన్ని ఆచరించటానికి పూనుకోవటంతో, ఇండియా ప్రభుత్వం గూడా అదేరీతిలో కొత్త మార్గాలను అన్వేషించే పనిలో పడిందని కొందరు చెపుతున్నారు! సప్లయి చైన్స్ను మళ్ళించుకోక తప్పదు! మరో నౌకాయాన మార్గాన్ని ఎన్నుకొని పెట్టుబడులు అటు దిశగా మళ్ళించుకోవాలి! 'లాండ్ కారిడార్స్'ను గూడా కనిపెట్టుకోగలగాలి! కీలకంగా వ్యవహరించే దేశాలతో పార్టనర్స్‌గా చేరాలి! చైనా ముందే జాగ్రత్తపడి ఈ విషయంలో సముచిత నౌకాయాన మార్గాలను వృద్ధి చేసుకుంది! చాబహార్ ప్రాజెక్ట్ లాంటి ప్రాజెక్ట్స్ వల్ల అవకాశాలు కలిగే స్థితి ఏర్పడినా భారత్ అలాంటివి పరిగణనలోకి తీసుకోలేదు! హార్ముజ్ జలసంధి మీద ఆధారపడి దిగుమతుల మీద ఆశలు పెంచుకోవటం తగదు. ఆర్థికంగా చిక్కు సమస్యలు ఎదుర్కోకుండా వుండటానికి ఆ జలసంధి సహకారం పోనుపోను రాజకీయ కారణాల వల్ల తక్కువ కావచ్చు! స్వయంగా భారత్ వేరే మార్గాలను ఎన్నుకొని ఆర్థిక కుంగుబాటును తొలిగించుకోక తప్పని పరిస్థితి! అయితే ప్రస్తుతం మూడు భారత జెండాతో భారీ క్రూడ్ ఆయిల్ టాంకర్లు హార్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటటంతో కొంత ఊరట లభించినట్లయింది! 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడి చమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడ రేవుల వైపు వస్తున్నాయి! ఈనౌకల పేర్లు దేశ వైభవ్, దేశ్ విభోర్, సన్మార్ హెరాల్డ్! నావికుల భద్రతతో పాటు దేశ ఇంధన సరఫరా మార్గాల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించటం శుభసూచకం! యుద్ధాలు మొదలుపెట్టేది ఒకరైతే పరిణామాలు అనుభవించేది మరొకరు! నిజానికి 'భారత్ లాంటి దేశాలకు జరుగుతున్న ఈ యుద్ధంతో అణుమాత్రం సంబంధంకూడా లేదు. గాలికి పోయే కంప మాదిరి సంబంధం లేని దేశాలు ఈ వ్యవహారాన్ని చూస్తున్నాయి! ఇజ్రాయిల్ ప్రధాని మోడీని యుద్ధం ప్రారంభం కాకమునుపు జొజ్జరకొట్టే ప్రయత్నం చేసింది! అమెరికా ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయినప్పటి నుంచీ పాకిస్థాన్తో మరింత స్నేహాన్ని పెంచుకొని భారత్లో పైపైన స్నేహాన్ని నటిస్తున్న అనుమానం కొన్ని సంఘటనలను నిదర్శనంగా భావించవచ్చు! సుంకాలను ఇండియాపై అమెరికా పెంచుతుందని ఎవరూ ఊహించను గూడా లేదు! అనేక విధాలుగా సాఫ్ట్వేర్ రంగంలో భారతీయులు అమెరికాకు చేదోడు వాదోడుగా వుండి వారి ఆర్థికాభివృద్ధికి కొంత కారకులైన మాటనిజం! చైనా పాకిస్థాన్లను దగ్గరకు తీయటానికి అమెరికా ఈ మధ్య కాలంలో ప్రయత్నిస్తుండటం అందరూ చూస్తున్న విషయమే! ఒక విధంగా భారత్ అంతర్జాతీయ విషయాలలో స్పష్టమైన వైఖరితో ఎవరితో జత కలవకుండా, తన ప్రగతి తాను సాధించుకొనే దిశగా పయనిస్తుండటంతో ఇతర దేశాలు గూడా ఇండియా స్వతంత్ర నిర్ణయాలతో సమస్యకు తగ్గట్టుగా వ్యవహరించటాన్ని అభినందిస్తున్నాయి! అయితే ప్రస్తుతం భారత్ తక్షణ సమస్య హార్ముజ్ జలసంధి ద్వారా దిగుమతులు కాకుండా మరో జలమార్గం ద్వారా పొందాల్సిన పరిస్థితి! ఆ మార్గం అన్వేషించుకొని ఆ దిశగా మనం పయనించక తప్పదు! స్వతంత్ర ప్రతిపత్తితో మన ఆర్థిక పురోభివృద్ధిని ఎవరిమీదా ఆధారపడకుండా సాధించుకోవాల్సిందే! ●

# విత్తన బంతులు.. పచ్చని అడవులకు చిరునామా!

డాక్టర్ చిట్యాల రవీందర్

ప్రస్తుత వర్షాకాలంలో పర్యావరణ పరిరక్షణ కోసం అత్యంత ఆసక్తికరమైన, ప్రభావవంతమైన పద్ధతుల్లో ఒకటి సీడ్‌బాల్స్ లేదా విత్తన బంతుల తయారీ, వాటిని వెదజల్లే ప్రయోగం. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న ఈ సమయంలో సీడ్‌బాల్స్ ప్రయోగం పర్యావరణానికి ఒక వరం వంటిది. సీడ్‌బాల్స్ అంటే మట్టి, కంపోస్ట్ (ఎరువు) విత్తనాల మిశ్రమంతో తయారు చేసిన చిన్నచిన్నబంతులు. ఇవి ప్రకృతిసిద్ధమైన అడవుల పునరుజ్జీవనానికి, ముఖ్యంగా మానవ ప్రమేయం తక్కువగా ఉండి, మొక్కలు నాటడానికి వీలుపడని కొండ ప్రాంతాలు, బంజరు భూములు అడవి ప్రాంతాల్లో అడవుల పెంపకానికి అద్భుతమైన మార్గం. వర్షాకాలం ప్రారంభమైన వెంటనే ఈ సీడ్ బాల్స్‌ను వెదజల్లడం వల్ల, పడిన వర్షపు నీటికి బంతిలోనిమట్టి కరిగి, అందులోని విత్తనం మొలకెత్తడానికి కావలసినతేమ పోషకాలు అంది, ప్రకృతి సిద్ధంగానే మొక్కలు మొలవడం మొదలవుతుంది. ఈ పద్ధతిలో విత్తనం నేరుగా భూమిపై పడకుండా, మట్టి పొరలో సురక్షితంగా ఉండటం వల్ల పక్షుల నుండి, ఎలుకల నుండి లేదా ఎండ వేడిమి నుండి రక్షణ లభిస్తుంది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న భూతాపం, అడవుల నరికివేత వంటి సమస్యలకు సీడ్ బాల్స్ ఒక సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారం. వీటిని తయారు చేయడం కూడా చాలా సులభం. ఎర్రమట్టిని, వర్మీ కంపోస్ట్ లేదా పశువుల ఎరువును కలిపి, అందులో ఆ ప్రాంతపు వాతావరణానికి తగిన దేశవాళీ వృక్షాల విత్తనాలను ఉంచి చిన్న బంతులుగా చేసి, నీడలో ఆరబెట్టి, వర్షాలు పడుతున్నప్పుడు ఖాళీప్రదేశాలలో విసిరితే సరిపోతుంది. ముఖ్యంగా ఈ వర్షాకాలంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల విత్తనాలు కుళ్ళిపోకుండా మొలకెత్తే అవకాశం 80-90 శాతం వరకు ఉంటుంది. ఈ ప్రయోగంవల్ల అటవీ ప్రాంతాల్లో జీవవైవిధ్యం పెరుగుతుంది. నేల కోత నివారించబడుతుంది. భూగర్భ జలాలు పెంపొందుతాయి. అయితే, ఇందులో ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏ ప్రాంతంలో అయితే సీడ్ బాల్స్ వేస్తున్నామో, ఆ ప్రాంతానికి సహజంగా అలవాటైన లేదా



స్థానిక వృక్ష జాతుల విత్తనాలను మాత్రమే వాడాలి. పరాయి ప్రాంతాల నుంచి తెచ్చిన లేదా కలుపు మొక్కల విత్తనాలను వాడటంవల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. అలాగే, సరైన సమయంలో అంటే వర్షాలు పడటం ప్రారంభించిన మొదటి లేదా రెండో వారంలోనే వీటిని వేయడం వల్ల, మొక్కలకు వేర్లు ఊరేలోపు తగినంతవర్షం దొరికి అవి దృఢంగా తయారవుతాయి. సీడ్‌బాల్స్ ప్రయోగం అనేది కేవలం మొక్కలు నాటడమే కాదు, ఇది భావి తరాలకు పచ్చని ప్రకృతిని అందించే ఒకసామాజికబాధ్యత. పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి ఈ పనిని ఒక ఉద్యమంలా చేపడితే, రాబోయే కొన్ని సంవత్సరాల్లోనే మన చుట్టూ ఉన్న బంజరు నేలలు పచ్చని వనలుగా మారుతాయి. ప్రతి వ్యక్తి తన పుట్టినరోజున లేదా ప్రత్యేక సందర్భాల్లో ఇలాంటి వందల సంఖ్యలో సీడ్‌బాల్స్‌ను తన ప్రయాణాల్లోలేదా ఖాళీ స్థలాల్లో వేయడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతిని కాపాడుకోవడానికి, భూమిని తిరిగి సస్యశ్యామలం చేయడానికి సీడ్ బాల్స్ కంటే తక్కువ ఖర్చుతో, ఎక్కువ ఫలితాలను ఇచ్చే మార్గం మరొకటి లేదు. ప్రతి ఒక్క గింజలో ఒక అడవిని నిర్మించే శక్తి దాగి ఉంటుంది, దానికి కావలసింది కేవలం చిన్న ప్రయత్నం వర్షపు జల్లుల తోడుమాత్రమే. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల విత్తన బంతుల పెంపకానికి, పంపిణీకి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీలు కలిసి తీసుకుంటున్న చొరవ పర్యావరణ పరిరక్షణలో ఒక గొప్ప మైలు రాయిగా నిలుస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ భౌగోళికంగా ఎంతో వైవిధ్య భరితమైనది. అయితే అడవులు తక్కువగా ఉన్న కొండ ప్రాంతాలు, బంజరు భూముల్లో మొక్కలు నాటడం సవాలుతో కూడుకున్న పని. ఇటువంటి క్లిష్టమైన ప్రదేశాల్లోవిత్తన బంతులు వేయడం ద్వారా మానవ ప్రమేయం లేకుండానే ప్రకృతి సిద్ధంగా మొక్కలు మొలకెత్తడానికి మార్గంసుగమం అవుతోంది. ఈ చొరవలో భాగంగా వేప, కానుగ, మద్ది, రావి వంటిస్థానిక వృక్ష జాతుల విత్తనాలను వినియోగించడం వల్ల మన ప్రాంత వాతావరణానికి తట్టుకోగల చెట్లు పెరుగుతాయి. ఇది పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా స్థానిక పక్షుల జీవ వైవిధ్యానికి సురక్షితమైన నివాసాలను కల్పిస్తుంది. ●

# అక్రమ ఆరోపణల 'ఉపా'యంతో అపాయం!



డాక్టర్ నీలం సంపత్

ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్‌లు సంయుక్తంగా ఢిల్లీ వేదిక గా కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఓ స్వతంత్ర డిజి టల్ మీడియా సంస్థ న్యూస్ క్లిక్ పై, దాని వ్యవస్థాపక సంపాదకులు ప్రబీర్ పురకాయస్త పై 'విదేశీ ప్రత్యక్ష పెట్టు బడుల' సేకరణ విషయంలో యఫ్.డి.ఐ నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో ఐ.పి.సి 420 పి.యమ్.యల్.ఏ సెక్షన్ 4 ప్రకారం మనీ లాండరింగ్ కేసు నమోదుచేయడం వెనుక నేపథ్యం ఏమయివుంటుందనే అంశంలో ఓ చిన్నపాటి విశ్లేషణ అవసరమేమో. అందులో భాగంగా ఆయనపై, ఆయన సిబ్బందిపై అనేక దాడులు, అరెస్టులు, వేధింపులు, లోతైన పరిశోధనలు, విచారణలు జరిపింది. ఈ కేసులకు అదనంగా అక్టోబర్ 2023 లో దేశ సమగ్రతకు, భద్రతకు భంగం కలిగిస్తున్నారంటూ ప్రబీర్ పురకాయస్త పై ఉపా కేసును నమోదు చేయడంతెలిసినదే. 2024లో తనకు న్యాయం చేయమంటూ ప్రబీర్ పురకాయస్త సుప్రీం కోర్టునిఆశ్రయించిన నేపథ్యంలో కేసు పూర్వాపరాలను సమగ్ర విచారణ చేసిన తదనంతరం భారత సర్వోన్నత న్యాయ స్థానం ఆయన అరెస్ట్ అక్రమం, చట్ట విరుద్ధమని తేల్చి చెప్పింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరాల న్యాయ విచారణ తర్వాత గతనెల 29న ప్రబీర్ పురకాయస్త, న్యూస్ క్లిక్ పై నమోదైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆరోపణల కేసులో నిబంధనల ఉల్లంఘన జరగలేదని, తమను మోసగించారని ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని, కేవలం ఓ ఇన్ ఫార్మర్ ఇచ్చిన సమాచారం ప్రాతిపదికన ఐ.పి.సి 420కేసు పెట్టడం అన్యాయమని, చట్ట విరుద్ధమని వ్యాఖ్యానిస్తూ నేరం, మోసం జరిగిందనే ప్రాథమిక సాక్ష్యాధారాలేవీ లేవనీ ఓ స్వతంత్ర న్యూస్ ఛానల్‌పై అదో కుట్ర పూరిత కట్టు కథగా అభివర్ణిస్తూ ఢిల్లీ హైకోర్ట్‌లో నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఆ కేసును కొట్టివేయడం జరిగింది. ఆది నుండీ ఇ.డి, ఐ.టి, సి.బి.ఐ లాంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల పనితీరు పట్ల న్యాయవ్యవస్థ పూర్తిస్థాయి అసం తృప్తిని వెల్లగక్కుతుండడం బహిరంగ రహస్యమే. నిజానికి సదరు విచారణ సంస్థలపై న్యాయవ్యవస్థ అసహనానికి ప్రధాన కారణం న్యాయస్థానాలలో కేంద్రప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న నేరపరిశోధన సంస్థలు వివిధ వ్యక్తులు, వ్యవస్థలపై చేస్తున్న ఆర్థిక నేరారోపణలనూ, మోపుతున్న అభియోగాలను నూటికి తొంభైఐదు శాతం బుజువు చేయలేక పోతుండడాన్ని బట్టి న్యాయ వ్యవస్థ అసలా ఆర్థిక నేరాలే జరగకపోవచ్చనే ముక్తాయింపుకు రాకతప్పడం లేదు. సరిగ్గా అదే సమయంలో ఓ అమెరికా పత్రిక వివిధ ఇతర దేశాలతోసహా భారత దేశంలోనూ చైనా అనుకూలతను



పెంచి పోషిస్తున్న చైనా అధికారిక మీడియాతో న్యూస్ క్లిక్ కలిసి పనిచేస్తూ దేశా నికీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నాయనే తీవ్ర మైన అభియోగాన్ని మోపుతూ ఓ కథనాన్ని ప్రచురించింది. తదనంతరం న్యూస్ క్లిక్ వ్యవస్థాపక సంపాదకుడైన ప్రబీర్ పురకాయస్తతో పాటు ఆ సంస్థలో పనిచేస్తున్న ఇతర జర్నలిస్టులు, కథనాలు రాసిన లబ్ధ ప్రతిష్టులైన వ్యాసకర్తలపై మనీ లాండరింగ్, ఛీటింగ్ లాంటి ఆర్థికనేరాలకు సంబంధించిన చట్టాలను ప్రయోగించి అరెస్ట్ చేసి జైలులో పెట్టడం గమనార్హం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించిన ఆ ఘటనను ప్రపంచ పత్రికా రంగం నిరసించడమేకాదు, గర్హించడం జరిగింది. ఐతే అంతర్జాతీయ సమాజపు స్పందన ను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోని కేంద్ర ప్రభుత్వం చైనా అనుకూల, భారత వ్యతిరేక వార్తలను రాస్తున్నందుకు మీ పత్రికకూ, మీకు కొమ్ముకాస్తున్నప్రతిపక్ష పార్టీ అధి నేతకు పెద్ద మొత్తంలో సొమ్ములు ముడుతున్నాయంటూ, మీరు శత్రుదేశాలకు పేడ్ మీడియాగా పనిచేస్తున్నారని ఢిల్లీ పోలీసులు ప్రశ్నించినారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులు చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. అధికార పార్టీ పార్లమెంట్ సభ్యులు సైతం పార్లమెంట్ వేదికగా న్యూస్ క్లిక్‌పై దేశ ద్రోహ ఆరోపణలు చేసిన వైనం తెలిసినదే. వీటన్నింటి పర్యవసానంగా ప్రబీర్ పురకాయస్త 'ఉపా' కేసు మోపబడి జైలు పాలయ్యాడు. 225రోజులు జైలులో ఉన్నప్పటికీ మనీ లాండరింగ్, ఛీటింగ్ కేసులపై తన న్యాయపోరాటాన్ని కొనసాగించాడు. ఏంజరగబోతోంది? 2026వ సంవత్సరానికి ప్యారిస్ ఆధారిత గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్, రిపోర్టర్స్ విత్‌ౌట్ బోర్డర్స్ తయారుచేసిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో 180లో 157వ స్థానంలో కొనసాగుతున్న ఘన (అప)కీర్తిని మూట గట్టుకున్న మన దేశంలో ఢిల్లీ హైకోర్ట్ తీర్పుని కేంద్రప్రభుత్వం తప్పని సరిగా సుప్రీం కోర్ట్‌లో సవాల్ చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఐతే ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన మన దేశం లో రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తితో పాత్రికేయ ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా నిర్వర్తిస్తూ రైతులూ, కార్మికులూ, విద్యా ర్థులూ, నిరుపేదలూ, సామాన్య ప్రజల గొంతుకగా మారి వారి బ్రతుకు కోసం, భవిష్యత్ కోసం తద్వార దేశ సామాజిక, ఆర్థిక సుస్థిరత కోసం పోరాడుతున్న పత్రికలూ, పాత్రికేయులూ, మీడియా సంస్థలపై పాలకులు కుట్రలతో, కుతంత్రాలతో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ మనీలాండరింగ్ లాంటి ఆర్థిక నేరారోపణలూ 'ఉపా' లాంటి దేశ ద్రోహ ఆరోపణలతో జైల్లలో వేసినప్పటికీ నిమ్మకు నీరెత్తుతూ తమతమ పత్రికలలో ఒక్క అక్షరం కూడా ప్రభుత్వాల చర్యలను ఖండించలేకపోవడాన్ని ఏమనుకోవాలి. ఒక వేల అదే నిజమైతే దేశంలో పత్రిక రంగం పాలకుల నిరంకుశ విధానాల బంధనాలను ఛేదించుకుని ఐక్యంగా తమను తాము కాపాడుకుంటూ పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు అవసరమైన శక్తిని సమకూర్చుకోవడానికి వేసిన ఓ అతి పెద్ద ముందడుగుగా భావించక తప్పదు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'కొలీజియం' న్యాయ సమీక్షకు అతీతం



## న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో జోక్యంలేదు
## పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో కోర్టులు నిర్దేశించలేవు
## సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 23:** హైకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం ప్రక్రియను సవాలు చేస్తూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు నిరాకరించింది. అటువంటి నిర్ణయాలు కొలీజియం 'వ్యక్తిగత సంతృప్తి'పై ఆధారపడి ఉంటాయని, వాటిని న్యాయపరమైన స్థాయిలో కోర్టులు సమీక్షించలేవని పేర్కొంది. ధర్మశాలలోని ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయమూర్తి అరవింద్ మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగారత్న, జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలోని అత్యంత సీనియర్ న్యాయాధికారులలో ఒకరిగా ఉన్నప్పటికీ, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టుకు పదోన్నతి కోసం తన అభ్యర్థిత్వాన్ని విస్మరించి, తనకంటే జూనియర్ అధికారులను సిఫార్సు చేశారని మల్హోత్రా వాదించారు. పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్, మల్హోత్రా ఎంపిక ప్రక్రియలో పాల్గొని అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ, చివరికి సుప్రీంకోర్టు కొలీజియం ఆయన జూనియర్ల పేర్లను ఆమోదించిందని వాదించారు. అయితే, పదోన్నతి కోసం ఎవరిని సిఫార్సు చేయాలో లేదా పరిగణించాలో కొలీజియంలకు న్యాయస్థానాలు నిర్దేశించలేవని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇవి అంతిమంగా హైకోర్టు కొలీజియం వ్యక్తిగత సంతృప్తికి సంబంధించిన విషయాలు. న్యాయపరంగా, 'మీరు ఇది చేయండి, అది చేయండి, అతని పేరును పరిగణించండి' అని సుప్రీం కోర్టు కొలీజియంతో చెప్పగలదా? అలా చేయలేము' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. మల్హోత్రా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా తిరస్కరించినట్లు సూచించడానికి ఎటువంటి ఆధారాలు లేవని కూడా కోర్టు పేర్కొంది. పిటిషనర్ పేరు ఇంకా పరిశీలనలో ఉండవచ్చని, కాబట్టి ఆయన వేచి ఉండాలని జస్టిస్ నాగారత్న అన్నారు. కేవలం సీనియారిటీ మాత్రమే పదోన్నతికి హక్కును కల్పిస్తుందన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. సీనియారిటీ ఉన్నంత మాత్రాన ఒక న్యాయాధికారికి సిఫార్సు పొందే అర్హత దానంతట అదే లభించదని పేర్కొంది. కొలీజియం చర్చలు గోప్యమైనవని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు కొలీజియం అంతర్గత చర్చలను పరిశీలించడం ద్వారా 'పాండోరా పెట్టెను తెర వడానికి' కోర్టు ఇష్టపడటం లేదని జస్టిస్ నాగరత్న అన్నారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే ఆమోదించడం వల్ల, తొలిదశల న్యాయ సమీక్ష కష్టతరంగా మారిందని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. కోర్టు పరిశీలనల తర్వాత, పిటిషనర్ ఆ అభ్యర్థనను ముందుకు తీసుకెళ్లకూడదని నిర్ణయించుకుని, పరిపాలనా పరంగా సమర్థ అధికారి ముందు ఇతర పరిష్కార మార్గాలను అనుసరించడానికి స్వేచ్ఛ కోరారు. సుప్రీంకోర్టు, దావాల యోగ్యతపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండానే పిటిషన్‌ను పరిష్కరించింది. న్యాయా ధికారులు చిరాగ్ భాను సింగ్, భూపేష్ శర్మ, యోగేష్ జస్వాల్‌లను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కోసం సిఫార్సు చేసి, ఆమోదించిన తర్వాత ఈ పిటిషన్ దాఖలైంది.

# అమెరికా పౌరసత్వం ఇక మరింత ఖరీదు!

## దరఖాస్తు ఫీజు 75% పెంపు



**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ నిబంధనలను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డిహెచ్‌ఎస్) ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సి రావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులు కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికి వస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమలులోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజులపాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డిహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. 400శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# టిఎంసిలో పెరిగిన ఆధిపత్యపోరు



## అసలైన తృణమూల్ కాంగ్రెస్ మాదే: ఇసికి మమత వర్గీయుల లేఖ
## తిరుగుబాటు వర్గం కమిటీ పునర్నియామకం
## చైర్మన్ అరూప్ రాయ్, ఉపాధ్యక్షుడిగా అరూప్ బిస్వాస్

**కోల్‌కతా, జూన్ 23:** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)లో ఆధిపత్య పోరు ఉధృతమైంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రీటాబ్రత బెనర్జీ సోమవారం తమదే అసలైన టిఎంసి అంటూ, కొత్త కమిటీని పునర్నియామకం చేయగా, కాదు మాదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని మమతా బెనర్జీ అనుకూల వర్గం, ఇదే మా పార్టీ అసలైన జాతీయ కార్యవర్గం అని పేర్కొంటూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐకి) అందిస్తూ లేఖ రాసింది. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీలకు విధేయులైన 'అసలైన కానీ మైనారిటీ' వర్గంగా తమను తాము అభివర్ణించుకున్న ఈ వర్గం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోని టిఎంసి శాసన సభ్యుల 'తిరుగుబాటు కానీ మెజారిటీ' వర్గం ప్రకటించిన సమాంతర కమిటీకి ప్రతిగా, తమ జాబితానే 'అసలైన' జాతీయ కార్యవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొంది.

రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరినీ మినహాయించి కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఆవిష్కరించిన కొద్దిసే పటికే, సోమవారం రాత్రి ఇసికి ఈ లేఖ పంపి నట్లు వర్గాలు తెలిపాయి. మమతా బెనర్జీ వర్గం సమర్పించిన జాబితాలో, మమతను జాతీయ ఛైర్‌పర్సన్‌గా, సుబ్రతా బక్షిని జాతీయ ఉపాధ్యక్షుడిగా, అభిషేక్ బెనర్జీని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ జాబి తాలో రాజ్యసభ సభ్యులు డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్‌లను సంయుక్త కార్యదర్శులుగా, రాజ్యసభ మాజీ సభ్యుడు సుభాసిష్ చక్రవర్తిని కోశాధికారిగా కూడా చేర్చారు. దీనిపై రీటాబ్రతా బెనర్జీ స్పందిస్తూ, తనకు ఎలాంటి వ్యాఖ్యలు లేవని, అయితే ఇతర వర్గానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. సోమవారం సాయంత్రం ప్రకటించిన తిరుగుబాటు వర్గం కమిటీ, మమతా బెనర్జీ స్థానంలో సీనియర్‌శాసనసభ్యుడు, మాజీ మంత్రి అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా నియ మించింది. మాజీ మంత్రి అరూప్ బిస్వాస్‌ను ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్యేలు ఫిర్హాద్‌హాకీం, రథిన్ ఘోష్‌లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రీటాబ్రతా బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, మరియు సబీనా యాస్మిన్‌లను ప్రధాన కార్యదర్శులుగా నియమించగా, అఖ్రుజ్జమాన్‌ను కోశాధికారిగా నియమించారు. తృణమూల్ కాంగ్రెస్‌లోని 'అసలైనకానీ అల్పసంఖ్యాక' వర్గం, మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలకు తమ విధేయతను కొన సాగిస్తూ, పార్టీ జాతీయకార్యవర్గంవివరాలను తెలియజేస్తూ భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ) ఒక ప్రకటనను పంపింది. తమదే అసలైన తృణ మూల్ కాంగ్రెస్ అంటూ ఇసిఐకి పంపిన లేఖలో పేర్కొంది.



## ఐడిఎఫ్‌సి స్కామ్‌లో ఐఎఎస్ అధికారి అరెస్టు

**న్యూఢిల్లీ,జూన్ 23:** బ్యాంక్ స్కామ్ రూ. 657 కోట్ల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఓ ఐఎఎస్ ఆఫీసర్‌ను అరెస్టు చేసింది. 2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ పంకజ్ అగర్వాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టు అయిన రెండో ఐఎఎస్ అధికారి ఆయన. ఇదే కేసులో ఇప్పటికే రామ్ కుమార్ సింగ్ అనే ఐఎఎస్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఐడిఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అధికారులు, ప్రభుత్వ అధికారులతో కలిసి ఓ స్కామ్ చేశారు. హర్యానా ప్రభుత్వానికి చెందిన 8 శాఖల నుంచి, చండీఘడ్ పరిపాలన శాఖకు చెందిన రెండు అకౌంట్ల నుంచి నిధులను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నష్టం 657 కోట్లు ఉంటుందని సీబీఐ పేర్కొన్నది. ఇదే కేసును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విచారిస్తున్నది. సుమారు 645 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఈడీ చెబుతోంది. స్కామ్ జరిగిన సమయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు పంకజ్ అగర్వాల్ పనిచేశారు. హర్యానా వ్యవసాయ మార్కెటింగ్ బోర్డుకు సంబంధించిన సుమారు 10 కోట్లు చండీఘడ్‌లోని ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్ నుంచి మాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అగ్రికల్చర్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫండ్ పేరుతో ఖాతానిర్వహించినట్లు తెలుస్తోంది. ఎస్ఆర్ఆర్ ప్లానింగ్ గురుస్ లిమిటెడ్ సంస్థకు 9.75 కోట్లు, మన్నత్ కాంట్రాక్టర్స్‌కు 25 లక్షలు చెల్లించారు. కానీ షెల్ కంపెనీలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బ్యాంక్ కుంభకోణంలో మొత్తం 8మంది ఐఎఎస్ ఆఫీసర్లపై నిఘా పెట్టారు. దీంట్లో ఇద్దర్ని అరెస్టు చేశారు. మొహమ్మద్ షాయిన్, మణి రామ్ శర్మ, ప్రదీప్ కుమార్, వినీత్ గార్గ్, సాకేత్ కుమార్, డీకే బెహరా ఉన్నారు. హర్యానా స్కూల్ శిక్షా పరియోజనా పరిషద్‌కు సెక్రటరీగా ఉన్న సమయంలో విద్యాశాఖ అకౌంట్ నుంచి సుమారు 50కోట్లు దారి మళ్లించినట్లు పంకజ్ అగర్వాల్‌పై ఆరోపణ ఉన్నది. ఫైనాన్స్ శాఖ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా అకౌంట్లను ఓపెన్ చేసి నిధులను మళ్లించినట్లు పంకజ్‌పై ఆరోపణలు ఉన్నాయి.

# పుణేలో వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పనే



**ముంబై, జూన్ 23:** మహారాష్ట్ర, పుణేలోని ఒక వ్యాపారి ఆఫీసు వద్ద కాల్పులు కలకలం సృష్టించాయి. సోమవారం రాత్రి పుణేలోని హెచ్ వికాస్ స్టీల్ సంస్థ ఆఫీసు వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ఘటనకు పాల్పడింది లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అని తెలుస్తోంది. పుణేలోని అమూల్ చమారియా, సన్నీ చమారియా అనే ఇద్దరు వ్యాపారులు లక్ష్యంగా ఈ దాడి తెలుస్తోంది. రాత్రి పూట ముసుగు ధరించిన దుండగులు.. పిస్టోల్‌తో ఆఫీసు సమీపంలో కాల్పులు జరిపారు. చుట్టుపక్కల, గోడలపై కాల్పులు జరిపి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ తరపున అర్జూ బిష్ణోయ్ శుభమ్ లోంకర్ పేరుతో ఉన్న ఒక అకౌంట్ నుంచి ప్రకటన వెలువడింది. తామే ఈ కాల్పులకు పాల్పడినట్లు వెల్లడించారు. వ్యాపారులిద్దరూ చాలా మందిని మోసం చేసి, మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై తమ గ్యాంగ్ ఫోన్ చేసి హెచ్చరిస్తుంటే, వారు తమను పట్టించుకోలేదని, అందుకే ఈ కాల్పులు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తమ కాల్స్‌కు స్పందించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈసారి బుల్లెట్లు గోడను తాకాయని, తాము చెప్పినట్లు వినకుంటే భవిష్యతులో వారి ఛాతిలో దిగుతాయని సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. దీనికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, కాల్పులకు సంబంధించిన విడియోను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. సోషల్ మీడియా పోస్టుతోపాటు, విడియోపైనా ఆరా తీసుకున్నారు. నిందితులను గుర్తించే పనిలో పోలీసులున్నారు. ఇటీవలి కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలుసార్లు దాడులకు పాల్పడింది. సెలబ్రిటీలతోపాటు అనేకమంది వ్యాపారుల ఇళ్ల వద్ద కాల్పులు జరుపుతోంది.

## సమాచారహక్కు చట్టం మార్పులపై అన్నా హజారే ధ్వజం



**ముంబయి, జూన్ 23:** మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవలతీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్టీఐ)నిబంధనల సవరణలను వెంటనే రద్దు చేయాలని సామాజిక కార్యకర్త అన్నా హజారే డిమాండ్‌చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన హజారే ఈనెల12న తీసుకొచ్చిన మహారాష్ట్ర ఆర్టీఐ రూల్స్-2026, సమాచార హక్కుచట్టం స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కొత్త నిబంధనలవల్ల ఆర్టీఐ చట్టం లక్ష్యం నీరుగారి, ప్రజలకు సమాచారం అందడం మరింత కష్టమవుతుందని విమర్శించారు. ఆర్టీఐ దరఖాస్తుల ఫీజులను పెంచడాన్నీ హజారే తీవ్రంగా వ్యతిరేకించారు. 20ఏళ్ల తర్వాత ఫీజులు పెంచితే, సమాచారమివ్వకుండా ఆలస్యంచేసే అధికారులపై జరిమానాలను పెంచాలని సూచించారు.

# 'వికసిత్ భారత్'లో ఐఎఎస్‌లు కీలకం




2024 బ్యాచ్ ఐఎఎస్ ట్రైనీలతో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 23:** వికసిత భారత్2047 లక్ష్య సాధనలో యువ సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి అంకితభావంతో పనిచేయాలని, పదవుల కంటే ప్రజలకు అందించిన ఫలితాల ద్వారానే సంతృప్తి పొందాలని ఆయన సూచించారు. మంగళవారం సేవా తీర్థ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఎఎస్ అధికారి శిక్షణార్థులతో ప్రధాని మోడీ సంభాషించారు. వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అసిస్టెంట్ సెక్రటరీలుగా పనిచేస్తున్న ఈ యువ అధికారులు తమ శక్తి, ప్రతిభ, అంకితభావంతో భారత అభివృద్ధి ప్రయాణాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఫీల్డ్ ట్రైనింగ్, మంత్రిత్వ శాఖల్లో అనుబంధ సేవల సమయంలో పొందిన అనుభవాలను అధికారులు ప్రధానమంత్రితో పంచుకున్నారు. రెండేళ్ల పరిపాలనా శిక్షణ, క్షేత్రస్థాయి అనుభవం అనంతరం వారు అత్యంత కీలక దశలో ఉన్నారని, ఇకపై వారి నిర్ణయాలు కేవలం వారి కెరీర్‌ను మాత్రమే కాకుండా కోట్లాది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని పేర్కొన్నారు. ప్రజాసేవలో నిజమైన పరీక్ష వాస్తవ జీవిత పరిస్థితులను నిజాయితీ, సున్నితత్వం, నిబద్ధతతో ఎదుర్కోనడంలోనే ఉందని మోడీ అన్నారు. దేశ నిర్మాణంలో స్పష్టమైన లక్ష్యంతో, వినూత్న ఆలోచనలతో, పౌరుల కేంద్రిత పరిపాలనతో ముందుకు సాగాలని యువ అధికారులకు సూచించారు. ప్రతి పరిపాలనా ఫైల్ వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, జీవితాలు దాగి ఉంటాయని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. నాగరిక్ దేవో భవ మంత్రాన్ని ఆచరిస్తూ ప్రతి నిర్ణయంలో పౌరులను కేంద్రంగా ఉం చాలని, పరిపాలన సానుభూతితో, స్పందనాత్మ కంగా, సమగ్రంగా ఉండేలా చూడాలని పిలుపు నిచ్చారు. అభివృద్ధి సవాళ్లను ఒక్కో శాఖ విడి విడిగా పరిష్కరించలేదని, శాఖల మధ్య సమన్వయం ద్వారానే స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయని ప్రధాని పేర్కొన్నారు. వికసిత భారత్2047 దిశగా రాబోయే దశాబ్దాల్లో తీసుకునే ప్రతి విధాన నిర్ణయం, పరిపాలనా చర్య దేశ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, తయారీ రంగ వృద్ధి, ఇంధన భద్రత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన ప్రస్తుతం దేశ ప్రాధాన్యతలుగా ఉన్నాయని ఆయన వివరించారు. గత దశాబ్దంలో పరిపాలన విధానంలో గణనీయమైన మార్పు వచ్చిందని, ప్రక్రియల ఆధారిత విధానం నుంచి ఫలితాల ఆధారిత పరిపాలన వైపు దేశం అడుగులు వేసిందని మోడీ పేర్కొన్నారు. డిజిటల్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతికత సేవల అందుబాటును, పారదర్శకతను పెంచుతున్నాయని చెప్పారు. డేటాను కేవలం సంఖ్యలుగా కాకుండా కోట్లాది ప్రజల జీవితాలు, సమస్యలు, ఆశయాలకు ప్రతిబింబంగా చూడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ విధానాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలని అధికారులకు సూచించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుత ఐఎఎస్ బ్యాచ్‌లో 40 శాతానికి పైగా మహిళా అధికారులు ఉండటం విశేషమని ప్రధాని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి జితేందర్‌సింగ్, ప్రధానమంత్రికి ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా, ప్రధాన కార్యదర్శి2 శక్తికాంత దాస్, కేబినెట్ కార్యదర్శి టి.వి. సోమనాథన్, డీఓపీటీ కార్యదర్శి రచనా షా, లాల్‌బహదూర్‌శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ అకాడమీ డైరెక్టర్ శ్రీరామ్ తరణికంటి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## టెలిగ్రాం యాప్‌పై నిషేధం ఎత్తివేత..



**న్యూఢిల్లీ,జూన్ 23:** నీట్ యూజీ 2026 రీఎగ్జామినేషన్ నేపథ్యంలో భారత్‌లో తాత్కాలికంగా నిలిపివేసిన టెలిగ్రామ్ సేవలను మళ్లీ పునరుద్ధరించారు. వారంపాటు నిషేధం అనంతరం మంగళవారం నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో టెలిగ్రామ్ యాప్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. నీట్ యూజీ రీఎగ్జామ్‌ను లక్ష్యంగా చేసుకొని కొందరు చీటింగ్ ముఠాలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి అభ్యర్థులను మోసం చేస్తున్నారనే ఆరోపణలతో జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కేంద్రం ఈ నెల 16నుంచి 22 వరకు టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా నిషేధించింది. అయితే టెలిగ్రామ్‌లో సందేశాలనుసవరించే (మెసేజ్ఎడిట్)ఫీచర్‌పై విధించిన ఆంక్షలు ఈనెల 30వరకు కొనసాగనున్నాయి.

## రాయల్ సర్జన్స్ కళాశాలలో సుశ్రుతుడి కాంస్యవిగ్రహం



**ఎడింబర్గ్,జూన్ 23:** ఆధునిక వైద్యశాస్త్రం ఇంకా అభివృద్ధి చెందని కాలంలోనే భారతీయ వైద్యుడు సుశ్రుతుడు విశేష కృషి చేశాడు. 2,600 ఏళ్ల క్రితమే 1,120వ్యాధులను నమోదు చేశాడు. 700కుపైగా ఔషధ మొక్కలు, 300కు పైగా వైద్య విధానాలు, 120శస్త్రచికిత్స పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా భద్రపరిచాడు. ఇప్పుడు ఆయనకు స్కాట్లాండ్‌లో అరుదైన గౌరవం దక్కింది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ సుశ్రుతుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించింది. శస్త్రచికిత్స రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించింది.

## లక్నో ప్రమాద భవనం కూల్చివేయాలని నోటీసులు



**లక్నో,జూన్ 23:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీచేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దుచేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చి వేత ఆదేశాలు రద్దయ్యాయి.



## గ్వాటెమాలాలో బద్దలైన అగ్నిపర్వతం

**గ్వాటెమాలాసిటీ,జూన్ 23:** మధ్య అమెరికా లోని గ్వాటెమాలాలో వోల్కన్ డీ ఫ్యూగో అగ్నిపర్వతం బద్ధలైంది. దాంతో అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మాయి. ఏకంగా 33 వేల అడుగుల ఎత్తు పొగలు విరజిమ్మాయి. అగ్నిపర్వతం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగజిమ్మి, మండుతున్న రాళ్లు బుల్లెట్లలా దూసుకొచ్చాయి. దాంతో ఆ పర్వత పరిసరాల్లో ఉన్న పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఈ హఠాత్పరిణామానికి సైతం పరుగందుకున్నారు. అగ్నిపర్వతం చుట్టూ శిథిలాలు పడుతుండగా పర్వతారోహకులు అగ్నిపర్వత మార్గా ల వెంట పరుగెత్తుతుండటం కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

## పదేళ్ల బాలికపై ఆటోడ్రైవర్ హత్యాచారం..



**న్యూఢిల్లీ,జూన్ 23:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. పదేళ్ల బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసి, అనంతరం హత్య చేశాడు ఒక క్యాబ్ డ్రైవర్. ఆ తర్వాత ఆ బాలికను అడవుల్లో పారేశాడు. ఈఘటన దక్షిణ ఢిల్లీ పరిధిలోని సీడీఆర్ చౌక్ ఏరియా సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీ, సీడీఆర్ చౌక్ సమీపంలో పదేళ్ల బాలిక కుటుంబంతో కలిసి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో బబ్లూ అనే క్యాబ్ డ్రైవర్ ఆ బాలికను ఎత్తుకెళ్లాడు. తన కార్‌లో బలవంతంగా ఎక్కించుకుని గుర్గావ్ (గురుగ్రామ్) ప్రాంతంలోకి ఎక్కించుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. అనం తరం ఆ బాలికవల్ల ఎక్కడ నిజం బయటపడుతుందో అని భావించిన బబ్లూ ఆ బాలికను చంపేశాడు.


## ఇజ్రాయెల్ లెబనాన్‌ల మధ్య మరోసారి శాంతిచర్చలు

### వాషింగ్టన్‌లో భేటీ..!

**వాషింగ్టన్,జూన్ 23:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలను అదుపులోకి తెచ్చి శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు అగ్రరాజ్యం అమెరికా మరో ముందడుగు వేసింది. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య అత్యంత సున్నితంగా మారిన సరిహద్దు వివాదాలు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరింత బలోపేతం చేయడం కోసం వాషింగ్టన్ డీసీలోని స్టేట్ డిపార్ట్‌మెంట్ వేదికగా దౌత్యపరమైన చర్చలు ప్రారంభమయ్యాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో జరుగుతున్న ఈ ఐదో విడత నేరుగా జరిగే ద్వైపాక్షిక చర్చలలో ఇరు దేశాల రాయబారులు, ఉన్నతాధికారుల బృందాలు పాల్గొంటున్నాయి. గతంలో జరిగిన నాలుగు విడతల చర్చల ఫలితంగా కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను ఇరుపక్షాలు గౌరవించేలా చేయడం, అలాగే ప్రాంతీయ స్థిరత్వాన్ని సాధించడం ఈ మూడు రోజుల సమావేశాల ముఖ్య ఉద్దేశం. ఈ ప్రతిష్ఠాత్మక చర్చల్లో భాగంగా ముఖ్యంగా దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాల నుంచి ఇరు దేశాల సైన్యాల ఉపసంహరణ, హిజ్బుల్లా సాయుధ బలగాలను పూర్తిగా నిరాయుధులను చేయడం వంటి అత్యంతకఠినమైన భద్రతా నిబంధనలపై ఇరు పక్షాలు చర్చిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ సరిహద్దుల్లో తమ పౌరుల భద్రతకు ముప్పుగా మారిన హిజ్బుల్లా సైనికసామర్థ్యాలను పూర్తిగా తుడి చిపెట్టడమే తమ ప్రథమప్రాధాన్యతని స్పష్టం చేశారు.

# పుణే టెక్కీది ప్రమాద మృతి కాదు..హత్యే

## మరింత లోతుగా పోలీసుల దర్యాప్తు



**పుణె,జూన్ 23:** మహారాష్ట్రలోని పుణె సమీపంలోని లోహగడ్ కోట వద్ద జూన్ 19న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ లోయలో పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే తొలుత ఫోటోలు తీస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడ్డాడని పోలీసులు భావించారు. దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా నమోదు చేసిన కేసును పోలీసులు హత్య కోణంలో విచారిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం కేతన్‌తో నిశ్చితార్థం అయిన సియా గోయల్‌కు చేతన్ చౌదరి అనే యువకుడితో పరిచయం ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కేతన్‌తో పెళ్లికి అంగీకరించిన సియా తమ సంబంధానికి అతడు అడ్డుగా ఉన్నాడని భావించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేతన్‌ను తొలగించేందుకు ఇద్దరూ కలిసి పథకం రచించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈనెల 14న కూడా లోహగడ్ కోట వద్ద కేతన్‌ను హత్య చేసేందుకు ప్రయత్నం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. పాము కనిపించినట్లు భయపెట్టి లోయలోకి నెట్టేయాలనే ప్రయత్నం విఫలమైనట్లు అనుమానిస్తున్నారు. అనంతరం జూన్ 19న సియా పుట్టినరోజు సందర్భంగా మరోసారి కోటకు వెళ్లేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్ పేరుతో కేతన్‌ను కోటకు తీసుకెళ్లిన తర్వాత అక్కడకు చేతన్ కూడా చేరుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో కేతన్ సుమారు 350 అడుగుల లోతైన లోయలో పడిపోవడంతో మృతిచెందాడు. ఇది ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళికలో భాగంగా జరిగి ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. కేసు దిశను మార్చిన అంశం డిజిటల్ ఆధారాలేనని పోలీసులు చెబుతున్నారు. విచారణ సమయంలో సియా కొన్ని విషయాలను దాచిపెట్టినట్లు అనుమానం రావడంతో ఆమె మొబైల్ ఫోన్ రికార్డులు, సోషల్ మీడియా, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. వాటి ఆధారంగా హత్య కోణంలో దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

# స్టాలిన్‌ను అనుకరించిన విజయ్, సభనుంచి వాకౌట్ చేసిన డిఎంకె

**చెన్నై,జూన్ 23:** తమిళనాడు శాసనసభ మంగళవారం నాటి సమావేశాల్లో తీవ్ర వాదోపవాదాలు, నాటకీయ పరిణామాల మధ్య అటుడికింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష డీఎంకే మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచింది. ముఖ్యమంత్రి ప్రసంగానికి నిరసనగా డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి విజయ్ మాట్లాడుతూ, డీఎంకే పార్టీ పేరుతో అక్రమంగా నిధులు సేకరిస్తోందని ఆరోపించడంతో పాటు, అవినీతికి పాల్పడిన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనల్లో వాస్తవం లేదని, అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన విమర్శించారు. విజయ్ ప్రసంగానికి డీఎంకే సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ, డీఎంకే సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇదే సమయంలో విజయ్ తన ప్రసంగంలో డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అనుకరించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో సీట్ల పంపకాల చర్చల సందర్భంగా అంతా సెటిల్ అయిపోయింది అనేలా స్టాలిన్ ప్రదర్శించిన మ్యానరిజంను విజయ్ అసెంబ్లీలో అనుకరించి చూపించారు. దాంతో అధికార పక్ష సభ్యుల చప్పట్లతో సభ హోరెత్తింది. తమ ప్రభుత్వం సీపీఎం, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలతో పొత్తు పెట్టుకోవడాన్ని ఈ సందర్భంగా విజయ్ సమర్థించుకున్నారు. మహిళల భద్రతతోపాటు మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



# రాష్ట్రవ్యాప్తంగా విత్తనమేళాలు ప్రారంభం

## ఏడు సన్న వరివంగడాల సాగుకు ప్రోత్సాహం

## నాణ్యమైన విత్తనాలే పంటకు పునాది

## ఆన్‌లైన్ ద్వారా మంత్రి ఉత్తమ్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :**ప్రభుత్వం నిర్ణయించిన ఏడు సన్న రకాల వరి వంగడాల సాగుకు ప్రోత్సహం ఇవ్వనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఢిల్లీలో మంగళవారం మరో మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డితో కలిసి ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విత్తన మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చి అధిక దిగుబడులు సాధించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్య మన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఉపయోగించడం ద్వారా పంట ఉత్పాదకతను గణనీయంగా పెంచుకోవచ్చని చెప్పారు. రైతులకు సరైన సమయంలో నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు.

వ్యవసాయ రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లలో అధిక డిమాండ్ ఉన్న ఏడు సన్న వరి రకాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో సమగ్రంగా చర్చించిన అనంతరం ప్రభుత్వం ప్రోత్సహించాలని నిర్ణయించిందన్నారు. రైతులు ఈ రకాల సాగుకు ముందుకు రావాలని, ఈ ఏడు రకాలకే ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందించనున్నట్లు తెలిపారు. దీంతో రైతులకు అధిక ఆదాయం లభించడంతో పాటు తెలంగాణ బియ్యానికి ప్రపంచ మార్కెట్లలో మరింత గుర్తింపు లభిస్తుందని అన్నారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాలతో పాటు పప్పు జాతులు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకొని స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 30 వరకు రాష్ట్రంలోని 2,601 రైతు వేదికల్లో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాలో 1,24,649 క్వింటాళ్ల వరి, 6,913 క్వింటాళ్ల పప్పు జాతి, 11,815 క్వింటాళ్ల నూనెగింజలు, 1,339 క్వింటాళ్ల కూరగాయల విత్తనాలు అందు బాటులో ఉంచినట్లు వెల్లడించారు. అదనంగా నానో యూరియా, నానో డి.ఏ.పీ. ఎరువులను కూడా రైతుల కొనుగోలుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. విత్తనాల విక్రయంతో పాటు వాటి సాగు విధానాలు, పంట యాజమాన్యం, సమగ్ర పంట సంరక్షణ, అధిక దిగుబడుల సాధనకు సంబంధించిన అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్‌పామ్ రైతులకు రక్షణ కల్పించాలి

### దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి

### కేంద్రమంత్రులతో రాష్ట్ర మంత్రులు

### తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ భేటీ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** తెలంగాణతో పాటు, ఇతర రాష్ట్రాల ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచడం ద్వారా వారికి రక్షణ కల్పించడంతో పాటు, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఢిల్లీలో ఇంకో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తుమ్మల అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.

## రాష్ట్రంలో 3 ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** రాష్ట్రంలో 3 ఆలయాల అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు మంజూరు కానున్నాయి. టీటీడీ బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో సిద్దిపేట జిల్లా దొమ్మాటలోని శ్రీమహాకాళేశ్వర గుడికి రూ.4.6 కోట్లు, సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లోని శ్రీలక్ష్మీ మవెంకటేశ్వరస్వామి గుడికి రూ.1.09 కోట్లు, సికింద్రాబాద్‌లోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి గుడికి రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు.

## నేడు గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రజలతో ముఖాముఖి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** తెలంగాణ రవాణ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు గాంధీ భవన్ లో ప్రజలతో ముఖాముఖి కార్యాక్రమంలో పాల్గొననున్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన ఈ వినూత్నమైన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. అలాగే అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉంది.గతంలో ప్రతి బుధవారం గాంధీ భవన్ లో ఒక మంత్రితో ప్రజలకు ముఖాముఖి కార్యక్రమాలు కొనసాగించారు. ఇటీవల వివిధకారణాల రీత్యా ప్రజలతో ముఖాముఖి చేపట్టలేదు ఈనెల 17 నుంచి తిరిగి మంత్రి అజారుద్దీన్‌తో తిరిగి ప్రారంభించారు. రెండో ముఖాముఖిలో హైదరాబాద్ ఇంచార్జీ మంత్రిపొన్నం ప్రభాకర్‌కు అవకాశం లభించింది. పొన్నం ప్రభాకర్ అనంతరం రెండుగంటలకు ఎంసిహెచ్ ఆర్డీలో ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీతో ఆషాఢ బోనాలపై సమీక్ష సమావేశం జరుపుతారు. అనంతరం అధికారులతో బోనాల ఏర్పాట్లపై సమీక్ష సాయంత్రంనాలుగు గంటల నుంచి జరుపుతారు.




అందోలులో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న తెలంగాణ ఎఐసిసి ఇన్‌ఛార్జి మీనాక్షినటరాజన్

## 'సర్' పేరుతో ఓట్ల తొలగింపునకు బిజెపి కుట్ర

### తెలంగాణ ఎఐసిసి ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్

**జోగిపేట, జూన్ 23, ప్రభాతవార్త:** 'సర్' పేరుతో దేశంలో బెజెపి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని ఎఐసిసి తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. మంగళవవారం అందోలు శివారులోని ఓ ఫంక్షన్ హాలులో స్పెషల్ ఇంటెన్సివ్‌రివిజన్ పై నిర్వహించిన అందోలు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల అవగాహన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్ ఈనెరే తొలిసారి కాదని, గతంలో మొదటిసారిగా 2002లో నిర్వహించినట్లు తెలిపారు. అయితే అప్పుడు నిర్వహించిన దానికి, ఇప్పుడు ఇపుడు నిర్వహిస్తున్న దానికి చాలా వ్యత్యాసం ఉందని ఆమె పేర్కొన్నారు. గతలంలో నిర్వహించిన సార్ కార్యక్రమంలో దేశంలో జన్మించిన ప్రతిఒక్కరికీ, ఏలాంటి ధనిక-పేద ఆనే తారతమ్యం లేకుండా ఓటుహక్కు కల్పించాలనే ఉద్దేశ్యంతో చేపట్టారని తెలిపారు. కానీ ప్రస్తుతం నిర్వహిస్తున్న సార్ ప్రోగ్రాంలో తమకు అనుకూలంగా లేని వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఇది చాలా బాధాకరమైన విషయమని ఆమె అన్నారు. ముఖ్యంగా దేశంలో బెజెపి పార్టీ వన్ నేషన్-వన్ పార్టీ అనే దృక్ప థంలో ముందుకు వెళ్తున్నట్లు అనిపిస్తుందని అన్నారు. అందుకే ఇప్ప టికే దేశంలోని ఆమ్ ఆద్మీ పార్టీ, టిఎంసి, శివసేన పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులను తమవైపు తిప్పుకొని బిజెపి సాగిస్తున్న ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందని ఆరోపించారు.

## రెచ్చగొట్టుడే బిఆర్ఎస్ నాయకుల పని

### యూరియా యాప్‌లో సాంకేతిక సమస్యలు నిజమే

### ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకులకు చదువురాదు, చెప్తే అర్థం చేసుకోరు, ధర్నా చేసి రైతులను రెచ్చగొడుతున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావుతో కలిసి మదన్‌మోహన్ విలేఖరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కెటిఆర్ , ఆయన ఎమ్మెల్యేలు యూరియా పేరుతో రైతుల మీద పడ్డారని విమర్శించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని సొసైటీలకు యూరియా సరఫరా అయిందన్నారు. కొంతమంది పిఎసిఎస్ చైర్మన్లుగా కొనసాగుతూ బిఆర్ఎస్ కు సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. అలాగే వారు డిడిలు కట్టకుండా యూరియా రాకుండా చేసి రైతులను ఇబ్బందులు పెడుతూ ప్రభుత్వాన్ని బధనాం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. మీ సంగతి అంతా మా దగ్గర ఉంది, ఒక్కొక్కరిని లోపల వేసే రోజులు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. సామజిక మాధ్యమాలతో రైతులను రెచ్చగొడుతూ సోషల్ ఎలిమెంట్ యాక్ట్ కింద ఎంపిటిసి, జడ్పీటిసి, ఎమ్మెల్యే కావాలని అనుకుంటే అది కల మాత్రమే అవుతుందన్నారు. యాప్ లో టెక్నాలజీ ద్వారా రైతులకు యూరియా అందించాలని ప్రభుత్వం ఆలోచించిందన్నారు. మధ్యలో బ్రోకర్లుగా ఉండి, కమిషన్లు తీసుకుంటూ ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకు అమ్ముకుని, దానిమీద రూ.30సంపాదించిన రోజులు ఉన్న విషయం మాకు తెలుసన్నారు. మీ లెక్కలు తీస్తే మీరు కటకటాల లోపలికి వెళ్తారని పేర్కొన్నారు.

వాట్సాప్, సోషల్ మీడియాలో వస్తున్న వాటిని నమ్మి రైతులు బలికావద్దని కోరారు. ముందస్తు అరెస్టులు చేయాలని ప్రభుత్వ విధానం కాదని, ఇంటలిజెన్స్ నివేదిక ప్రకారం పోలీసులే ఆ విషయాన్ని చూసుకుంటారన్నారు. ధర్నాలు చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉం టుందని, ప్రజలకు ఇబ్బందికలుగకుండా నిరసన తెలపాలని హితవు చెప్పారు.

## రైతు భరోసా రూ.6 వేలు పెట్టుబడి ఘనత కాంగ్రెస్‌దే

### విద్యుత్ డిస్కంలను అప్పుల్లో ముంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది కెసిఆర్

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, జూన్ 23,ప్రభాతవార్త:** రైతు భరోసా ఎకరాకు రూ. ఆరు వేలు పెట్టుబడి సహాయం, సన్నాలకు ఎకరాకు రూ.15వేల చొప్పున బోనస్ చెల్లింపులు చేస్తున్న ఘనత తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత అని అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సిఎల్‌పిలో మంగళవారం విలేఖరులతో మాట్లా డుతూ మాజీమంత్రి హరీశ్‌రావు అచ్చంపేటలో సభలో రైతుల పట్ల మొసలి కన్నీరు పెట్టుకొన్నారనీ ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పదేళ్ళ పాలనలో "వరివేస్తే ఉరి" అంటూ బెదిరింపులతో రైతులను విస్మరించారనీ మిగులు రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల పాలు చేశారనీ దుయ్యట్టారు. విద్యుత్ డిస్కంలను అప్పుల్లో ముంచి రాష్ట్రాన్ని కెసిఆర్ సర్వనాశనం చేశారనీ ఆవేదన చెందారు. అసెంబ్లీ సాక్షిగా కెసిఆర్ ఒకేసారి రుణమాఫీ చేయలేం అని చెప్పారనీ, లక్ష రూపాయాల రుణ మాఫీకి నాలుగు సంవత్సరాల సమయం తీసుకున్నారనీ గుర్తుచేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా,ఆరు గ్యారంటీలతో పాటు చెప్పనివి కూడా చేస్తున్నామనీ అన్నారు. రైతుబంధును రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఔటర్ రింగ్ రోడ్డును లీజుకి ఇచ్చిన ఘన చరిత్ర గత బిఆర్ఎస్ ప్రభు త్వానిదనీ ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కానీ లేదా తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభు త్వాలు అనేక పథకాలను అమలు చేశాయనీ అన్నారు. ప్రాజెక్ట్ ల పేరు మీద లక్షల కోట్లు దోచుకొని బిఆర్ఎస్ నేతల ఆస్తులు పెంచుకొన్నారని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను వదులుకున్నారనీ ఆవేదన చెందారు. ఉమ్మడి పాలమూరు ప్రాజెక్ట్ లపై పదేండ్లలో కేవలం రూ.ఆరు వేల కోట్లు ఖర్చు పెట్టారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండున్నర ఏండ్లలో రూ. 8 వేల కోట్లు ఖర్చు చేసిందనీ చెప్పారు. ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్క నిద్ర చేసి పాలమూరు రంగారెడ్డి భూసేకరణకు రూ. 600 కోట్ల నిధులను విడుదల చేయడంతో మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు 2029 ఎన్నికల్లో మళ్లీ 14 సీట్లు గెలిపించి రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వడానికి తహతహలా డుతున్నారనీ ఆశాభావం వ్యక్తంచేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్ పెట్టాలని కేంద్ర రక్షణమంత్రిని ముఖ్యమంత్రి అడిగినందుకు ధన్యవాదాలు చెప్పారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ పోతిరెడ్డి పాడు నుంచి రోజుకు 44వేల క్యూసెక్కులు పోతుంటే గగ్గోలుపెట్టిన కెసిఆర్ రోజుకు 11 టిఎంసిలు తరలించుకొని పోయే మౌలిక వసతులు తన హయాంలో ఆంధ్రాపాలకులు అభివృద్ధి పరుచుకొంటున్నా మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ తెలంగాణ ప్రజలకు నమ్మక ద్రోహం చేసిందని విమర్శించారు. ఈ మీడియా సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీ కృష్ణ , మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## సనత్‌నగర్ టిమ్స్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

### 184 పోస్టులకు 3 నోటిఫికేషన్లు విడుదల

### జూలై 6 వరకు దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** సనత్‌నగర్ టిమ్స్‌లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టిమ్స్‌లో 184 పోస్టుల భర్తీ కోసం 3 నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. డాక్టర్లు, టెక్నీషియన్లు సహా పలు రకాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. నిమ్స్ తరహాలో టిమ్స్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయించిన ప్రభుత్వం, రిక్రూట్‌మెంట్ బాధ్యతలను నిమ్స్‌కి అప్పగించింది. ఈ నేపథ్యంలో టిమ్స్‌లో ఉద్యోగాల భర్తీకి నిమ్స్ మంగళవారం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 184 కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. 184 పోస్టులను మూడు నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనునానరు. 31 మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులు, 122 టెక్నికల్, అలైడ్ హెల్త్, అడ్మినిస్ట్రేటివ్ పోస్టులు, 31 పోస్టులు సపోర్ట్, ఇంజినీరింగ్, సెక్యూరిటీ, లీగల్, పీఆర్ తదితర పోస్టులున్నాయి. మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులు -31, ప్రొఫెసర్లు -5, అసోసియేట్ ప్రొఫెసర్లు -2, అసిస్టెంట్ ప్రొఫెసర్లు -24, కార్డియాలజీ, సీటీవీఎస్, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. భర్తీ చేయనున్న పోస్టులకు ఆయా పోస్టును బట్టి డిగ్రీ, పీజీ, బీఎస్సీ, డిప్లొమా, బీఈ,బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ తదితర అర్హతలను నిర్ణయించారు. వయోపరిమితిని మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు పోస్టును బట్టి 50 నుంచి 58 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితిగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం వయోసడలింపు ఉంటుంది. మెడికల్ ఫ్యాకల్టీ పోస్టులకు అభ్యర్థులు నిమ్స్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి, అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌తో జులై 6న ఉదయం 9 గంటలకు నిమ్స్‌లో జరిగే వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి. టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, ఇతర పోస్టులకు దరఖాస్తులను నోటిఫికేషన్‌లో సూచించిన నమూనాలో పూర్తి చేసి, అవసరమైన సర్టిఫికెట్లతో జూలై 6 సాయంత్రం 4 గంటలలోపు నిమ్స్‌లో సమర్పించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, ఆధార్, జనన తేదీ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రం, బీసీలకు నాన్‌క్రీమీ లేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్ (వర్తిస్తే), ప్రస్తుతం ఉద్యోగంలో ఉంటే ఎన్‌వోసీ తదితర పత్రాలు జతచేయాలి. దరఖాస్తు ఫీజుమెడికల్ ఫ్యాకల్టీ పోస్టులు,సాధారణ అభ్యర్థులు - రూ.2,000, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు - రూ.1,000 ఫీజుగా చెల్లించాలి. ఇతర పోస్టులకి జనరల్ అభ్యర్థులు - రూ.1,000, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు - రూ.500 ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.

## రూ. 17 లక్షల ఎటిఎం డబ్బుతో వ్యాన్ డ్రైవర్ పరార్

**హైదరాబాద్ (సైదాబాద్), జూన్ 23, ప్రభాతవార్త:** ఏటిఎంలలో నగదు నింపే క్యాష్ వ్యాన్ డ్రైవర్ రూ.17లక్షలతో పరారైన సంఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏటిఎంలలో నగదు నింపే క్యాష్ వ్యాన్ మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో బాలనగర్ నుండి బయలుదేరి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న మూడు ఏటిఎంలలో నగదు నింపుకుంటూ సంతోష్‌నగర్‌లోని ఈదిబజార్‌లో ఉన్న ఎస్‌బిఐ ఏటిఎం వద్దకు 12.30 గంటల సమయంలో చేరుకుంది. ఏటిఎంలో నింపడం కోసం వ్యాన్‌లో ఉన్న నగదు తీసుకుని ఇద్దరు టెక్నీషియన్లు, గన్‌మెన్ ఏటిఎం వద్దకు వెళ్లారు. ఇదే సమయంలో వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్ వ్యాన్‌ను కొద్దిగా ముందుకు తీసుకువెళ్లి ఆపాడు. ముందస్తు పదజకంలో భాగంగా అప్పటికే అక్కడ మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై వేచి ఉన్నాడు. వ్యాన్‌లో ఉన్న మిగిలి ఉన్న రూ.17 లక్షల నగదు బ్యాగును తీసుకుని శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై ఆ వ్యక్తితో కలసి పరారయ్యాడు. వ్యాన్‌లోని నగదు మాయమైన విషయాన్ని కొద్దిసేపటి తర్వాత గమనించిన సిబ్బంది వెంటనే తమపై అధికారులకు సమాచారం అందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన పరిసర ప్రాంతాల్లోని సిసి కెమరాలను పరిశీలిస్తూ నిందితుడిని పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్‌ఓ నాగరాజు, డిఐ సాయి ప్రకాష్‌గౌడ్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'సర్' ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### 'సర్'కు వ్యతిరేకంగా కదంతొక్కిన అఖిలపక్షం

### అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్నికల కమిషనర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ

### అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పణ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. సర్‌కు వ్యతిరేకంగా అఖిల పక్షం రాష్ట్ర రాజధానిలో భారీ ర్యాలీ నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓటర్ల జాబితాకి సంబంధించిన సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. సర్‌కి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్, వామపక్షాలు, టిజెఎస్ శ్రేణులు కదం తొక్కాయి. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న సర్ ప్రక్రియను నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్, సిపిఐఎం, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) మాస్, ఎంసిపిఐ, ఎస్‌యుసిఐ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి బూర్గుల రామకృష్ణా రావు భవన్ వద్ద గల రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపి మల్లు రవి, సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎం ఎల్ ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, టి జె ఎస్ రాష్ట్రఅధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సి పి ఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ జి.వెన్నెల, సి పి ఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీ




అధికార ప్రతినిధి చలపతి, సిపిఐ (ఎంఎల్) మాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హన్మేష్, ఎస్ యు సి ఐ నాయకులు భరత్, వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు ర్యాలీలో అగ్రభాగాన నడిచారు. నిరసన ప్రదర్శన అనంతరం అ ఖిలపక్ష ప్రతినిధుల బృందం ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అదనపు సిఇఒ వాసం వెంకటేశ్వర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఓటర్ల జాబి తాలో మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియ ఎలాంటి పక్షపాతం లేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేదే లేకపోతే భవిష్యత్తులో పౌరసత్వంతో పాటు రేషన్ కార్డ్ ఇతర హక్కులు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపి మల్లు రవి మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడటం ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమన్నారు. ఆ దిశగా ఎన్నికల కమిషన్ పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.



సిఎం ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ రాష్ట్ర ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు

## సిఎం ప్రజావాణి పనితీరు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకం

### చిన్నారెడ్డితో మధ్యప్రదేశ్ రాష్ట్ర ట్రైనీ డిప్యూటీకలెక్టర్లు భేటీ

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 23, ప్రభాతవార్త :** సిఎం ప్రజావాణి పని తీరు దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని మధ్యప్రదేశ్ రాష్ట్ర ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అన్నారు. మంగళవారం జ్యోతిబాపూలే ప్రజా భవన్‌లో సిఎం ప్రజావాణిని మధ్యప్రదేశ్ రాష్ట్ర ట్రైనీడిప్యూటీ కలె క్టర్లు సందర్శించి పనితీరును పరిశీలించారు. వారు సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డితో కలిసి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఎం ప్రజావాణిలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తు తీసుకుని ఆన్‌లైన్ ద్వారా సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు సిఫారసు చేయ డం, ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వడం, ఫాలోఅప్ చేయడం వంటి అంశాలు తమకు వృత్తిపరంగా స్ఫూర్తిదాయకమని డిప్యూటీ కలెక్టర్లు పేర్కొన్నారు. సిఎం ప్రజావాణిలో సమస్యల పరి ష్కారం 74శాతం ఉందని సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సలహా మండలి వైస్‌ఛైర్మన్ మంద భీమ్‌రెడ్డి ప్రవాసీ ప్రజావాణి సాధించిన ప్రగతిని వారికి వివరించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ పీఠం పట్టు కోసం కాంగ్రెస్ నాయకుల కృషి

### హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి పోటీ పడుతున్న హేమాహేమీలు

### నల్లగొండ ఖమ్మం వరంగల్ నియోజకవర్గానికి పోటీ పడుతున్న నేతల సంతానం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ప్రతి రెండేళ్లకొకసారి శాసన మండ లికి జరిగే ఎన్నికలకు సెప్టెంబర్‌లో ఎన్నికల షెడ్యూల్ రాబోతుండటంతో పట్టభద్రుల ఎన్నికల వేడి అన్ని పార్టీల్లో రాజుకుంటున్నది. శాసనమండలిలో మార్చి 29న ఖాళీ అవుతున్న పట్టభద్రుల ఎంఎల్‌సి పీఠం పట్టుకోవడం కోసం కాంగ్రెస్ నాయకులు పోటీ పడుతున్నారు. ఖాళీ కాబోతున్న హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2028లో అసెంబ్లీ ఎన్నిక జరుగుతుండటంతో తెలంగాణలోని రాజకీయపార్టీలు శాసనమండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొంటాయి. టికెట్టు సంపాదించుకొంటే అందరు చమటోడ్చి పనిచేస్తారని ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు భావిస్తున్నారు. ఎన్నికలు జరిగే ఆరు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఈ ఎన్నికలు ఒక ప్రీఫైనల్‌గా ఉండటంతో ఎలాగైనా గెలిపిస్తారని ఎమ్మెల్సీ స్థానం ఆశించే నాయకులు భావిస్తున్నారు. దీనితో ఎలాగైన ఎమ్మెల్సీ టికెట్టు పొందాలని ఇప్పటి నుంచే గ్రాడ్యుయేట్స్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలవాలని కాంగ్రెస్ మీడియా కమిటి చైర్మన్ సామరామోహ్మన్‌రెడ్డి,హార్షవర్ధన్‌రెడ్డి, చిన్నారెడ్డి, గౌరి సతీష్, ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ ఇప్పటి నుంచే ప్రయత్నాలు ఆరంభించారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డికి అవకాశం కల్పిం చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనీ, మరోవైపు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తన కుమారుడు సూర్యను రాజకీయ ఆరంగేట్రం చేయించాలని ప్రయత్నాల చేస్తోన్నట్లు ప్రచారం జరుగుతోన్నది. తెలంగాణ రాష్ట్ర గ్రంథాయల సంస్థ చైర్మన్ డా. రియాజ్ కూడా తన ప్రయత్నం తాను చేసుకొంటున్నాడని ప్రచారం జరుగుతున్నది.

# ప్రైవేటు ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ ఆత్మహత్య

## బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

## మత్తు ఇంజెక్షన్లు తీసుకొని బలవన్మరణం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జూన్ 23, ప్రభాతవార్త:** ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నైట్ డ్యూటీ చేసిన సదరు డాక్టర్ ఆసుపత్రిలోనే విశ్రాంతి గదిలో మత్తు ఇంజెక్షన్లు తీసుకొని బలవర్మరణానికి పాల్పడడం కలకలం సృష్టించింది. డాక్టర్ ఆత్మహత్యకు గల కారణాలు బయటకు రాకపోవడంతో ఈ కేసు పలు అనుమానాలకు తావిచ్చింది. హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ కిందకు వచ్చే బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన ఖాసిఫ్ అహ్మద్ (27) హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ మొఘల్‌పురా వద్ద ఉన్న ప్రభుత్వ నిజామియా టిబ్బి కాలేజీ (యునాని మెడికల్ ఇన్‌స్టి ట్యూషన్)లో వైద్య విద్యను పూర్తి చేసుకొని బాలాపూర్ సమీపం లోని మల్లాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోనున్న రికవరీ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నాడు. అవివాహితుడైన అహ్మద్ యాకుత్‌పురాలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఆసుపత్రికి వచ్చి పని చేస్తుండేవాడు. అయితే ఆదివారం నైట్ డ్యూటీ చేసిన ఖాసిఫ్ అహ్మద్ సోమవారం ఉదయం తానుంటున్న హాస్టల్‌కు వెళ్ళకుండా ఆసుపత్రిలోనే ఉన్నాడు. డాక్టర్లు విశ్రాంతి తీసుకునే గదికి గడియ పెట్టుకొని సాయంత్రం అయినా తెరవకపోవడంతో స్పందించిన సిబ్బంది తలుపులు బద్దలు కొట్టి తెరిచారు. అప్పటికే బెడ్‌పై మృతి చెందిన ఉన్న అహ్మద్ పక్కనే మత్తుకు సంబంధించిన ఇంజెక్షన్లు, సిరంజీలు కనిపించాయి. దీంతో ఆత్మహత్యగా భావించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పంచనామా జరిపి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాగా నైట్ డ్యూటీ చేసిన డాక్టర్ ఖాసిఫ్ అహ్మద్ ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు వెల్లడించలేదు. మంగళవారం ఉదయం పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా వారు అంత్యక్రియల నిమిత్తం వైజాగ్‌కు తీసుకెళ్ళినట్లు సమాచారం. అయితే డాక్టర్ మృతిపై స్పందించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్ద ధర్నా చేసినట్లు వచ్చిన వార్తలు నిజం కాదని ఇన్స్‌పెక్టర్ సుధాకర్ వెల్లడించారు. ఆతహత్యకు గల కారణాలపై పోలీసుల దర్యాప్తు జరుగుతున్నది.



డాక్టర్ ఖాసిఫ్‌అహ్మద్(ఫైల్)

# విత్తన ధ్రువీకరణ సంస్థను సందర్శించిన ఆఫ్రికా బృందం

## రాష్ట్రంలో రెండు రోజులపాటు పర్యటన

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** తెలంగాణ విత్తన ధృవీకరణ సంస్థను గేట్స్ ఫౌండేషన్ ఆఫ్రికా బృందం సంర్శించింది. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు మంగళవారం ఈ బృందం తెలంగాణలో విత్తన రంగ అభివృద్ధి, అధునాతన సౌకర్యాలపై అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న అధునాతన విత్తనాల ప్రాసెసింగ్ సౌకర్యాలతో పాటు, రాజేంద్రనగర్ లో విత్తన ధ్రువీకరణ సంస్థ అధునాతన విత్తన పరీక్ష ల్యాబ్ ను సందర్శించి, విత్తన పరీక్ష పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా, ఆఫ్రికాకు చెందిన ప్రతినిధి డాక్టర్ డోనాల్డ్ మాట్లాడుతూ, విత్తన ఎగుమతులను కాకుండా, రైతులకు కూడా మంచి నాణ్యమైన విత్తనాలను అందించడంలో ఇలాంటి విత్తన పరీక్ష కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. అదేవిధంగా సాథీ అనే ఆన్ లైన్ పోర్టల్ ద్వారా దేశంలో విత్తనాల సరఫరా ప్రకియ మొత్తాన్ని నియంత్రించే ట్రెసబిలిటీ విధానన్ని ఆఫ్రికాలో కూడా అమలుపరుస్తామని తెలిపారు. విత్తన ధృవీకరన సంస్థ డైరెక్టర్ డాక్టర్ అడపా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో నాణ్యమైన విత్తనోత్పత్తికి సహజ సిద్ధమైన వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ బృందంలో ఆఫ్రికా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఓ బ్రెయిన్, డిప్యూటీ డైరెక్టర్ ఓబియా కలిఫా, సౌత్ సౌత్ ప్రతినిధి ప్రణయ్ సిన్హా, సౌత్ కేస్ట్, ఇండియా ప్రతినిధి శ్రియాధమని ఉన్నారు.

# ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం

## మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యం

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** పట్టణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న స్థలాభావం (భూ సౌకర్యాల కొరత) సమస్యను అధిగమిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఇండోర్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సంస్థ పరిధిలోని పలు జిల్లాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు చెప్పారు. వివిధ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

వినియోగదారులకు మెరుగైన నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్ని డీటీఆర్‌లు, విద్యుత్ లైన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. అలాగే లైన్ల నిర్వహణ చేపట్టి, లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇండోర్ సబ్‌స్టేషన్ల వల్ల ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరత సమస్య పూర్తిగా తీరుతుందని, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేని, మెరుగైన సరఫరా అందుతుందని, లోడ్ నిర్వహణ సైతం సులభతరమవుతుందని వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఆధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ సబ్‌స్టేషన్ల ద్వారా పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

# ప్రపంచ ఇంధన భద్రతకు మంచిరోజులు

## హార్ముజ్ జలసంధి తెరచుకోవడం ఎంతో మేలు

## ప్రపంచ సవాళ్ల పరిష్కారంలో బ్రిక్స్ దేశాలు కీలకపాత్ర పోషించాలి

## బ్రిక్స్ ఎన్‌ఎస్‌ఎల సమావేశంలో అజిత్‌దోవల్

**న్యూఢిల్లీ, జూన్ 23:** హార్ముజ్ జలసంధి తిరిగి తెరవడం ప్రపంచ ఇంధన భద్రతకు ఎంతో శుభపరిణామమని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ మంగళవారం పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో పాల్గొన్న సభ్య దేశాల ప్రతినిధులను ఆయన స్వాగతించారు. సమావేశ ప్రారంభ ప్రసంగంలో దోవల్ మాట్లాడుతూ, ప్రపంచం ప్రస్తుతం భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఆర్థిక ఒత్తిళ్లు, సాంకేతిక పరిజ్ఞాన మార్పుల వల్ల సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందని, ఈ సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ దేశాలు మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ సమావేశంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గే షోయుగు, ఇరాన్ భద్రతా అధికారి ఘదీర్ నెజామిపూర్‌తో పాటు ఇతర బ్రిక్స్ దేశాల సీనియర్ భద్రతా ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ) భారత్ స్వాగతిస్తోందని దోవల్ తెలిపారు. ఈ ఒప్పందం విజయవంతమవుతుందనే ఆశాభావం తమకు ఉందని, ఇది ప్రపంచ ఇంధన భద్రతకు మేలు చేస్తుందని చెప్పారు. హార్ముజ్ జలసంధి తిరిగి తెరవడం సరఫరా గొలుసులో ఏర్పడిన అవరోధాలను తొలగించడంతో పాటు ఎరువులు, రసాయనాల వంటి కీలక రంగాల్లో కొరత సమస్యలను తగ్గిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భద్రతా ముప్పు మరింత సంక్లిష్టంగా మారుతున్నదని, ఈముప్పు పరిష్కరించేందుకు ప్రస్తుత వ్యవస్థలు, సంస్థాగత యంత్రాంగాలు చాలావరకు సరిపోవడం లేదని దోవల్ ఆందోళన వ్యక్తం చేశారు. బహుపాక్షిక విధానం క్షీణిస్తున్న క్రమంలో బ్రిక్స్ వంటి వేదికల ప్రాధాన్యం మరింత పెరిగిందని అన్నారు. ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష దేశంగా ఉన్న భారత్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చింది. తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో ఏర్పడిన బ్రిక్స్ కూటమిలో 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరగా, 2025లో ఇండోనేషియా కూడా సభ్యత్వం పొందింది. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో దాదాపు 49.5 శాతం, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) సుమారు 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 26 శాతం వాటాను ప్రాతినిధ్యం వహిస్తున్న 11 ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహంగా బ్రిక్స్ ఎదిగిందని దోవల్ పేర్కొన్నారు. ప్రపంచం వేగంగా మారుతున్న ఈ సమయంలో శాంతి, అభివృద్ధి, సహకారాన్ని విశ్వసించే దేశాల కూటమిగా బ్రిక్స్‌కు ప్రత్యేక బాధ్యత ఉందని ఆయన అన్నారు. వివాదాల పరిష్కారానికి ఉన్న సంప్రదాయ పద్ధతులు బలహీనపడుతున్న నేపథ్యంలో బ్రిక్స్ ఏ విధమైన పాత్ర పోషించగలదో ఆలోచించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బ్రిక్స్ ఏర్పాటుకు గల లక్ష్యాలను ప్రస్తావిస్తూ, బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థను ప్రోత్సహించడం, ఆర్థిక సహకారాన్ని పెంపొందించడం, గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశమని దోవల్ వివరించారు. ప్రపంచ పాలనా వ్యవస్థల్లో సంస్కరణలు, సంస్థాగత మెరుగుదలలు తీసుకురావడం కూడా బ్రిక్స్ లక్ష్యాలలో భాగమని చెప్పారు. ఉగ్రవాద నిరోధక అంశాలపై బ్రిక్స్ సంయుక్త వర్కింగ్ గ్రూపుల నివేదికలపై కూడా ఈ సమావేశంలో చర్చ జరగనుందని ఆయన తెలిపారు. సంప్రదాయేతర భద్రతా ముప్పులు జాతీయ సరిహద్దులను దాటి విస్తరిస్తున్నాయని, విధ్వంసక సాంకేతికతల వల్ల కొత్త సవాళ్లు ఉత్పన్నమవుతున్నాయని హెచ్చరించారు. ఈ కొత్త తరహా భద్రతా సవాళ్లను సమిష్టిగా ఎదుర్కొనే మార్గాలపై సమావేశంలో విస్తృత చర్చలు జరగనున్నాయని దోవల్ వెల్లడించారు.




మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల భద్రతా సలహాదారుల సమావేశంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎ అజిత్‌దోవల్

# అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు ఆదర్శం

## గ్రామాలకు వచ్చే ప్రతి రూపాయి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి

## రాష్ట్రస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 23:** గ్రామాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు నిర్మించడం మాత్రమే కాదని, గ్రామాల్లో నివసించే ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే అసలు అభివృద్ధి అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గ్రామాలను స్వయం సమృద్ధిగా, నగరాలకు తీసిపోని మౌలిక వసతులతో తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామీణాభి వృద్ధి, పంచాయతీరాజ్ శాఖల రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ పథకం తదితర విభాగాల అధికారులతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్యా దేవరాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏడు గంటల పాటు సాగిన సమావేశంలో శాఖల వారీగా పనుల పురోగతి, భవిషత్తు లక్ష్యాల ను సమీక్షించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో సుమారు 1.35 లక్షల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఏటా రూ.34 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చవుతున్నాయని గుర్తుచేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో జరగనున్న సమావేశంలో రాష్ట్ర సమస్యలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. పిఎంజిఎస్‌వై కింద అటవీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు.

# సిపిఎస్ రద్దు అధికారం రాష్ట్రాలదే

## ఒపిఎస్ అమలుతో తెలంగాణకు రూ.20వేల కోట్ల తక్షణ ఆర్థిక లాభం

## పిఎఫ్ఆర్‌డిఎ నిబంధనల్లో రాష్ట్రాలకు ఎగ్జిట్ పాలసీ నిరూపితం

## టిఎస్‌సిపిఎస్‌ఇయు స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించే సంపూర్ణ రాజ్యాంగబద్ధమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సి పిఎస్ ఈయు) స్పష్టం చేసింది. పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇదే విషయాన్ని మరోసారి న్యాయపరంగా రుజువు చేసిందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరణ అనేది ఉద్యోగుల సామాజిక భద్రతకే కాక, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక రంగానికి కూడా ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. సిపిఎస్ ఉద్యోగుల ప్రాన్ పెన్షన్ నిధి తిరిగి రాష్ట్రాలకు ఇవ్వొచ్చని అనేది పిఎఫ్ఆర్‌డిఏలో ఎగ్జిట్ పాలసీ నిరూపితమైందని, నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్/సిపిఎస్) నిబంధనల ప్రకారం రాష్ట్రాలు తాము దాచుకున్న నిధులను వెనక్కి తీసుకు నేందుకు, చట్టబద్ధంగా వైదొలిగేందుకు పూర్తి వెసులుబాటు ఉందని తెలిపారు. ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకుని సాంకేతిక బాధితులకు ఓపీఎస్ అమలు చేయడం ద్వారా ఈ ఎగ్జిట్ పాలసీ మార్గం సుగమమైందని, కేంద్ర ఆర్థిక శాఖ (పిఎఫ్ఆర్‌డిఏ) వద్ద జమైన నిధులను రాష్ట్రాలు తిరిగి రాబట్టుకోవచ్చని స్పష్టమైందని స్థితప్రజ్ఞ తెలిపారు. 2004 కంటే ముందు వెలువడిన నోటిఫికేషన్ల ప్రకారం ఎంపికై, సాంకేతిక/ నోటిఫికేషన్ సమస్యల వల్ల నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యా యులకు ఓపీఎస్ అమలు చేయడం ద్వారా కేంద్ర ఆర్థిక శాఖ (పిఎఫ్ఆర్‌డీఏ) వద్ద జమైన రాష్ట్ర ప్రభుత్వ వాటాను తిరిగి రాష్ట్ర ఖజానాకు రాబట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యిందని స్పష్టం చేశారు.

# ఆస్పత్రిలో ముద్రగడ

## ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన జగన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. జూన్ 23,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ ఆరోగ్య సమాచారాన్ని ఆయన నిరంతరం అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముద్రగడ తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబుతో వై.ఎస్. జగన్ సోమవారం ఫోన్‌లో టచ్‌లో ఉన్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను, ఆయన ఆరోగ్య పురోగతిని గిరిబాబును అడిగి తెలుసుకున్న జగన్, కుటుంబ సభ్యులకు కొండంత ధైర్యాన్నిచ్చారు. ముద్రగడ వైద్యానికి అవసరమైన నిపుణులైన వైద్యుల బృందాన్ని కూడా జగన్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా, మెరుగైన చికిత్స అందుతుండటంతో ముద్రగడ మంగళవారం నాటికి చాలా వరకు కోలుకున్నట్లు సమాచారం అందింది.

**వైద్యులతో నిరంతరం మాట్లాడుతున్నా..**

ముద్రగడ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు, అభిమానులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వై.ఎస్. జగన్ పేర్కొన్నారు. ఆయన తప్పకుండా త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముద్రగడకు అందుతున్న చికిత్సకు సంబంధించి తాను స్వయంగా వైద్యులతో మాట్లాడానని, ఆయన ఆరోగ్య పరిస్థితిని తాను దగ్గరుండి నిరంతరం పర్యవేక్షిస్తున్నానని గిరిబాబుకు వివరించారు.

# రాజకీయ నేతలకు వెంకయ్యనాయుడు స్ఫూర్తి

## రాజకీయాల్లో హుందాతనంగా ఉండాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 23, ప్రభాతవార్త:** మాజీ ఉపరాష్ట్రపతిగా, ఐదు దశాబ్దాలకుపైగా ప్రజా జీవితంలో నిరంతర సేవలు అందిస్తూ 77 వసంతాలు పూర్తి చేసుకున్న ముప్పవరపు వెంకయ్యనాయుడు జీవన ప్రస్థానాన్ని వివరిస్తూ సీనియర్ పాత్రికేయుడు మాశర్మ రచించిన 'వెంకయ్య నాయకుడు' తెలుగు పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్, జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, మాజీ డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి, వెంకయ్యనాయుడు కుటుంబ సభ్యులు, పలువురు ప్రజాప్రతి నిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, వెంకయ్యనాయుడు 46 సంవత్సరాలకు పైగా ప్రజా జీవితంలో ఎందరో నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. విద్యార్థి దశలో ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీతో ప్రారంభమైన ఆయన ప్రయాణం జన సంఘ్, బీజేపీలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రతి పదవికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని కొనియాడారు. తెలంగాణ అంశంపై అసెంబ్లీలో, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా వెంకయ్య నాయుడు ప్రదర్శించిన హుందాతనం, వాదనా పటిమ నేటి తరం ప్రజాప్రతినిధులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో హుందాతనం తగ్గుతోందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా నాయకులు వ్యవహరించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధతో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖను సమర్థంగా నిర్వహించారని గుర్తు చేశారు. ఉపరాష్ట్రపతిగా రాజ్యసభను అన్ని పార్టీలను కలుపుకొని హుందాగా నడిపించారని, కొందరికి పదవులతో గౌరవం వస్తే వెంకయ్యనాయుడు వంటి నాయకుల వల్లే పదవులకు గౌరవం పెరుగుతుందని అన్నారు. సమయపాలన, పరిపాలనా నైపుణ్యం, హైదరాబాద్ మెట్రో వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కిషన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకయ్య నాయుడు రాజకీయ జీవితమే కాకుండా వ్యక్తిగత జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని అన్నారు. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. నా రాజకీయ, జీవన ప్రస్థానాన్ని తెలియజేస్తూ రూపొందిన 'వెంకయ్య నాయకుడు' పుస్తకాన్నీ ఆవిష్కరించడం ఆనందదాయకం. నా మీద అభిమానంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు, ఆత్మీయులకు, మిత్రులకు, కుటుంబసభ్యులకు అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు ఆయన సతీమణి ఉష, ఇంద్రసేనారెడ్డి, ఎపి మంత్రి సత్యకుమార్ తదితరులు

# తెలంగాణ, ఆంధ్ర మధ్య ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు

## 3 గిగావాట్ల విద్యుత్ తరలింపునకు అనుసంధానం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విద్యుత్ సరఫరా ప్రసార అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు గాను 5వ ఆర్‌ఈజెడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్రం చర్యలు చేపట్టింది. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెరుగుతున్నందున నిరంతరాయ విద్యుత్ తరలింపు, గ్రిడ్ స్థిరత్వం కోసం పటిష్టమైన, అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలు కీలకమైన నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. ఇందులో భాగంగా కర్నూలు 5వ పునరుత్పాదక ఇంధన జోన్ (ఆర్‌ఈజెడ్) రెండో దశ కింద ఉద్దేశించిన 3 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను తరలించడాన్ని సులభతరం చేయడానికి ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా కలిగి ఉన్నట్లు తెలంగ్గా విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ ప్రసార అనుసంధాన్ని బలోపేతం చేయడంతోపాటు, గ్రిడ్ సౌలభ్యాన్ని పెంచుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అంతేకాకుండా జాతీయ గ్రిడ్‌లోకి పునరుత్పాదక ఇంధనాన్ని భారీ స్థాయిలో అనుసంధానించడానికి సైతం తోడ్పడుతుందని వెల్లడించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణ పనులను తాజాగా రెసోనియా సంస్థ దక్కించుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా 765/400కెవి డోమా సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం, ప్రస్తుతం ఉన్న కర్నూలు-5 పూలింగ్ స్టేషన్‌ను విస్తరించడం, 120 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న అనుబంధ ట్రాన్స్ మిషన్ మౌలిక సదుపాయలను అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయి.

# గిరిజన సంక్షేమంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పొడిగింపు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాలు, సంస్థల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ శాఖలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బంది సేవల కొనసాగింపునకు సంబంధించి తాజాగా సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా విభాగాల్లో అనుమతించిన పోస్టుల సంఖ్య, జిల్లాల వారీ కేటాయింపుల్లో గతంలో దొర్లిన కొన్ని సాంకేతిక లోపాలను సవరిస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ ఉత్తర్వులను విడుదల చేశారు. గిరిజన సంక్షేమశాఖ పరిపాలన నియంత్రణలోని ఆరు విభాగాల్లో మొత్తం 3,431 పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు (మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ మొత్తం పోస్టుల్లో 2,225 కాంట్రాక్ట్ ఉద్యోగులు, మరో 1,206 అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# రూ.2కే పసుపు మొక్క

## రైతులకు స్వల్ప ధరలకు పసుపు పరిశోధన కేంద్రం సరఫరా

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** నిజామాబాద్ తదితర జిల్లాలో పసుపు సాగు చేసే రైతులకు కమ్మర్పల్లి పసుపు పరిశోధన కేంద్రం వరంగా మారింది. కేంద్రంలో ఒక్కో మొక్క రూ.2కే ఒక్కొక్కరికి వెయ్యి నారు మొక్కలను అందిస్తున్నట్లు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విద్య తెలిపారు. ఇందులో భాగంగా మంగళవానం పలువురు రైతులకు నారు పంపిణీ చేశారు. బయట మార్కెట్లో ఒక్కో మొక్క రూ.5 నుంచి రూ.10 వరకు ఉండగా, తమ వద్ద రూ.2కే లభిస్తోందన్నారు. దీంతో ఎకరాకు నారు ఖర్చు సుమారు రూ.2 వేలకు తగ్గిందని వెల్లడించారు. ఈ నర్సరీలో నెల రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో నారును పెంచి నేరుగా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

# అణుసంస్థ తనిఖీలకు ఇరాన్ అంగీకారం : ట్రంప్

## అలాంటిదేమీ లేదని ఖండించిన ఇరాన్

## ఇప్పటికీ కొనసాగుతున్న అమెరికా, ఇరాన్ వాదోపవాదాలు

**వాషింగ్టన్, జూన్ 23:** ఇరాన్ తన అణు కార్యక్రమంపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధికారులకు తనిఖీలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వడానికి అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించినా ఇరాన్‌మాత్రం ఖండించింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఖండిస్తూ, అలాంటి ఒప్పందం ఏదీ లేదని స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించి, దీర్ఘకాలిక శాంతి కోసం చర్చలు జరిపేందుకు అమెరికా-ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల స్విట్జర్లాండ్‌లో రెండు రోజుల పాటు జరిగిన కీలక చర్చల అనంతరం ఇరు దేశాలు కొన్ని అంశాలపై పురోగతి సాధించినట్లు సమాచారం.



ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో చేసిన పోస్టులో, ఇరాన్ భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు పూర్తిగా అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ చర్య వల్ల అణు పారదర్శకత నిర్ధారితమవుతుందని ఆయన అన్నారు. ఇరాన్ ఈ ప్రతిపాదనకు అంగీకరించకపోతే తదుపరి చర్చలు జరిగేవి కావని ట్రంప్ అన్నారు. అదే సమయంలో, ఇరాన్ చేసిన కొన్ని కీలక రాయితీల నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వెల్లడించారు. అవసరమైతే నౌకాదళ నిర్బంధాన్ని తిరిగి అమలు చేసే సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ, ఇపుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదని వెల్లడించారు. ఇరాన్‌కు విడుదల చేస్తున్న నిధులు లేదా ఆంక్షల సడలింపుల ద్వారా లభించే మొత్తాన్ని అమెరికా పర్యవేక్షణలోని ఎస్క్రో ఖాతాల్లో ఉంచుతామని ట్రంప్ తెలిపారు. ఆ నిధులను ఆహారం, వైద్య సరఫరాల కొనుగోలుకు మాత్రమే వినియోగిస్తారని, ముఖ్యంగా అమెరికా రైతులు ఉత్పత్తి చేసే మొక్కజొన్న, గోధుమలు, సోయాబీన్స్ వంటి వస్తువుల కొనుగోలుకు ఉపయోగిస్తారని చెప్పారు. ఇరాన్‌లో నెలకొన్న మానవతా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సహాయం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ నుంచి వెంటనే వ్యతిరేక స్పందన వచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ, అమెరికా మరియు ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న తమ అణు కేంద్రాలను ఐఎఇఎ తనిఖీ చేయడానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్‌తో మాకు ఎలాంటి సమావేశం జరగలేదని, అమెరికా, జియోనిస్టు దాడులతో నష్టపోయిన అణు కేంద్రాలను తనిఖీ చేయడానికి ఏజెన్సీకి అనుమతి ఇచ్చే ప్రణాళిక కూడా లేదని బఘాయి పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అలీ బహ్రాయిని కూడా ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు. అమెరికా అధికారిక ప్రకటనలు మరియు ఇరాన్ వైఖరి మధ్య స్పష్టమైన విభేదాలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న దౌత్య చర్చల్లో ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల సడలింపు, ప్రాంతీయ భద్రత వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. అయితే అంతర్జాతీయ తనిఖీల పరిధి, హార్ముజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ, స్తంభింపజేసిన ఇరాన్‌ఆర్థిక నిల్వల విడుదల వంటి కీలక అంశాలపై ఇంకా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.



మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎన్.రాంచందర్ రావు. చిత్రంలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్, ఎంఎల్‌సి అంజి రెడ్డి, ఎమ్మెల్యే హరీష్ బాబు, భరత్ గౌడ్

# యువత రాజకీయ అవకాశాలకు ప్రాధాన్యం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 23 ప్రభాతవార్త :** రాబోయే రోజులలో తమ పార్టీ యువతకు రాజకీయ అవకాశాలు కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పష్టం చేసారు. మంగళవారం బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ్ మండపంలో 'నమో జెన్ జెడ్ కాన్‌క్లేవ్' సదస్సు జరిగింది. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఐటీ నిపుణులు, విద్యార్థులు, యువతీ యువకులు తరలివచ్చారు. రాంచందర్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని యువతలో రాజకీయ చైతన్యం కలిగి ఉందని, దేశం బాగుండాలనే ఆలోచనతో ముందుంటారని సంకల్పంతో కలిగి ఉంటారన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టే సరికొత్త ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం నేటి యువత సొంతమని అన్నారు. గత పాలకుల కాలంలో యువత కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే మిగిలి పోయిందని కానీ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నేడు యువత దేశాన్ని నడిపించే శక్తులుగా ఎదిగారన్నారు. తెలంగాణలో యువత మార్పును కోరుకుంటోందని ఈ సదస్సుకు వచ్చిన ప్రజాఖాళాభ్యమే నిదర్శనమన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో నిరుద్యోగ సమస్యలపై, నోటిఫికేషన్ల జాప్యంపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని గుర్తుచేశారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత, విద్యార్థుల సమస్యలను శాసనసభ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, బీజేవైఎం శ్రేణులు బలోపేతం చేయాలని యువతను చైతన్యపరచాలని కోరారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే మాట్లాడుతూ ఈ కాన్క్లేవ్ విజయవంతం చేసిన యువతకు కృతజ్ఞతలు తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, శాసనమండలి సభ్యుడు అంజి రెడ్డి, బీజేపీ మహాంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వాతిరి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో వ్యవసాయ వర్సిటీ, ఆస్కి అధికారులు

# వర్సిటీ, ఆస్కిల మధ్య అవగాహన ఒప్పందం

**అత్తాపూర్, జూన్ 23,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఆస్కి), హైదరాబాద్‌ల మధ్య మంగళవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఆస్కి రిజిస్ట్రార్, సెక్రటరీ డాక్టర్ ఓపీ సింగ్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అంశాలలో మానవ వనరుల శిక్షణ,అభివృద్ధి, యాజమాన్య పద్ధతులు, ఆధునిక పరిపాలన విధులు, పద్ధతులు, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ తదితర అంశాలలో కలిసి పని చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. ఈ ఒప్పందం ప్రకారం వ్యవసాయ వర్సిటీకి సంబందించిన వివిధ కళాశాలల అసోసియేట్ డీన్స్, ప్రాంతీయ పరిశోధన కేంద్రాల అసోసియేట్ డైరక్టర్స్ ఆఫ్ రీసెర్చ్ మరియు ఇతర ఉన్నతాధికారులకి ఆస్కిలో జూలై 13,15 తేదీల మధ్య సీనియర్ మేనేజ్ మెంట్ మరియు ఎగజిక్యూటివ్ శిక్షణతరగతులు నిర్వహించనున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆస్కి సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్‌రూరల్ డెవలప్ మెంట్ డైరక్టర్ వి. ఉషారాణి,పిజెటిఎయు పరిశోధన సంచాల కులు డాక్టర్ బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, వర్సిటీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు అయ్యంగార్ పాల్గొన్నారు.




మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న విజయభారతి

# ఖమ్మం సంఘటన భయానకం

## జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి

**జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్త:** ఖమ్మం సంఘటనలో చికిత్స పొందుతున్న బాలికను జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న బాలిక జీవితాన్ని చిదిమేసిన సంఘటన ఇది అన్నారు. బాలిక స్పైనల్‌కార్డ్ చితికిపోయిందని, కాళ్లు కదల్చలేకపోతుం దన్నారు. నిమ్స్‌లో ప్రత్యేక వైద్య బృందం చికిత్సను అందిస్తుం దన్నారు. చిన్నారి ఇప్పటికి జరిగిన సంఘటనపై ఇంకా బయంగానే ఉందన్నారు. ఖమ్మంలో సంఘటన జరిగిన భవనాన్ని పరిశీలిస్తామని, సంఘటన జరిగిన రెండు రోజులపాటు ఖమ్మం ఆసుపత్రిలో అందించిన చికిత్స వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. అలాగే అక్కడి పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలను పరిశీలిస్తామన్నారు. ఇంకా కొన్ని నివేదికలు అవసరమున్నాయని వాటన్నింటిని సేకరించి ఢిల్లీకి వెళ్లిన అనంతరం సమగ్రంగా పరిశీలించి జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి అవసరమైన నిర్ణయాలు తీసుకొంటామన్నారు. చిన్నారి ఆమె కుటుంబం జీవించే హక్కు, అలాగే గౌరవంగా జీవించే హక్కును కోల్పోయిందన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు నిర్లక్ష్య రాస్యులని, చక్రాల కుర్చీలో బిడ్డను తీసుకెళ్తే సమాజమంతా గుర్తించి ప్రత్యక్షంగా అడుగు తందనే మనోవేదన తల్లిదండ్రుల కనిపిస్తుం దన్నారు. సమాజంలో భయాన్ని సృష్టించిన ఈ సంఘటన మిగిలిన పిల్లలను తల్లిదండ్రులు భయపడెతుందన్నారు. ఇది ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయమని, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతిరోజు చిన్నారి తల్లి దండ్రులతోమాట్లాడుతున్నారని, వారికి కావల్సిన ధైర్యాన్ని, వైద్య సాయాన్ని అందిస్తున్నారన్నారు.



# రంజిత్ రెడ్డి నివాసం ముందు స్వామీజీల ఆందోళన

**జూబ్లీహిల్స్, జూన్ 23, ప్రభాతవార్త:** ఫిల్మ్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 2,750 గజాల భూమిని స్వామివారి పేరుతోనే నమోదు చేయా లని డిమాండ్ చేస్తూ పలువురు పీఠాధిపతులు, మఠాధిపతులు, హిందూ సంఘాల నాయకులు మంగళవారం జూబ్లీహిల్స్‌లో మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి నివాసం ముందు శాంతియుత ఆందోళన నిర్వ హించారు. ఈ సందర్భంగా స్వామీజీలు మాట్లాడుతూ, డీఎస్ఆర్ గ్రూప్ తరఫున సుధాకర్ రెడ్డి గతంలో స్టాంప్ పేపర్‌పై స్వామివారి పేరుతోనే 2,750 గజాల భూమిని కేటాయిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ భూమిని దేవస్థానం పేరుతో కాకుండా ఎండోమెంట్స్ శాఖ పేరుతో నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇచ్చిన హామీని నిలబెట్టి ఆలయ భూమిని స్వామివారి పేరుతోనే నమోదు చేయాలని వారు డిమాం డ్ చేశారు. పోలీసులు మాజీ ఎంపీ నివాసం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శివస్వామి, కృష్ణమాచార్య స్వామి, ఆత్మానంద భారతిస్వామి, భక్తి చైతన్యానంద సరస్వతిస్వామి,మాతా శివకామేశ్వరి ఆనందమయిమాతాజీ, సారంగదానందస్వామి, బాజీల్ గురుస్వామి, ప్రసన్నకృష్ణదాస్ ప్రభూజి స్వామి, మధు మంజరిదేవి స్వామిని పాల్గొన్నారు.

# యుద్ధ వ్యయం భర్తీకి 80 బిలియన్ డాలర్లు కావాలి

## అమెరికన్ కాంగ్రెస్ సభ్యులకు తెలిపిన రక్షణ ఉప కార్యదర్శి స్టీఫెన్ ఫెయిన్‌బర్గ్

**వాషింగ్టన్,జూన్ 23:** ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన వ్యయా లు, రక్షణేతర ఖర్చులను భరించేందుకు అమెరికా రక్షణ శాఖకు అదనంగా 80 బిలియన్ డాలర్లు అవసరమని అమెరికా ఉప రక్షణ కార్యదర్శి స్టీఫెన్ ఫెయిన్‌బర్గ్ కాంగ్రెస్ సభ్యులకు తెలిపారు. పెంటగాన్ అవసరాలతో పాటు వ్యవసాయం, ప్రకృతి విపత్తుల సహాయ కార్యక్రమాలు వంటి రక్షణేతర రంగాలకు నిధులు కల్పించే అదనపు బడ్జెట్ అభ్యర్థనను అమెరికా ప్రభుత్వం త్వరలోనే కాంగ్రెస్‌కు సమర్పించనుంది. ఇరాన్ యుద్ధానికి సంబంధించిన పూర్తి వ్యయ వివరాలను విడుదల చేయాలని అమెరికా చట్టసభ సభ్యులు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తు న్నారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధం ఇప్పటివరకు అమెరికాకు దాదాపు 25 బిలియన్ డాలర్ల వ్యయం కలిగించినట్లు పెంటగాన్ ఏప్రిల్‌లో ప్రకటించింది. ఆయుధ సామగ్రి, సైనిక పరికరాల నిర్వహణపైనే ఎక్కువ ఖర్చు జరిగినట్లు తెలిపింది. పెంటగాన్ బడ్జెట్ విభాగం ఉన్నతాధికారి జూల్స్ హర్స్ట్ కాంగ్రెస్‌కు ఇచ్చిన తాజా నివేదికలో ఇరాన్ యుద్ధ వ్యయం సుమారు 29 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. ఇందులో సామగ్రి మరమ్మ తులు, భర్తీ, ఆపరేషనల్ ఖర్చులు ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తూ యుద్ధానికి ఖర్చు చేస్తున్న నిధులను మానవతా సహాయానికి కేటాయించి ఉంటే 8.7 కోట్ల మందికి ప్రాణరక్షణ అందించవచ్చని తెలిపింది. ఐరాస మానవతా విభాగం అధిపతి టామ్ ఫ్లెచర్ మాట్లాడుతూ, ఈ యుద్ధానికి ప్రతిరోజూ 2బిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. 8.7 కోట్ల మందిని కాపాడేం దుకు మేము రూపొందించిన అత్యవసర ప్రణాళిక మొత్తం వ్యయం 23 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ యుద్ధానికి రెండు వారాల లోపే ఖర్చు చేసిన డబ్బుతో ఆ ప్రణాళికను అమలు చేయవచ్చని వ్యాఖ్యానించారు.

ట్రంప్ ప్రభుత్వం వెల్లడించిన దానికంటే యుద్ధ వ్యయం మరింత ఎక్కువగా ఉండొచ్చని కొందరు డెమొక్రటిక్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రారంభంలో అదనపు నిధుల కోసం చేసిన 200 బిలియన్ డాలర్ల అభ్యర్థన కాంగ్రెస్‌లో తీవ్ర విమర్శలకు గురైంది. ఏప్రిల్‌లో జరిగిన ప్రతినిధుల సభ బడ్జెట్ కమిటీ సమావేశంలో వైట్ హౌస్ బడ్జెట్ డైరెక్టర్ రస్సెల్ వౌట్ యుద్ధం మొత్తం ఖర్చుపై తన వద్ద అంచనా లేదన్నారు. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ 2027 ఆర్థిక సంవత్సరానికి ట్రంప్ ప్రతిపాదించిన 1.5 ట్రిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్‌కు ఆయన మద్దతు తెలిపారు. కొందరు డెమొక్రటిక్ నేతలు ఇరాన్ యుద్ధం వల్ల అమెరికాపై మొత్తం ఆర్థిక భారం 630 బిలియన్ డాలర్ల నుంచి 1 ట్రిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.అమెరికా మధ్యంతర ఎన్నికలకు మరో ఐదు నెలల సమయం మాత్రమే మిగిలి ఉండగా, కాంగ్రెస్‌లో మెజారిటీని నిలుపుకోవడం ట్రంప్ నేతృత్వం లోని రిపబ్లికన్ పార్టీకి సవాలుగా మారుతోంది. పెరుగుతున్న జీవన వ్యయాలు, అధిక ఇంధన ధరలు, ఇరాన్ యుద్ధం వల్ల ఏర్పడుతున్న ఆర్థిక ఒత్తిడి కారణంగా ఓటర్లలో అసంతృప్తి పెరుగుతుండటంతో డెమోక్రాట్లకు మద్దతు పెరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# న్యాయరంగంలో కృత్రిమమేధ విజయం..

లండన్,జూన్ 23: న్యాయరంగంలో కృత్రిమ మేధ కొత్త చరిత్ర సృష్టించింది. బ్రిటన్‌కు చెందిన గార్‌ఫీల్డ్ ఏఐ అనే ఏఐ ఆధారిత న్యాయసంస్థ నిజమైన న్యాయవాదులతో పోటీ పడి కోర్టు కేసులో విజయం సాధించింది. ప్రపంచంలో ఏఐ సాయంతో నడిచే సంస్థ నేరుగా గెలిచిన తొలి కేసుగా దీనిని భావిస్తున్నారు. ఫ్రీలాన్స్ హెచ్ ఆర్ ప్రొఫెషనల్ టామిరెస్ కమల్ టాక్విడిర్‌కు ఒక హాస్పిటాలిటీ సంస్థ చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొట్టింది. దీంతో గార్‌ఫీల్డ్ ఏఐ సేవలను ఆమె ఆశ్రయించింది. కేవలం 400 పౌండ్లు (సుమారు రూ.50 వేల) చెల్లించి ఈ సేవలు పొందింది. ఏఐ సాయంతో ఈ కేసుకు సంబంధించిన పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర న్యాయపరమైన డాక్యుమెంట్లన్నీ గార్‌ఫీల్డ్ ఏఐ సంస్థ సిద్ధం చేసింది. విచారణ వేళ ఒక మానవ న్యాయవాదిని కోర్టులో వాదనలు వినిపించేందుకు నియమించింది. లండన్‌లోని వాండ్స్‌వర్త్ కౌంటీ కోర్టులో దాదాపు మూడు గంటలపాటు విచారణ జరిగింది. ఇరు పక్షాల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. చివరికి కోర్టు టాక్విడిర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆమెకు 7,000 పౌండ్లు అంటే సుమారు రూ.8.8 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. ప్రత్యర్థి సంస్థ దాఖలు చేసిన కౌంటర్ క్లెయిమ్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. గార్‌ఫీల్డ్ ఏఐ సహ వ్యవస్థాపకుడు ఫిలిప్ యంగ్ దీన్ని న్యాయరంగంలో గొప్ప మైలురాయిగా అభివర్ణించారు. ఏఐ సాయంతో న్యాయసేవలు మరింత తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నాడు. ప్రస్తుతం గార్‌ఫీల్డ్ ఏఐ 10 వేల పౌండ్ల సుమారు రూ.12.5 లక్షలు వరకు ఉన్న చిన్న క్లెయిమ్ కేసులను స్వీకరిస్తోంది.



# ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధం: పుతిన్

**మాస్కో, జూన్ 23:** రష్యా అధ్యక్షుడు పుతిన్ నోట నుంచి శాంతి ఉచ్చరణ వచ్చింది. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దాడుల ద్వారా రష్యా ఇంధన రంగాన్ని దెబ్బతీసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నిస్తోందని పుతిన్ ఆరోపించారు. ఉక్రెయిన్ దాడుల ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖకు ఆదే శించారు.ఇటీవల ఫ్రాన్స్ వేదికగా జీ 7 సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉండాలని దేశాలు తీర్మానం చేశాయి. రక్షణ విషయంలో అండగా ఉండాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయం తర్వాత రష్యాపై ఉక్రెయిన్ దాడులు ఉధృతం చేసింది. ఇంధన రంగాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో పుతిన్ ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉక్రెయిన్ రష్యా యుద్ధం నాలుగేళ్లకు పైగా సాగుతోంది. ఈ యుద్ధం తర్వాత మొదలైన అన్ని యుద్ధాలు ముగిసిపోయాయి గానీ ఉక్రెయిన్‌రష్యా యుద్ధం మాత్రం ముగియలేదు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక శాంతి ఒప్పందం చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. రెండు దేశాలు నిత్యం బాంబులు వేసుకుంటూనే ఉన్నాయి.

# రెండోదశ మెట్రో పట్టాలెక్కాలంటే కెసిఆర్ రావాల్సిందే: కెటిఆర్

**శేరిలింగంపల్లి, జూన్23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోనికి రాగానే ఎయిర్‌పోర్ట్,మెట్రోరద్దుచేసి తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని మియాపూర్ నరెన్ గార్డెన్‌లో బీఆర్ఎస్‌పార్టీ ఆద్వర్యంలో ఎస్ఐఆర్‌పై ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ అనాలోచిత నిర్ణయాలతో పాలన పక్కదోవపడుతుందన్నారు. మెట్రో దగ్గర 280 ఎకరాల భూములున్నాయి, సుమారు 30వేల కోట్ల విలువచేసే భూములను ఆయన అన్నదమ్ములకో, బావమరుదులకో, అల్లుడికో కట్టబెట్టేందుకు వాటిపై కన్నేశాడన్నారు. మెట్రోను స్వాదీ నం చేసుకుని 14వేల కోట్ల భారం ప్రజలమీద రుద్ది ఆ భూములను అమ్ముకుని తనకు కావాల్సిన వాళ్లకు కట్టబెట్టే ప్రయత్నంలో రేవం త్‌రెడ్డి ఉన్నాడని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో భూములు ఎవరికి అమ్ముతాడో, ఎవరు కొంటారో, ఎట్లా అమ్ముతాడో చూస్తా మన్నారు. కేసీఆర్ ప్రభుత్వం బ్రహ్మాండంగా 72 కిలోమీటర్ల మేరకు మెట్రో నిర్మించిందని, మెట్రోకు మొత్తం టెండర్ ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు మధ్యలో రాజేంద్ర నగర్ దగ్గర 3 స్టాపులు పెట్టి పెరుగుతున్న పట్టణాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్య ఉండోద్దని 2023 జూన్,జులై ప్రాంతంలో టెండర్ పూర్తచేసి మొత్తం మెట్రో రెడీగా కొబ్బరికాయ కొట్టి మొదలుపెట్టి నామని, సీయం రేవంతరెడ్డి రాగానే తీసుకున్న తుగ్లక్ నిర్ణయం ఎయిర్‌పోర్ట్,మెట్రో రద్దుచేశారని కేటీఆర్ ఫైరయ్యారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి రెండున్నర ఏళ్ల గడుస్తున్నా ఇప్పుడు కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆయన ఎద్దేవ చేశారు. మళ్లీ మెట్రో పట్టాలు ఎక్కాలంటే కేసీఆర రావాల్సిందేనన్నారు. ఎస్ఐఆర్ ప్రోగ్రాంను ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త విజయవంతం చేయాలని, దొంగ ఓట్లను నిరోధించే ప్రక్రియలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భాగస్వామ్యం వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మాదవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు,శేరిలింగంపల్లి నియోజక వర్గ నాయకులు, డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులతో కెటిఆర్

# దేశసమైక్యత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు: మధుకర్‌జీ

**విజయవాడ, జూన్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సం ఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ ముఖ్య ప్రసంగం చేశారు. దేశ సమైక్యత, అఖండత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ "ఒకే దేశంలో ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు ఉండకూడదు" అనే నినాదంతో పోరాడిన మహనీయుడని కొనియాడారు. కాశ్మీర్‌లో సంపూర్ణ విలీనానికి ఆయన కలలు కన్నారని, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయ కత్వంలో ఆర్టికల్ 370 రద్దుతో ఆయన ఆశయాలు సాకారమ య్యాయని తెలిపారు. దేశభక్తి, సేవాభావం, జాతీయ సమైక్యత పట్ల అంకితభావంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్టీఆర్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, టిటిడి పాలకమండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్,మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాష్ట్ర అధికార ప్రతి నిధులు షేక్ బాజీ, యామిని శర్మ, రవిచంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, ఓబీసీ మోర్చా నాయకురాలు శివలలిత పాల్గొన్నారు.



శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రం పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎపి బిజెపి నేతలు

# ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్య

**బెంగళూరు, జూన్ 23:** నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ కుటుంబంలోని వ్యక్తే ఈ హత్యలు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ ఘటన కేఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీగేహళ్లి, ధమానిక్ లేఅవుట్‌లోని సాయి గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఆ అపార్ట్‌మెంట్‌లో సోమసుందర్ (55), అతని భార్య ముత్తులక్ష్మి (48), పెద్ద కుమార్తె శ్వేతతో పాటు చిన్న కుమార్తె సుప్రియ (20) నివసిస్తున్నారు. ఆ దంపతులతోపాటు చిన్ని కుమార్తె సుప్రియ దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. సోమసుందర్ దంపతుల పెద్ద కుమార్తె శ్వేతతోపాటు ఆమె ప్రియుడు కెన్నెత్ ఈ హత్యలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్నాళ్లుగా కెన్నెత్‌తో శ్వేత సహజీవనం చేస్తోంది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసింది. దీనిని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. శ్వేత భారీగా అప్పులు చేసింది. దాంతో శ్వేతపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారి మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవని పోలీసులు దర్యాప్తులో వెల్లడి అయింది. ఈ కారణాంగానే వారిని వీరిద్దరు హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్వేత, కెన్నెత్ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ముత్తులక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో కత్తితో ఆమెను హత్య చేశారు. అనంతరం నేలపై పడిన రక్తాన్ని వీరిద్దరు శుభ్రం చేశారు. ఆ తర్వాత తండ్రి సోమసుందర్‌తోపాటు సుప్రియ ఇంటికి వచ్చారు. వారిపై దాడి చేసి కత్తితో చంపేశారని పోలీసులు భావిస్తున్నారు. వారిని అరెస్ట్ చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని కేఆర్ పురం పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యలు పక్కా ప్లాన్ ప్రకారమే చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం శ్వేతతోపాటు కెన్నెత్ పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఈస్ట్ పాయింట్ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ చూపండి

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు తుమ్మల విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్23:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తం గానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

**దిగుమతి సుంకం పెంచి పామాయిల్ రైతులను ప్రోత్సహించాలి: తుమ్మల:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తరణకు కేంద్రం కృషిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిగుమతులపై సుంకం తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ రైతులకు నష్టం అని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడి యాతో మాట్లాడుతూ కొత్తగూడెం విమానాశ్ర యం విషయమై కేంద్రమంత్రి రామ్మోహన్ ను కలిశామని, 10 -15 రోజుల్లో ఫీజిబిలిటీని కమి టీని పంపి పరిశీలిస్తామని రామ్మోహన్ చెప్పారని తెలియజేశారు. దిగుమతి చేసుకుంటున్న ఎడిబుల్ ఆయిల్‌లో కొంత వెసులుబాటు ఇవ్వాలని, దిగుమతి సుంకం పెంచి పామాయిల్ రైతులను ప్రోత్సహించాలని తుమ్మల సూచించారు. రాబోయే 2-3 ఏళ్లలో 10 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు చర్యలు చేపట్టామని, ఆయిల్ దిగుమతుల భారాన్ని తగ్గిస్తామని చెప్పామని అన్నారు. గతంలోనే మాదిరిగా ఆయిల్ దిగుమతుల సుంకం 44 శాతం ఉంచాలని, రాష్ట్రానికి కేటాయించిన యూరియా, డిఎపి తెలంగాణకు రాలేదని అన్నారు. సేకరించిన జొన్న, మొక్కజొన్నలను కేంద్రం కొనుగోలు చేయాలని తుమ్మల నాగేశ్వరరావు కోరారు.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్

# రెండుచోట్ల ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే నోటీసులు

## ఒకే వ్యక్తికి వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే ఎస్ఐఆర్ ముగిశాక చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్23:** ఈనెల 25 నుంచి తెలంగాణలో సర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కాగా, ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)లో వేర్వేరు రాష్ట్రాల్లో 2 ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే భవిష్యత్తులో ఆ ఓటర్లకు ఇబ్బందులు తప్పవని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 31 ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని వెల్లడిస్తోంది. తెలంగాణలో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాదికి చెందిన ప్రజలు ఉద్యోగం, వ్యాపార నిమిత్తం వచ్చి ఇక్కడే స్థిరపడ్డప్పటికీ, సొంత ప్రాంతాలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎంతో మందికి సొంత ప్రాంతాల్లో కూడా ఓటు హక్కు ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియ దశలవారీగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ముగిసిన రాష్ట్రాల్లోని వారు ఎన్యూమరేషన్ పత్రాలు అందించి అక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభమవుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో సర్వే 30వ తేదీ నుంచి మొదలవుతుంది. అయితే వేరే రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పూర్తి చేసినవారు తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణలో పూర్తి చేసినవారు వేరే రాష్ట్రాల్లో ఎట్టిపరిస్థితుల్లో రెండోసారి నమోదు చేసుకోవద్దని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. తెలంగాణలో ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ ద్వారా అధికారులు గుర్తిస్తున్నారు. కానీ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ప్రస్తుతానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ లేదు. దీంతో ఈసీఐ వేరువేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ఏఐ సాంకేతికతతో కేంద్రీకృత వ్యవస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది. సర్వే ప్రక్రియ పూర్తైన తర్వాత కేంద్రం తీసుకొచ్చే ఈ సాంకేతికతతో 2 ఓట్లు ఉన్నవారిని గుర్తించి, ఈఆర్వోలు విచారణ చేశాక చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఓటర్లుగా నమోదైన ఎంతో మంది 2 రాష్ట్రాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీటిని కొనసాగించడానికి, తమ ఆస్తుల రక్షణకు తెలుగు రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను నింపాలని ఆలోచిస్తున్నారు.

# పొట్ట చుట్టూ కొవ్వు తగ్గాలంటే..



వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పుల నేపథ్యంలో బరువుతో పాటు పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడం మాత్రమే కాదు..కొన్ని పదార్థాలను రోజూ తీసుకోవాలి. వాటిలోని పోషకాలు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా చూస్తాయి.

**ఓట్స్ :** ఉదయం పూట నూనెతో చేసిన అల్పాహారాలకు బదులుగా ఓట్స్‌కి ప్రాధాన్య ఇవ్వాలి. తద్వారా జీవక్రియలరేటు వృద్ధి అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తక్షణ శక్తి అంది ఎకునకవ సమయం ఆకలి వేయదు. దీనిలోని పీచు కూడా జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఓట్స్ తీసుకునేటప్పుడు అందులో చక్కెరకు బదులుగా ఏవైనా





తాజా పండ్ల ముక్కలు, రసాలు కలిపితే సహజ చక్కెరలు అందుతాయి. పొట్ట వస్తుందనే భయం కూడా ఉండదు.

**పండ్లు :** ఆకలిగా అనిపించినప్పుడు ఏ మిఠాయిలో, ఇతర చిరుతిళ్లో తినే బదులు పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటివల్ల చక్కెర, కొవ్వు శరీరంలో చేరతాయన్న బాధ ఉండదు. పోషకాలూ ఎక్కువగా అందుతాయి. బరువూ తగ్గుతారు.

**బాదం ..** మోనోశ్యాచురేటెడ్ ఫ్యాట్స్ శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. వీటివల్ల శరీరంలో నీరు ఊడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతో పాటు ఇతర ఓట్స్ కూడా తినాలి.

**గుడ్లు :** మాంసకృతులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖనయంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి 12, డి విటమిన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలకపాత్ర పోసిస్తాయి.దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది. □

# కేన్సర్ కుదేసినా.. కొత్త ఉత్సాహం



ఎవరికైనా కేన్సర్ సోకితే ఇక అవే అంతిమ ఘడియలు అనుకునే రోజుల్నించి 'కేన్సర్ నయ'మౌతుంది. అనే రోజులకు చేరుకున్నాము. రాచపుండు బ్రహ్మరాక్షసి అనే అభిప్రాయం ఏనాడో మన మస్కిష్కం నుండి మాయమైంది. కేన్సర్ నుంచి కోలుకున్న ఎందరిలోనో కొత్త ఉత్సాహం నింపిన సందర్భాలు ఉన్నాయి. ఎంతో మంది కేన్సర్ రోగులు ముఖ్యంగా మహిళలు కేన్సర్ సోకినా సుదీర్ఘ కాలం జీవిస్తున్న కథలెన్నో మనకి తారసపడుతుంటాయి. సర్జరీలు, ఖీమోథెరపీలు మనల్నేం చేయవు అనుకుంటేనే మరెంత కాలం జీవించగలం అనే



నమ్మకంతో జీవించే స్తున్నారు. రోగుల్లో ఉదయించే 'స్వస్థ' భావన వారిని చాలా కాలం ప్రాణం పోస్తుంది. నఫీసా ఆల్లి (69) ప్రఖ్యాత నటి. హిందీ చిత్రసీమ లోనే కాకుండా ఇతర భారతీయ భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. 1972 నుంచి 1974 వరకు జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ మిస్ ఇంటర్నేషనల్ పోటీలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. రెండో రన్నర్‌అప్‌గా నిలిచింది. 2018 నవంబరులో స్టేజి 3 పెరిటోనియల్ అండాశయ కేన్సర్ ఆమెను వేధించింది అయినా ఆమె నిరుత్సాహం పొందలేదు. ఆమె బహుళరంగాల్లో రాణించిన సామాజి సామాజిక కార్యకర్తగానూ చురుకుగా ఉండేవారు. 2022లో 'ఉంఛాయి' చిత్రం ఆమె ఆఖరి చిత్రం. అర్జున అవార్డు గెలుచుకున్న సోలో క్రీడాకారుడు కల్నల్ రవీందర్ సింగ్ సోధి భార్య. వివాహానంతర దశలన్నీ దాటి తన ముగ్గురు పిల్లల సేవలో నిమగ్నమైంది. 18 ఏళ్ల విరామం అనంతరం మళ్లీ నటనా వృత్తిలో ప్రవేశించింది. ఎయిడ్స్ అవగాహనా సదస్సుకు ప్రత్యేక యాంకర్‌గా పనిచేసింది. 2005 సెప్టెంబరులో చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో చురుకైన నేతగా పనిచేసింది. ఏనాడూ ఏ కార్యక్రమంలో పాల్గొనకుండా ఇంట్లోనే కూర్చుండి పోవాలని, ఖాళీగా ఉండాలని అనుకోలేదు. ఉద్యమ అంశాలు చేపట్టినపు డల్లా ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. 2004లో దక్షిణ కల్‌కతా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు తృణమూల్ కాంగ్రెస్ తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. హాలీవుడ్ నటి, మాజీ అందాల సుందరి, ఉద్యమ కారిణి, సామాజిక కార్యకర్త 69 ఏళ్ల నఫీసా ఆలీ కేన్సర్ నయమయ్యాక కొత్త ఉత్సాహాన్ని కూడగట్టుకుని మరికొందరు కేన్సర్ రోగులకు మార్గదర్శకంగా ఉంటు న్నారు. ఇంటిల్లి పాదీ తనతో గడిపిన ఎంతో ఉత్సాహాన్ని కల్గించే అనుభావాలను పంచుకుంటున్నారు. ఇటీవల 11 వేల అడుగుల ఎత్తులో నఫీసా ట్రెక్కింగ్ చేసిన అనుభవాలను వివరిస్తూ తనకెంతో ఉత్సాహం కలిగించిన పర్వతారోహణను మరింతగానో మెచ్చుకు న్నారు. కేన్సర్ శస్త్ర చికిత్స, అనేక సార్లు కీమోథెరపీ సెషన్ల తర్వాత తాను కొత్త అనుభవంతో కూడిన నూతనోత్సాహం తన మదిలో మెది లిందని అన్నారు. మొన్న ఏప్రిల్ నెలలో తన పొట్టపై శస్త్రచికిత్స తాలూకు మచ్చను చూపే ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. తాజాగా తన కుటుంబ సభ్యులతో టెక్కింగ్, పిక్నిక్ అనుభవాలతో కూడిన ఫొటోలను విడిచిూఎట్టారు. తాజాగా రోహ్తంగ్ పాస్ సమీపంలో 11 వేల అడుగుల ఎత్తులో ట్రెక్కింగ్ చేస్తేన్న అనేక వీడియాలను, ఫొటోలను పంచుకు న్నారు. తీరని వ్యధలున్నా, జీవితాన్ని భయపెట్టి అధఃపాతాళానికి పడి పోయినట్లుగా చేసే కేన్సర్ వంటి భయంకర రుగ్మత నుండి కోలు కొన్నాక కృంగిపోకుండా, కుదేలయి పోకుండా తాను కొత్త ఉత్సాహన్ని పొందుతూ ఇతరుల్లో నూతనోత్సాహాన్ని అందివ్వగలుగుతున్న అందాల తార నఫీసాను స్ఫూర్తిగా తీసుకునే వారికెవరికైనా కేన్సర్ కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది.

# గణేశుడు

విఘ్నాలను తొలగించి కార్యసిద్ధిని ప్రసాదించే దేవుడు.గణేశుడు మహిశ్రీ గణేశుని రూపం ఎంతో ప్రత్యేకమైనది. ఏనుగు తల, పెద్ద చెవులు, చిన్న కళ్ళు, పెద్ద పొట్టతో ఆయన దర్శనమిస్తారు. ఈ రూపంలోని ప్రతి అంశం ఒక గొప్ప సందేశాన్ని తెలియజేస్తుంది. పెద్ద చెవులు ఎక్కువగా వినాలని, చిన్న కళ్ళు ఏకాగ్రతతో చూడాలని, పెద్ద పొట్ట సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని సూచిస్తాయి.జ్ఞానానికి ప్రతీగణపతి జ్ఞానానికి, వివేకానికి ప్రతీక. విద్యార్థులు విద్యాభివృద్ధి కోసం, కళాకారులు తమ కళల్లో విజయాల కోసం, ఉద్యోగులు మరియు వ్యాపారులు తమ కార్యాలలో పురోగతి కోసం గణేశుని ఆశీర్వాదాలను కోరుతారు. ఆయన అనుగ్రహం ఉంటే విజయం సులభంగా లభిస్తుం దని భక్తుల విశ్వాసం.గణేశుని అవతార పురాణాల ప్రకారం, పార్వతీదేవి తన శరీరానికి పూసుకున్న పసుపుతో ఒక బాలుడిని సృష్టించి ద్వారపాలకునిగా నియ మించింది. ఆ బాలుడే గణేశుడు. ఒకసారి పరమశివుడు లోపలికి వెళ్లడానికి ప్రయత్నిం చగా గణేశుడు అడ్డుకున్నాడు. కోపంతో శివుడు అతని తలను ఖండించాడు. తరువాత పార్వతీదేవి దుఃఖాన్ని చూసి, శివుడు ఏనుగు తలను అమర్చి గణేశునికి ప్రాణం పోశాడు. అప్పటి నుంచి గణేశుడు దేవతలందరిలో అగ్రపూజను పొందే దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. వినాయక చవితివినాయక చవితి గణేశునికి అంకితమైన పవిత్ర పండుగ. ఈ రోజున భక్తులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉండ్రాళ్లు, మోదకాలు వంటి నైవేద్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు. ఈ పండుగ భక్తి, ఐక్యత ఆనందానికి ప్రతీకగా నిలుస్తుంది. శ్రీ గణేశుడు మనకు జ్ఞానం, వినయం, సహనం మరియు ధైర్యం అనే విలువలను బోధిస్తాడు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను విశ్వాసంతో, పట్టు దలతో అధిగమించాలని ఆయన సందేశం. విఘ్నాలను తొలగించి విజయాన్ని ప్రసాదించే దైవంశ్రీ గణేశుడు. ఆయనను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే జ్ఞానం, ఐశ్వర్యం, శాంతి మరియు సుఖసంతోషాలు లభిస్తాయని విశ్వాసం. □

# క్రిస్పీ పనీర్ ఫింగర్స్



**కావలసినవి :** పనీర్-200 గ్రాములు, మైదాపిండి-రెండు టేబుల్ స్పూన్లు, మొక్కజొన్న పిండి-టేబుల్ స్పూన్ ఉప్పు-తగినంత, పసుపు-చిటికెడు, కారం, మిరియాల పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి ముద్ద-అర చెంచా చొప్పున, మిక్స్‌డ్ హెర్బ్స్-పావుచెంచా, బ్రెడ్ పొడి-పావు కప్పు, నూనె-వేయించడానికి సరిపడా.

**తయారీ :** పనీర్‌ను పొడుగ్గా ముక్కలు కోసుకోవాలి. వాటి మీద కారం, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, మిక్స్‌డ్ హెర్బ్స్ వేసి.. ముక్కలు తునగకుండా కలియ తిప్పా.లి ఇలా పొడులన్నీ పట్టించిన తర్వాత ఒక పావు గంట పక్కనుంచాలి. మరో పాత్రలో మైదాపిండి, మొక్కజొన్న పిండి, తగినంత ఉప్పు, మిరియాల పొడి వేసి, కొన్ని నీళ్లతో ఉండలు కట్టకుండా చిక్కగా కలపాలి. మసాలా పట్టించిన పనీర్ ముక్కలను మొదట ఈ మిశ్రమంలో, తర్వాత బ్రెడ్ పొడిలో ముంచి తీసి, కాగుతున్న నూనెలో వేయించాలి. అంతేబంగారురంగులో కరకరలాడే పనీర్ ఫింగర్స్ సిద్ధం. □

# పాలు తాగుతుంటే తేన్పులా..



పిల్లలు మొదటి ఆరు నెలలు తల్లి పాల మీదే ఆధార పడతారు. కొన్ని సందర్భాల్లో తల్లికి పాలు ఎక్కువగా ఉత్పత్తవుతాయి. ఇలాంటప్పుడు పిల్లలు కూడా గబాగబా పాలు తాగుతుంటారు. కొన్ని సందర్భాల్లో తల్లి ఆహారంలో లోపం ఉన్నట్లయితే పాలు తక్కువగా వస్తుంటాయి. ఇలాంటప్పుడు పాలు సరిపోకనఖాళీ రొమ్మునే సక్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఎక్కువ గాలి పొట్టలోకి చేరుతుంది. మరికొన్ని సందర్భాల్లో పాపాయిని బుజ్జగించడానికి తేనె పీకను ఉపయోగిస్తుంటారు. ఈ పీక పెట్టినప్పుడు కూడా గాలిని మింగుతుంటారు. పాపల విషయంలో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయోమే పరిశీలించుకోవాలి. ఇలా పొట్టలో గ్యాస్ ఎక్కువైనప్పుడు తేన్పుల ద్వారా గాలి బయటకు వెళుతుంది. దీనివల్ల బేబీకి కాస్త ఉపశమనం కలుగుతుంది. అయితే ఇలాంటి సమస్య ఉన్నప్పుడు పాపలను ఒక పక్కకు తిప్పి పడుకోబెట్టడం లేదా భుజం మీద వేసుకొని బర్పింగ్ చేయడం.. వంటి పద్ధతులు పాటించాలి. ఫలితంగా గాలి బయటికి వెళ్లిపోతుంది. అప్పటి సమస్య తగ్గుముఖం పట్టకపోతే తల్లి తీసుకునే ఆహారంలో మార్పులు చేసు కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్పైసీ ఫుడ్‌కి దూరంగా ఉండడం. బాగా ఉడికించిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వంటివి చేయాలి. □

# 'ఇరుముడి' స్పెషల్ పోస్టర్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనా లు నెలకొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగా లు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కు తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ, తన కూతురు నుదుటిపై ప్రేమగా ముద్దుపెడుతూ కనిపించడం ఆకట్టుకుంటోంది. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించ నున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయన నటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తు న్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, ప్రవీణ్ పూడి ఎడిటర్ శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్ గావ్యవహరిస్తున్నారు. వరలక్ష్మీ ౖ వ్రతం శుభ సందర్భంగా ఇరుముడి ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది

# 'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్

'వసుదేవసుతం'.. ట్రైలర్ లాంచ్ రెయిన్‌బో సినిమాస్ బ్యానర్ మీద ధనలక్ష్మి ౖ బాదర్ల నిర్మాణంలో వైకుంఠ్ బోను తెరకెక్కించిన చిత్రం 'వసుదేవసుతం'. ఈ సినిమాలో మాస్టర్ మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించారు. ఇప్పటి వరకు మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకు న్నాయి. ఈ సినిమాని జూలై 10న రిలీజ్ చేయబోతోన్నారు.



ఒరిస్సాలోని వాసుదేవుని ఆలయం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆలయంలోని బ్రహ్మ పదార్థం కోసం శత్రు మూకలు చేసే విన్యాసాన్ని అడ్డుకునే పాత్రలో హీరో మహేంద్రన్ అదరగొట్టేశారు. ట్రైలర్ ఒక్కసారిగా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. మాస్టర్ మహేంద్రన్ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం' కోసం నిర్మాతలు చాలా కష్టపడ్డారు. కథను నమ్మి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెట్టారు. దర్శకుడు ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని ఈ మూవీని పూర్తి చేశారు. దర్శకుడు వైకుంఠ్ బోను మాట్లాడుతూ.. .. నిర్మాతకి ముందు ఓ రెండు కథలు చెప్పాను. అవి బాగానే ఉన్నాయని అన్నారు. మళ్లీ ఒరిస్సాలోని ఫేమస్ టెంపుల్ బ్యాక్ డ్రాప్‌లో ఓ కథను రాసుకున్నాను.నిర్మాత త్రినాథ్ కేశవ మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'. మాకు తొలి చిత్రం. మా సినిమాలో అందరూ అద్భుతంగా నటించారు. మాకు సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా మూవీ జూలై 10న రాబోతోంది. అంబికా వాణి మాట్లాడుతూ.. 'వసుదేవసుతం'.సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది. నాకు తెలుగు సరిగ్గా రాలేదు. నేను నేర్చుకుంటాను. నాకు ఇందులో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. అజయ్ సాయి మాస్టర్ మాట్లాడుతూ.. ..'వసుదేవసుతం'. సినిమాలో రెండు పాటల్ని కొరియోగ్రఫీ చేశాను. చాలా గ్యాప్ తరువాత మళ్లీ మణిశర్మ గారి పాటకు పని చేశాను. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. మాస్టర్ మహేంద్రన్ ఇందులో అద్భుతంగా నటించాడు.

# తెర

## చివరి శ్వాస వరకు పని చేస్తూనే పోవాలి : అల్లాణి శ్రీధర్



అల్లాణి శ్రీధర్ తెలుగు సినిమా రచయిత, నిర్మాత, దర్శకుడు. 1988లో కొమరంభీమ్ చిత్రంతో దర్శకత్వ అరంగేట్రం చేశారు. ఉత్తమ జాతీయ సమైక్యత చిత్రంగా, ఉత్తమ దర్శకుడుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 1990లో నంది అవార్డు అందుకున్నారు ఈయన.ఆయన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గద్దర్ అవార్డ్స్ విది విధానాల కమిటీలో సభ్యునిగా పని చేశాడు. జూన్ 24.6. 2026 అల్లాణి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆయనకు ఫిలించాంబర్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీనియర్ జర్నలిస్ట్ ధీరజ్ అప్పాజీ వ్యాఖ్యతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బాలిరెడ్డి మాట్లాడుతూ... గోస్వామి తులసిదాస్ సినిమా అన్నది మనం మర్చిపోలేని సినిమా అని గుర్తు చేయడం జరిగింది. శ్రీధర్‌గారితో నాకు చాలా ఏళ్ళ అనుబంధం ఉంది. ఆయన మరిన్ని చిత్రాలు తీసి సక్సెస్ సాధించాలని కోరుకుంటు న్నాను అన్నారు. సీనియార్ జర్నలిస్ట్ లక్ష ్మణరావు మాట్లాడుతూ... శ్రీధర్‌గారితో అనుబంధం కొంత గ్యాప్ వచ్చినప్పటికీ.. ఆ రోజుల్లో ఆయన చేసిన సినిమాలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయి. శ్రీమతి జమునారాణి సీనియర్ జర్నలిస్ట్ మాట్లాడుతూ...ఈ వేదికపైన రెండు విషయాలు చెప్పుకోవాలంటే సంతోషంగా ఉంది. ఫిలిం క్రిటిక్స్ అధ్యక్షులు బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ..ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ చిరు సత్కారం చేయాలని అనుకుంటు న్నాము. అల్లాని శ్రీధర్ గురించి చెప్పాలంటే నా గరించి నేను చెప్పుకున్నట్లు ఉంటుంది. ఫిలిం క్రిటిక్స్ జనరల్ సెక్రటరీ సురేష్‌కొండేటి మాటా డుతూ... వార్తలో ఉన్నప్పుడు నేను 90లలో నేను శ్రీధర్‌గారిని ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అంతేకాక ఆతరువాత సంతోషం సినీ వారపత్రికకు కూడా ఆయనను నేను పర్సనల్‌గా ఇంటర్వ్యూ చేశాను. అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ... నేను జన్మదినం అనేది గొప్పగా అనుకోవడం లేదు. ఈ రోజు ఈ వేదికపైన ఇంత మంది మిత్రలును కలుసుకోవడం నా జన్మ దినం కాదుగాని పునర్మనదినంగా అనుకుంటున్నాను అన్నారు.

## 'గాసిప్' 26న విడుదల



మోస్ట్ టాలెంటెడ్, ఎనర్జిటిక్ రాశి సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నా వైభవ్ సినీ స్కల్ప్ స్టూడియోస్ బ్యానర్‌పై యతి నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం “గాసిప్“. నేటి తరానికి కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, అందమైన ప్రేమ కథతో మేళవిస్తూ సోషల్ సెటైర్‌గా డైరెక్టర్ వైభవ్ కౌండిన్య ద్వారా ఈ చిత్రం తెరకెక్కుతోంది. శక్తికాంత్ కార్తీక్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి సతీష్ సినిమాటోగ్రఫీ చేయగా జై కుమార్ ఎడిటింగ్ చేశారు. ఈ సంద ర్భంగా నటుడు మహేష్ యడ్లపల్లి మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సాయికిరణ్ అడికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రస్తుత సమాజంలో చూస్తున్న కొన్ని సంఘటనలకు దగ్గరగా ఉన్న ఒక విషయాన్ని సినిమాగా చేశాము. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుంది. నటుడు గురు చరణ్ మాట్లాడుతూ... “గాసిప్ చిత్రం కోసం నాకు వైభవ్ కాంటాక్ట్ చేశారు. నా క్యారెక్టర్ గురించి చెప్పిన తర్వాత ఆయన చేసిన ఆడిషన్ నాకు ఛాలెంజ్‌గా అనిపించింది. నిర్మాత యతి మాట్లాడుతూ... “ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ థాంక్స్. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున థాంక్స్. అతిథిగా హాజరైన దర్శకుడు సాయి కిరణ్ అడివి మాట్లాడుతూ... “వైభవ్ నాకు ఎంతోకాలం నుండి పరిచయం ఉన్న వ్యక్తి, చాలా క్లారిటీ ఉన్న వ్యక్తి. చిత్ర దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ... నా తొలి చిత్రం “గాసిప్“కు మీరు చూపిస్తున్న ఆదరణకు ధన్యవాదాలు. ఈ సినిమాకు నేను రచయితగా, దర్శకుడిగా పని చేశాను. మన జీవితాల్లో గాసిప్ అనేది సాధారణ విషయమే. కానీ మనం సరదాగా మాట్లాడే మాటలు కొన్నిసార్లు ఇతరుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.... ముందుగా మా సినిమా ట్రైలర్, పాట విడుదల చేసి మాకు మద్దతుగా నిలిచిన సాయి కిరణ్, వంశీ, పృథ్వీరాజ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

# NBK112 అమరావతిలో 25న లాంచ్



NBK112 అమరావతిలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంచలన దర్శకుడు కొరటాల శివ తొలిసారిగా NBK112 చిత్రం కోసం జతకడుతున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అభిమానులు, సినీ వర్గాల్లో భారీ అంచనాలు పెంచింది. Power Meets Purpose, Mass Becomes A Movement అనే పవర్ ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన అనౌన్స్‌మెంట్ పోస్టర్, ఈ చిత్రం ఎంత భారీ స్థాయిలో ఉండబోతుందో సూచించింది. ఇద్దరు విజయవంతమైన నిర్మాతలు SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి, యువసుధ ఆర్ట్స్ సుధాకర్ మిక్కిలినేని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ, అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో ఉన్న గిగిదీ ఆలయంలో జూన్ 25న గ్రాండ్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజ6రుకానుండటంతో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనుంది. బాలకృష్ణ భారీ స్థాయి స్క్రీన్ ఇమేజ్‌కు సరిపోయేలా కొరటాల శివ ఒక పవర్ ఫుల్ కథని సిద్ధం చేశారు. మాస్ సినిమాలు చేయడంలో ప్రసిద్ధి చెందిన ఇద్దరు దిగ్గజాలు తొలిసారిగా కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా పెరిగాయి.ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# 'రాజా ది రాజా' జూలై 17న రిలీజ్



యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరో, హీరోయిన్‌ల మధ్య కెమిస్ట్రీతో పాటు వారి సరదా ప్రయాణాన్ని హైలైట్ చేశారు. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డిజైన్ చిత్రంలోని రొమాంటిక్ మూడ్‌ను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రానికి మార్క్ కె రాబిన్ సంగీతం అంది స్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వంటి ప్రముఖ పంపిణీ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ట్రేడ్ వర్గాల్లో సినిమాపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది. రాజా ది రాజా యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే రిఫ్రెషింగ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులని అలరించనుంది.

# మెస్సీ వెనుకే ఎంబాపె

## నాకౌట్‌కు ఫ్రాన్స్, నార్వే అర్హత * జోర్డాన్‌కు షాకిచ్చిన అల్జీరియా


రెండు గోల్స్‌తో ఫ్రాన్స్‌కు విజయాన్నందించిన ఎంబాపె


అల్జీరియాకు గోల్ చేస్తున్న నాథిర్ బెన్‌బొలి


గెలుపు సంబరాల్లో నార్వే ఆటగాళ్లు

**ఫెన్సిల్వేనియా(అమెరికా), జూన్ 23**
సాకర్ ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ దూసుకుపోతోంది. వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. గ్రూప్-ఐలో భాగంగా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 3-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. వందో మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాపె డబుల్ గోల్స్‌తో మెరవగా, ఓస్మన్ డెంబ్లె మరోగోల్ చేశాడు. ఈవిజయంతో గ్రూప్-ఐ నుంచి నాకౌట్‌కు ఫ్రాన్స్ అర్హత సాధించింది. వర్షంఅడ్డంకితో రెండు గంటల ఆలస్యంగా మొదలైన ఈమ్యాచ్‌లో ఎంబాపె అద్భుత ఆటతీరుతో గోల్స్ వర్షం కురిపించాడు. ఆట 14వ నిమిషంలో కార్నర్ నుంచి బంతిని గోల్ పోస్టులోకి తరలించిన ఎంబాపె సాకర్ వరల్డ్ కప్‌లో 15 వ గోల్ సాధించాడు.

ఈ గోల్ ఆధిక్యంతోనే ఫ్రాన్స్ తొలి అర్ధభాగం ముగించింది. రెండో అర్ధభాగంలోనూ ఫ్రాన్స్ దూకుడుకు ఎదురులేకపోయింది. పలుసార్లు ఇరాక్ డిఫెండర్లను చమ్కాఇస్తూ గోల్స్ చేసినంత పనిచేసింది. ఇక 54వ నిమిషంలో మరోసారి మెరిసిన ఎంబాపె రెండో గోల్ సాధించడంతో పాటు ఫ్రాన్స్‌ను 2-0తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మరో పది నిమిషాలకు బాలన్ డీ ఓర్ అవార్డు విజేత ఓస్మన్ డెంబ్లె గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతాలో మూడో గోల్ చేరింది. మరోవైపు 1986 తర్వాత రెండో ఫిఫా ప్రపంచకప్ ఆడుతున్న ఇరాక్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

### సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

ఎంబాపెకు ఇది వందో అంతర్జాతీయ మ్యాచ్. సెంచరీ క్లబ్‌లో చేరిన ఎంబాపె... రెండు గోల్స్‌తో ఫిఫా కప్‌లో గోల్స్ సంఖ్యను 16కు పెంచుకున్నాడు. ఫిఫా చరిత్రలో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో ఎంబాపె.. జర్మనీ దిగ్గజం మిరాస్లావ్ క్లోస్ (16 గోల్స్) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. అంతక ముందు 15వ గోల్ కొట్టి బ్రెజిల్ దిగ్గజం రొనాల్డో రికార్డును సమం చేశాడు. ఇక ఫిఫా ప్రపంచకప్‌లో ఈసారి మెస్సీ, ఎంబాపె మధ్య నంబర్ గేమ్ నడుస్తోంది. వస్తా నీ వెనుక అన్నట్లుగా మెస్సీకి పోటీగా ఎంబాపె వరుస గోల్స్‌తో రెచ్చిపోతున్నాడు. రాబోయే మ్యాచ్‌లో మిరాస్లావ్ క్లోస్ రికార్డును బద్దలు కొట్టనున్న ఎంబాపె ఆ తర్వాత మెస్సీని దాటినా ఆశ్చర్యం లేదు.

### సెనెగల్‌పై నార్వే విజయం


ఫిఫా ప్రపంచకప్‌లో నార్వే నాకౌట్‌కు అర్హత సాధించింది. గ్రూప్-ఐలో భాగంగా సెనెగల్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో నార్వే 3-2తో విజయాన్ని అందుకుంది. నార్వే తరఫున స్టార్ ఆటగాడు ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్ సాధించి కీలకపాత్ర పోషించాడు. మరో గోల్ మార్కస్ పెడెర్సన్ సాధించి పెట్టాడు. తొలి అర్ధభాగం 43వనిమిషంలో మార్కస్ పెడెర్సన్...నార్వేకు తొలి గోల్ అందించాడు. ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన మూడో నిమిషంలోనే ఎర్లింగ్ హాలండ్ అద్భుత గోల్ కొట్టాడు. మరో పది నిమిషాల తర్వాత రెండో గోల్ చేశాడు. అటు సెనెగల్ తరఫున ఇస్మాయిల్ 53వ నిమిషంలో, ఇంజ్యూరీ టైమ్(90+3వ నిమిషం)లో రెండు గోల్స్ కొట్టాడు. ఈ విజయంతో నార్వే నాకౌట్ దశకు చేరుకోగా సెనెగల్ ఆడిన రెండింటిలో ఓడి ఇంటిబాట పట్టింది. ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలవడం నార్వేకు ఇదే తొలి సారి. ఇక ఎర్లింగ్ హాలండ్ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో గోల్స్ సంఖ్య 59కు చేరింది. లీగ్ దశలో నార్వే తన చివరి మ్యాచ్‌ను ఫ్రాన్స్‌తో ఆడనుంది.

### జోర్డాన్‌పై అల్జీరియా సంచలనం

గ్రూప్-జెలో సంచలనం నమోదైంది. జోర్డాన్‌పై 2-1 గోల్స్ తేడాతో అల్జీరియా సంచలన విజయం సాధించింది. ఫిఫా ప్రపంచకప్‌లో గెలుపు బోణీ చేయాలన్న జోర్డాన్ ఆశలపై నీళ్లు చల్లింది. తొలి అర్ధభాగంలో జోర్డాన్ ఆధిక్యం చాటగా, రెండో అర్ధభాగంలో అల్జీరియా ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం 36వ నిమిషంలో నిజర్ అల్‌రష్దన్ గోల్‌తో జోర్డాన్ 1-0 ఆధిక్యం కనబరిచింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన 25 నిమిషాల వరకు ఆధిక్యాన్ని కాపాడుకుని గెలుపుపై ధీమాతో నిలిచింది. 69వ నిమిషంలో నాథిర్ బెన్‌బొలి గోల్ చేసి అల్జీరియాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఇక మరో పది నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుండగా అమినె గుయిరి గోల్ చేసి అల్జీరియాకు విజయం సాధించిపెట్టాడు. జోర్డాన్ ఆడిన రెండింటిలోనూ ఓటములతో ఫిఫా ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది. అర్జెంటీనా రెండు విజయాలతో గ్రూప్-జె నుంచి ఇప్పటికే నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోగా, రెండో బెర్తు కోసం ఆస్ట్రియా-అల్జీరియా మధ్య పోటీ నెలకొంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు నాకౌట్‌లో ప్రవేశిస్తుంది.

# ఒకే ఒక్కడు

ఆట



**డాలస్, జూన్ 23 :** సాకర్ అభిమానులను లియోనెల్ మెస్సి మానియా ఊపేస్తోంది. అంచనాలకు అనుగుణంగా ఈ ఫిఫా వరల్డ్‌కప్‌లో అర్జెంటీనా స్టార్ గోల్స్ వర్షం కురిపిస్తున్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనే ఏకంగా అయిదు గోల్స్ కొట్టిన మెస్సి... ఫుట్‌బాల్ చరిత్రలో అరుదైన ఘనత అందుకున్నాడు. ఆస్ట్రియాతో మ్యాచ్‌లో మరో రెండు గోల్స్ చేసిన మెస్సి.. సాకర్ ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. మొత్తం 18 గోల్స్‌తో జర్మనీ దిగ్గజం మిరోస్లావ్ క్లోజ్(16 గోల్స్)ను అధిగమించాడు. తొలి మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అర్జెంటీనాకు అద్భుత విజయం అందించిన మెస్సి... రెండో మ్యాచ్‌లోనూ చెలరేగాడు. 38వ నిమిషంలో ఓ గోల్, అదనపు సమయం (90+5 నిమిషం)లో మరో గోల్ సాధించాడు. ఇప్పటివరకు అర్జెంటీనా అయిదు గోల్స్ చేస్తే అవన్నీ మెస్సి అందించినవే కావడం విశేషం. 18 గోల్స్‌తో మెస్సి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. నిజానికి మెస్సి ఖాతాలో మరో గోల్ చేరాల్సింది. 9వ నిమిషంలో లభించిన పెనాల్టీని లియోనెల్ మెస్సి వృథా చేశాడు. లేదంటే గోల్స్ సంఖ్య 19కు, ఈ ఫిఫా ప్రపంచ కప్‌లో రెండో హ్యాట్రిక్ నమోదయ్యేది.

2006 జర్మనీలో జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో తొలి సారి ఆడిన లియోనెల్ మెస్సికిది ఇది ఆరో సాకర్ వరల్డ్‌కప్. సెర్బియాపై తొలి గోల్ సాధించిన మెస్సి అప్పటినుంచి గోల్స్ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు. 2010 సౌతాఫ్రికాలో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్‌లో గోల్స్ ఖాతా తెరవలేదు. ఇక 2014 ఫిఫా కప్‌లో నాలుగు గోల్స్, 2018లో ఒక గోల్, ఖతర్‌లో జరిగిన 2022 ఫిఫా కప్‌లో ఏకంగా ఏడు గోల్స్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటికే అయిదు గోల్స్ నమోదుచేశాడు. వరుసగా రెండో ఫిఫా కప్ అందించే జోరులో కొనసాగుతున్నాడు. ఒక ఫిఫా ప్రపంచకప్‌లో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా జస్ట్ ఫొంటైన్(ఫ్రాన్స్, 13 గోల్స్) పేరిట రికార్డు ఉంది.



# పద్మశ్రీ రోహిత్, పద్మభూషణ్ విజయ్ అమృత్‌రాజ్

**న్యూఢిల్లీ, జూన్ 23:** ఇండియన్ టెన్నిస్ లెజెండరీ విజయ్ అమృత్‌రాజ్ పద్మభూషణ్, క్రికెటర్ రోహిత్ శర్మ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను ప్రదానం చేశారు. టీమిండియా ఉమెన్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ గత నెలలో అవార్డు అందుకోగా, తాజాగా రోహిత్ పద్మశ్రీ స్వీకరించాడు. టీమిండియాకు అందించిన సేవలకు గుర్తింపుగా రోహిత్ శర్మకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారం ప్రకటించింది. రోహిత్ కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో పాటు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుంది. పద్మశ్రీ అందుకున్న భారత క్రికెట్ ప్రముఖుల జాబితాలో ఇప్పుడు రోహిత్ శర్మ కూడా చేరాడు. కాగా భారత టెన్నిస్‌కు గుర్తింపు తెచ్చిన విజయ్ అమృత్‌రాజ్... పలు విజయాలు అందించాడు. 1974, 1987లో డేవిస్ కప్‌లో భారత్‌ను రన్నరప్‌గా నిలపడంతో కీలక పాత్ర పోషించాడు. కెరీర్‌లో 16 సింగిల్స్, 13 డబుల్స్ టైటిల్స్ గెలుపొందాడు.

# పాక్‌ను చిత్తుచేసిన భారత్ హాకీ వీరులు

**లండన్, జూన్ 23:** ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ హాకీలో టోర్నీలో భారత్ విజయపరంపర కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 4-3 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఓ దశలో వెనకబడ్డా పుంజుకున్న హర్మన్‌ప్రీత్ సేన... అద్భుత ప్రదర్శన చేసింది. భారత్‌కు అభిషేక్, నీలకాంత శర్మ, సుఖ్‌జీత్ సింగ్, రాజిందర్ సింగ్ చేసిన గోల్స్ అందించారు. పాకిస్థాన్ తరఫున అహ్మాద్ నదీమ్, అబు మహమూద్, మొయిన్ షకీల్ గోల్స్ చేశారు. ఎనిమిదో నిమిషంలో పాకిస్థాన్‌కు లభించిన పెనాల్టీ కార్నర్ అవకాశాన్ని నదీమ్ సమీపం నుండి గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. రెండో క్వార్టర్‌లో సర్కిల్ మధ్య నుండి అభిషేక్ చక్కటి గోల్‌తో స్కోరును సమం చేశాడు. రెండు నిమిషాల తర్వాత, హర్మన్‌ప్రీత్ కొట్టిన డ్రాగ్‌ఫ్లిక్ గోల్ పోస్ట్‌కు తగిలి రీబౌండ్ కాగా నీలకంఠ దాన్ని గోల్‌గా మలిచాడు. 40వ నిమిషంలో సుఖ్‌జీత్ అద్భుతమైన డైవింగ్ షాట్‌తో భారత్ ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. జూన్ 25న ఇంగ్లాండ్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది.



# పెట్టుబడుల విత్‌డ్రాతో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తీవ్ర స్థాయి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బలహీనమైన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ర్యాలీ తర్వాత లాభాల స్వీకరణ ప్రభావంతో సెన్సెక్స్ దాదాపు 900 పాయింట్లు క్షీణిస్తే నిఫ్టీ 23,850స్థాయి దిగువకు జారిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 893.39పాయింట్లు క్షీణించి76,200.68వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ278.80పాయింట్లు నష్టపోయి 23,824.10 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లలో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ముఖ్యంగా దక్షిణ కొరియా కోస్పీ సూచీ 9 శాతానికి పైగా కుప్పకూలడంతో ట్రేడింగ్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఐటీ, మెటల్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. మరోవైపు అమెరికా డాలర్ బలపడటం, రూపాయి బలహీనపడటం, ఇన్ఫోసిస్ 3.42శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.75 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.55 శాతం నష్టపోయినిఫ్టీకి ఎక్కువ నష్టం తెచ్చాయి . బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.88 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం క్షీణించాయి.




ఎన్ఎస్ఈలో 1,020 షేర్లు లాభపడగా, 2,280 షేర్లు నష్టపోయాయి. 99షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.826 శాతానికి తగ్గింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 94.73 వద్ద స్థిరపడింది. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ ధర 0.96 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,46,722కు చేరితు బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 77.41 డాలర్లకు పడిపోయింది. గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేటు పెంపులు చేపట్టే అవకాశాలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్నాయి. ఈ ఏడాది ముగిసేలోపు కనీసం రెండు సార్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున వడ్డీ రేట్లు పెరగవచ్చని మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. వాల్ స్ట్రీట్‌లో సోమవారం ఎస్అండ్‌పీ 500 సూచీ 0.37 శాతం, నాస్‌డాక్ 1.32 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ స్వల్ప లాభంతో ముగిసింది. ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ షేరు 1.55 శాతం పెరిగితే వేదాంత షేరు భారీ బ్లాక్ డీల్స్ కారణంగా 7.73 శాతం కుప్పకూలింది.

ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) 2.79 శాతం, ఎన్‌పీఎస్‌టీ 5.54 శాతం ఎగిసింది. సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ 3.05 శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ రూ.165 కోట్ల ఆర్డర్ పొందడంతో 1.19 శాతం లాభపడింది. బిర్లా కార్పొరేషన్ 1.32 శాతం, డిఫ్యూజన్ ఇంజినీర్స్ 2.55 శాతం పెరిగాయి. టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ ఐపీఓకు 1.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం ఐపీఓకు కేవలం 0.18 రెట్లు మాత్రమే స్పందన వచ్చింది. అద్వైత్ జ్యువెల్స్ ఐపీఓకు మాత్రం భారీ స్పందన లభించి 10.49 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.



# ధరల్లో భారీ పతనం.. 3 శాతం తగ్గుదల

# పసిడి, వెండిపై ఫెడ్ రిజర్వు ఎఫెక్ట్

**ముంబై, జూన్ 23 :** అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు పాల్పడవచ్చన్న అంచనాలు ప్రపంచ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపడంతో మంగళవారం బంగారం, వెండి ధరలు బలహీనయ్యాయి. పసిడి వెండి ధరలు 3 శాతం వరకు తగ్గాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఆగస్టు డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 10 గ్రాములకు రూ.1,46,776 వద్ద ప్రారంభమైంది. గత ముగింపు ధర రూ.1,48,188తో పోలిస్తే రూ.1,412తక్కువ. మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం ధర రూ.1,46,379 వద్ద ట్రేడవుతూ, గత ముగింపుతో పోలిస్తే రూ.1,739 నష్టాన్ని నమోదు చేసింది. ట్రేడింగ్ సెషన్‌లో గరిష్టంగా రూ.1,47,090, కనిష్టంగా రూ.1,46,070 స్థాయిలను తాకింది. ఇక జూలై డెలివరీ వెండి ఫ్యూచర్స్‌లో బంగారంతో పోలిస్తే మరింత ఒత్తిడి కనిపించింది. వెండి ధర కిలోకు రూ.2,27,676 వద్ద ప్రారంభమై, గత ముగింపు ధర రూ.2,34,310తో పోలిస్తే రూ.6,634తగ్గింది. తదుపరి ట్రేడింగ్‌లో వెండి ధర2,27,119 వద్ద కొనసాగుతూ రూ.7,191 నష్టాన్ని చవిచూసింది. రోజంతా కనిష్టంగా రూ.2,26,556 స్థాయిని తాకి 3.30 శాతం వరకు పడిపోయింది. గరిష్టంగా 2,28,800 వద్ద నమోదైంది. రానున్న కాలంలో రూ.2,30,500 రూ.2,31,600 మధ్య ప్రతిఘటన ఉండగా, రూ.2,28,000మద్దతుస్థాయికి దిగువకు వెళితే ధరలు రూ.2,26,000, ఆపై రూ.2,24,000 వరకు పడిపోయే అవకాశం ఉందని బులియన్ నిపుణులు అంచనా వేశారు. మరోవైపు, వెండి ధర మళ్లీ రూ.2,30,000 మార్కును అధిగమిస్తే కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అమెరికా డాలర్ బలపడటం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించవచ్చన్న అంచనాలే విలువైన లోహాల ధరల బలహీనతకు ప్రధాన కారణమని నిపుణులు వివరించారు. అదనంగా, ఈ వారం విడుదల కానున్న అమెరికా ఉపాధి, నిరుద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారని, అవే బంగారం, వెండి ధరల దశదిశలు నిర్ణయించే కీలక అంశాలుగా మారవచ్చని నిపుణుల అంచనా.

# బ్యాంకింగ్ వ్యవస్థలోకి 1.41లక్షల కోట్ల నగదు ప్రవేశపెట్టిన ఆర్బీఐ




**ముంబయి, జూన్ 23:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్ఆర్ అంటే వేరియబుల్ రేట్ రెపో వేలం ద్వారా రూ.1.41లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదలచేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈచర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. ఈనెల 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ, 22నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ క్రమంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే, నిధుల సమీకరణ వ్యయంపెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాల వల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది.

తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్ఆర్ వేలం ప్రక్రియను నిర్వహిస్తుంది. బ్యాంకులు తమ వద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్‌రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజాచర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.


# మూడు రోజుల్లోనే 52లక్షల కోట్లు హాంఫట్



**ముంబై, జూన్23:** పీవోతో మార్కెట్‌లోకి అడుగుపెట్టిన సంచలనం నమోదుచేసిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఈ కంపెనీ షేర్లు వరుసగా మూడోరోజూ పతనమయ్యాయి. కేవలం మూడు రోజుల్లోనే కంపెనీమార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లకుపైగా (సుమారు రూ.52 లక్షల కోట్లు) కరిగిపోయింది. స్పేస్‌ఎక్స్ షేరు మరో 16 శాతం క్షీణించి 154.60 డాలర్ల వద్ద ముగిసింది. కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

గత మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు మొత్తం 23శాతం పడిపోయింది. దీంతో మార్కెట్ విలువ భారీగా తగ్గినా కంపెనీ మొత్తం విలువ ఇంకా 2 ట్రిలియన్ డాలర్లకు పైగానే ఉంది. ఏఐ రంగంలో విస్తరణకోసం స్పేస్‌ఎక్స్ భారీమొత్తంలో నిధులు సమీకరించేందుకు బాండ్లు జారీ చేయనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల కంపెనీపై అప్పుల భారం పెరిగే అవకాశం ఉందని, ఏఐ పెట్టుబడులు ఆశించిన ఫలితాలు ఇస్తాయా అనే సందేహాలు కూడా ఇన్వెస్టర్లలోవ్యక్తమయ్యాయి. దీంతో షేర్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రికార్డు ఐపీవో తర్వాత స్పేస్‌ఎక్స్ షేర్లపై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి భారీగా కనిపించింది. తొలి ఐదు రోజుల్లోనే వ్యక్తిగత పెట్టుబడిదారులు 405మిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. స్పేస్‌ఎక్స్ భవిష్యత్ వృద్ధిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండటంతో షేర్ ధర చాలా పెరిగిందని, అందుకే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఏఐతో 21వేల మందికి కోతపెట్టిన ఒరాకిల్




**న్యూయార్క్:** కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీ వేలాది ఉద్యోగాలపై ప్రభావం చూపిస్తోంది. అమెరికా టెక్నాలజీ దిగ్గజం ఒరాకిల్ 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 21వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత కార్యకలాపాల విస్తరణ, వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తన వార్షిక నివేదికలో పేర్కొంది. గత ఏడాది 1.62 లక్షల మంది ఉద్యోగులు ఉండగా 2026 మే 31 నాటికి ఆ సంఖ్య 1.41 లక్షలకు తగ్గింది. సంస్థ ఉద్యోగుల సంఖ్యలో ఇది దాదాపు 13 శాతం తగ్గుదల. ఏఐ టెక్నాలజీల వినియోగం ఇప్పటికే ఉద్యోగ కోతలకు దారితీసిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కోతలు కొనసాగొచ్చని ఒరాకిల్ స్పష్టం చేసింది. ఒరాకిల్ ప్రస్తుతం డేటాబేస్ సాఫ్ట్‌వేర్ సంస్థగానే కాకుండా, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాల్లో కీలక సంస్థగా ఎదగడానికి భారీ పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థల అవసరాల కోసం భారీ డేటా సెంటర్ల నిర్మాణంలో నిమగ్నమైంది. ఇందుకోసం ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 70 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రణాళికలకు నిధులు సమకూర్చేందుకు మరో 40 బిలియన్ డాలర్లు రుణాలు, ఈక్విటీ రూపంలో సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఈ భారీ ఏఐ పెట్టుబడులు సంస్థపై ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగుల తొలగింపుల కోసం 2026 ఆర్థిక సంవత్సరంలో ఒరాకిల్ 1.84 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఈ వ్యయం కేవలం 374 మిలియన్ డాలర్లు మాత్రమే ఉండటం గమనార్హం.

# 109.27 కోట్లకు ఇంటర్నెట్ కనెక్షన్లు: ట్రాయ్




**న్యూఢిల్లీ, జూన్ 23:** భారత టెలికాం రంగం శరవేగంతో వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య భారీ స్థాయిలో పెరిగినట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా నివేదిక వెల్లడించింది. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా, కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ (మొబైల్) ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా, న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తో పాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది.

దీంతో దేశవ్యాప్తంగా టెలిడెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం (ఏఆర్‌పీయూ) కూడా టెలికాం సంస్థలకు సానుకూలంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.